జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | బుధవారం 16 ఏప్రిల్ 2025 | సంపుటి : 15 | సంచిక : 221 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

జగన్ రెచ్చగొడుతున్నారు

- సీఎం చంద్రబాబు ఆగ్రహం
- కుల, మత ప్రాంతాలను జగన్ రెచ్చకొడుతున్నాడని సీఎం మండిపాటు
- ఎస్వీ గోశాల, పాస్టర్ ప్రవీణ్, వక్ఫ్ బిల్లుపై మతాలను రెచ్చగొడుతున్నారు
- రాజకీయంగా అంతా బాగానే ఉన్నా అధికారుల స్థాయిలో ఈ తరహా చర్చలు సరికాదు

సచివాలయంలో మంత్రివర్గ సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు మంత్రులతో తాజా రాజకీయ పరిణామాలు, వివిధ అంశాలపై చర్చించారు. కుల, మత ప్రాంతాలను జగన్ రెచ్చకొడుతున్నాడని

ఏపీ కేబినెట్ సమావేశం

- పలు కీలక అంశాలపై చర్చ
- సచివాలయంలో సీఎం చంద్రబాబు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- సీఆర్డీఏ 46వ అథారిటీ నిర్ణయాలకు ఆమోదం తెలపనున్న మంత్రివర్గం

'స్వయంప్రతిపత్తి' కోసం తమిళనాడు

- స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం
- తమిళనాడు స్వయంప్రతిపత్తిపై సూచనలకు కమిటీ గవర్నర్ ఆర్ఎన్ రవితో విభేదాల వేళ తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం
- రాష్ట్ర హక్కులను కేంద్రం క్రమంగా లాక్కుంటోందని ఆరోపణ

సీఎం రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం

- నోవాటెల్ హోటల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఉన్న లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య
- 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో సమస్య
- డోర్లు వేయకముందే 2 అడుగుల మేర కిందకు జారడంతో వెంటనే సీఎం సెక్యూరిటీ, హోటల్ సిబ్బంది అప్రమత్తం

మే 2కు వాయిదా పడిన మోదీ అమరావతి పర్యటన!

అమరావతి రీ స్టార్ట్ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆహ్వానించిన ప్రభుత్వం

తెలంగాణలో కొలువుల జాతర!

- త్వరలో 20 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం సమాయత్తం!!
- నోటిఫికేషన్లకు తెలంగాణ సర్కారు సమాయత్తం
- 20 వేల పోస్టుల భర్తీకి అవకాశం
- నెలాఖరులోగా ప్రక్రియ ప్రారంభం
- త్వరలో ఖాళీల గుర్తింపు

గీత దాటితే ఊరుకునేది లేదు

- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సీరియస్
- శంషాబాద్ నోవాటెల్ వేదికగా కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ సమావేశం
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచన

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎల్పీ సమావేశంలో సీరియస్ అయ్యారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శంషాబాద్?లోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సీఎల్పీ సమావేశంలో సీఎం పార్టీ ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల ముందు మాట్లాడారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని స్పష్టం చేశారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని తెలిపారు.ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదు : మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠాన నిర్ణయమే ఫైనల్ అంటూ తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగంలేదన్నారు. జనంలోకి వెళ్లి

మొదటిపేజీ తరువాయి

ఏపీ కేబినెట్ సమావేశం

అమరావతి సచివాలయంలో నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగనుంది. సీఆర్డీఏ 46వ ఆథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలపనుంది. అమరావతి నిర్మాణం కోసం అవసరమైన నిధులు సమీకరించుకునేందుకు సీఆర్డీఏ కమిషనర్‌కు అనుమతి ఇవ్వనుంది. రాజధాని పరిధిలో 92 పనులకు గాను 65 వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా వేసింది.నూతన అసెంబ్లీ, హైకోర్టు భవనాల టెండర్ దక్కించుకున్న సంస్థలకు పనులు కేటాయించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేయనుంది. 5వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. దాదాపు 30,667 కోట్లు పెట్టుబడులు, 32,133 ఉద్యోగాలు వచ్చే ప్రతిపాదనలకు ఆమోదం తెలియజేయనున్నారు. ఐటీ కంపెనీలకు నామమాత్రపు ధరకే భూకేటాయింపు చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఎస్సీ వర్గీకరణ నివేదిక పైనా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సాయంత్రం పర్సెప్షన్ ట్రాకింగ్?పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేయనున్నారు.

నోవాటెల్‌లో సీఎం రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం

సీఎం రేవంత్ రెడ్డి నోవాటెల్‌లో జరుగుతున్న కాంగ్రెస్ సీఎల్పీ సమావేశానికి వెళ్తున్న క్రమంలో హోటల్ లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది. సీఎం అందులోనే ఉండటంతో అందరూ టెన్షన్ పడ్డారు. లిఫ్ట్ ఆగాల్సిన చోటుకంటే రెండు అడుగులు కిందకు దిగింది.ఓవర్ వెయిట్ కారణంతోనే : 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో సమస్య వచ్చినట్లు హోటల్ సిబ్బంది తెలిపారు. లిఫ్ట్ డోర్లు వేయకముందే 2 అడుగుల మేర కిందకు జారడంతో వెంటనే సీఎం సెక్యూరిటీ, హోటల్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. లిఫ్ట్ ఓపెన్ చేసి సీఎంను సెకండ్ ఫ్లోర్?కు పంపారు. తరువాత వేరే లిఫ్ట్?లో ముఖ్యమంత్రిని తరలించారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మే 2కు వాయిదా పడిన మోదీ అమరావతి పర్యటన!

అమరావతి రీ స్టార్ట్ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆహ్వానించిన ప్రభుత్వం ఆయన అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూస్తోంది. ఈ నెలలోనే ఇప్పటికే ఆ ప్రోగ్రాం పూర్తి చేయాల్సి ఉంది.ఎప్పటి నుంచో ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. మోదీ చేత ఆ ప్రారంభం ఏదో చేయిస్తే పనులు .. రీస్టార్ట్ చేయవచ్చని అనుకుంటున్నారు. ఇప్పటికే దాదాపుగా నలభై వేల కోట్ల రూపాయలకుపైగా విలువైన పనుల్ని కాంట్రాక్టర్లకు ఇచ్చారు.అయితే మోదీ ఏపీకి రావాలంటే చాలా సమీకరణాలు ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల ఓపెనింగ్, శంకుస్థాపనలు చూసుకోవాల్సి ఉంటుంది. అలాంటి కార్యక్రమాలను సమన్వయం చేసుకోవడానికి తేదీ వాయిదా పడుతూ వస్తోంది. ఇప్పటికి మే రెండో తేదీ ఖరారు అయినట్లుగా మంత్రి నారాయణ ప్రకటించారు. అయితే అది ఫైనలా కాదా అన్నది మాత్రం.. ముందు ముందు క్లారిటీ వస్తుంది.అమరావతిలో పనులు ప్రారంభించడానికి కాంట్రాక్టులు పొందిన సంస్థలు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నాయి. కావాల్సిన మౌలిక సదుపాయాలను అమరావతికి తరలించుకుంటున్నాయి. భారీ యంత్రాలతో పనులు చేయనున్నారు. అలాగే మ్యాన్ పవర్ ను సమీకరించుకుంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మూడేళ్లలో కోర్ క్యాపిటల్ నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మోదీ రీస్టార్ట్ చేసిన వెంటనే పనులు అధికారికంగా పరుగులు పెట్టనున్నాయి. అమరావతికి నిధుల సమస్యే లేదు.

ఈ ఏడాది వానలే వానలు

భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం చల్లటి కబురు చెప్పింది. మన దేశంలో ఈ

ఏడాది వర్షాకాలంలో సాధారణం కంటే ఎక్కువే వర్షపాతం నమోదవుతుందని పేర్కొంటూ అంచనాలను విడుదల చేసింది. ఈదఫా మొత్తం వర్షాకాలం సీజన్‌లో 'ఎల్ నినో' తరహా వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశమే లేదని తేల్చి చెప్పింది. మంగళవారం దిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మోహపాత్ర వెల్లడించారు. “జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు నెలల పాటు వర్షాకాలం ఉంటుంది. ఈ వ్యవధిలో సాధారణం కంటే ఎక్కువే వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీర్ఘకాలిక వర్షపాత సగటు 87 సెంటీమీటర్లు. ఇందులో దాదాపు 105 శాతం మేర సగటు వర్షపాతం ఈసారి వానాకాలం సీజన్‌లో కురవొచ్చు” అని ఆయన తెలిపారు. “ఎల్ నినో తరహా వాతావరణ పరిస్థితులు ఏర్పడితే వర్షాకాలంలో సాధారణం కంటే తక్కువ స్థాయిలో వర్షాలు పడతాయి. ఈసారి భారత్‌లో ఆ తరహా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపించడం లేదు” అని మృత్యుంజయ్ మోహపాత్ర చెప్పారు.

జూన్ వరకు వడగాలుల దడ :ఇప్పటికే దేశంలోని చాలా ఉత్తరాది రాష్ట్రాల్లో వడగాలులు దడ పుట్టిస్తున్నాయి. వాటి వల్ల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నెల (ఏప్రిల్) నుంచి జూన్ వరకు వడగాలుల తీవ్రత క్రమంగా పెరిగే అవకాశం ఉందని ఐఎండీ నిపుణులు అంటున్నారు. దీనివల్ల ప్రభావిత ప్రాంతాల్లోని విద్యుత్ గ్రిడ్‌ల పనితీరుకు ఆటంకం కలగొచ్చు. నీటి కొరత సమస్య ఏర్పడొచ్చు. భారత వ్యవసాయ రంగానికి వర్షపాతమే ప్రధాన ఆధారం.

రైతన్నలకు పండుగ లాంటి వార్త : నేటికీ భారత్‌లోని దాదాపు 42.3 శాతం మంది జనాభాకు ప్రధాన జీవనాధారం వ్యవసాయ రంగమే. మనదేశ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో 18.2 శాతం వాటా వ్యవసాయ రంగం నుంచే సమకూరుతోంది. దేశంలోని పంట సాగు భూముల్లో దాదాపు 52 శాతం వర్షాధార ప్రాంతాల్లోనే ఉన్నాయి. వర్షాలు కురిస్తే రిజర్వాయర్లు నిండుతాయి. వాటి నుంచే ప్రజలకు తాగునీటిని సప్లై చేయడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు జలాలను పంపిణీ చేస్తారు. అందుకే సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురుస్తుంది అనేది రైతన్నలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద శుభవార్త. ఆందోళనకర అంశం ఏమిటంటే, మన దేశంలో ఏటా వర్షాకాలం(నాలుగు నెలల కాలం)లో వర్షాలు కురిసే రోజులు క్రమంగా తగ్గుతున్నాయి. ఇక ఇదే సమయంలో అతి తక్కువ రోజుల్లో అతిభారీ వర్షాలు కురిసే ఘటనలు పెరుగుతున్నాయి. ఫలితంగా వరద బీభత్సం ఏర్పడి ఎంతో నష్టం వాటిల్లుతోంది. వాతావరణ మార్పుల వల్లే ఈ వైపరీత్యాలు జరుగుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గీత దాటితే ఊరుకునేది లేదు

మొదటిపేజీ తరువాయి

ప్రతిష్ఠను పెంచాలన్నారు. ఈ సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.సన్నబియ్యం పథకం ఒక అద్భుతం : ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని సీఎం పేర్కొన్నారు. సన్నబియ్యం పథకం ఒక అద్భుతమని ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకమని సీఎం వివరించారు. భూ భారతిని రైతులకు చేరవేయాలన్నారు. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆదర్శంగా నిలిచిందని క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులకే అందాలని దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.వారికి శాశ్వత పరిష్కారం చూపాం : కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించామన్న సీఎం విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చామని ఇది ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమని వెల్లడించారు. జటిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని తెలిపారు.విష ప్రచారం చేస్తున్నారు : హెచ్‌సీయూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్?తో ఒక అబద్ధపు ప్రచారం చేసిందని, ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. బీజేపీ, బీఆర్?ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుందని మనం ఎంత మంచి చేసినా ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదన్నారు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలని పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు.తెలంగాణ మోడల్‌పై చర్చ జరుగుతోంది : మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారని ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారన్నారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి,బిక్కిరి అవుతున్నారని తెలిపారు. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారిందన్నారు రాయబోతోందన్నారు.దేశంలో తెలంగాణ మోడల్?పై చర్చ జరుగుతోందని తెలిపారు. అందుకే తెలంగాణలో కాంగ్రెస్?ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆరెస్ ఒక్కటయ్యాయన్నారు. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సన్న బియ్యం మన పథకం మన పేటెంట్, మన బ్రాండ్ అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

తెలంగాణలో కొలువుల జాతర!

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో కీలకమైన ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తికావడంతో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ల జారీకి తెలంగాణ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. టీజీపీఎస్సీ, గురుకుల, పోలీసు, వైద్య నియామక సంస్థల ద్వారా పోస్టులను భర్తీ చేయనుంది. ఈ నెలాఖరులోగా ఉద్యోగ ప్రకటనల జారీ ప్రక్రియను మొదలుపెట్టాలని సర్కారు యోచిస్తోంది. వివిధ విభాగాల్లో ఖాళీల గుర్తింపు ప్రక్రియ పూర్తిచేసి, నియామకాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయనుంది. దాదాపు 20 వేల పోస్టులకు నియామక ప్రకటనలు(రిక్రూట్?మెంట్ నోటిఫికేషన్?) వెలువడే అవకాశాలున్నట్లు ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఉద్యోగ ఖాళీలు గుర్తించనున్న ప్రభుత్వ యంత్రాంగం : రాష్ట్రంలో ప్రభుత్వ కొలువుల భర్తీకి ఏటా క్యాలెండర్(జాబ్? క్యాలెండర్) ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2024-25 ఏడాదికి ఉద్యోగ క్యాలెండర్?ను జారీ చేసింది. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా

సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు కొత్త నోటిఫికేషన్లు జారీ చేయబోమని సర్కారు స్పష్టం చేసింది. దీంతో గత ఏడాది సెప్టెంబరు నుంచి వెలువడాల్సిన ఉద్యోగ నియామక ప్రకటనలు నిలిచిపోయాయి. దీంతో జాబ్ క్యాలెండర్ ప్రక్రియ తాత్కాలికంగా ఆగిపోయింది. సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ నెల 14 నుంచి వర్గీకరణ అమల్లోకి వచ్చింది. వర్గీకరణ పూర్తికావడంతో ప్రభుత్వం ఖాళీల గుర్తింపు ప్రక్రియను మొదలుపెట్టనుంది. రెండు, మూడు రోజుల్లో పలు విభాగాల అధికారులు సమావేశమై ఉద్యోగ ఖాళీలు గుర్తించనున్నారు.కనీసం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేసే అవకాశం : కనీసం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలన్న లక్ష్యంతో సర్కారు ఉంది. ఆర్టీసీ, వైద్య విభాగాల పరిధిలోనే దాదాపు 10 వేల వరకు పోస్టులు ఉంటాయని అంచనా వేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సులు, ఫార్మాసిస్టులు కలిపి దాదాపు ఐదు వేల ఖాళీలు ఉన్నాయి. ఇంజినీరింగ్ విభాగాల్లోనూ 2-3 వేల వరకు ఖాళీలు ఉన్నట్లుగా సమాచారం. కొన్ని పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు కమిషన్‌కు చేరినట్లుగా తెలిసింది. మరో గ్రూప్-1 నోటిఫికేషన్ జారీకి పోస్టులను ప్రభుత్వం గుర్తిస్తోంది. గురుకుల, ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు భారీగా ఉన్నాయి. గత గురుకుల నియామక ప్రక్రియలో దాదాపు రెండు వేల వేల పోస్టులు బ్యాక్‌లాగ్‌గా మారాయి. గ్రూప్-4 స్థాయి ఉద్యోగాలతో పాటు పోలీసు విభాగంలోనూ భారీగా ఖాళీలున్నట్లుగా ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

'స్వయంప్రతిపత్తి' కోసం తమిళనాడు

మొదటిపేజీ తరువాయి

గవర్నర్ ఆర్ఎన్ రవితో విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమిళనాడు స్వయంప్రతిపత్తి కోసం చర్యలను సిఫార్సు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎం స్టాలిన్ అసెంబ్లీలో ప్రకటన చేశారు. రాష్ట్ర హక్కులను కేంద్రం క్రమంగా లాక్కుంటోందని ఆరోపించారు.సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ రాష్ట్ర స్వయంప్రతిపత్తిని నిర్ధారిస్తుంది. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాన్ని వివరంగా పరిశీలిస్తుంది. జనవరి 2026లో తన మధ్యంతర నివేదికను సమర్పిస్తుంది. ఈ కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎం. నాగనాథన్ సభ్యులుగా ఉంటారు. సిఫార్సులతో కూడిన తుది నివేదికను ఈ కమిటీ రెండేళ్లలో సమర్పించనున్నట్లు స్టాలిన్ తెలిపారు.

'నీట్ పరీక్షను వ్యతిరేకిస్తుంటాం'

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ కమిటీ పరిశోధన చేసి సిఫార్సులు చేస్తుందని స్టాలిన్ పేర్కొన్నారు. అలాగే నీట్ పరీక్ష, త్రిభాషా విధానంపై కేంద్రం అనుసరిస్తున్న తీరుపై విమర్శలు గుప్పించారు. నీట్ కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. నీట్ పరీక్షను నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉంటామని తెలిపారు.

త్రిభాషా విధానంపై విమర్శలు

త్రిభాషా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం తమపై హిందీని బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తోందని స్టాలిన్ ఆరోపించారు. తమిళనాడు సర్కార్ జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించినందున, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన రూ. 2500 కోట్లు నిధులను ఆపేసిందని విమర్శించారు. విద్యను ఉమ్మడి జాబితాకు మార్చడానికి అనుమతించే 42వ రాజ్యాంగ సవరణను రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర జాబితాలో విద్య ఉండాలని డిమాండ్ చేశారు.

గవర్నర్ వర్సెస్ తమిళనాడు సర్కార్

బిల్లుల ఆమోదంపై గవర్నర్, తమిళనాడు ప్రభుత్వం మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుతో స్టాలిన్ సర్కార్?కు ఉపశమనం లభించింది. పెండింగులో పెట్టిన పది బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని న్యాయస్థానం స్పష్టం చేసిన నేపథ్యంలో వాటికి చట్టబద్ధమైన హోదా కల్పిస్తూ ప్రభుత్వం గెజిట్ రిలీజ్ చేసింది. ఈ పరిణామాల వేళ రాష్ట్ర స్వయంప్రతిపత్తిపై సూచనలకు కమిటీని ఏర్పాటు చేస్తూ స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జగన్ రెచ్చగొడుతున్నారు

మొదటిపేజీ తరువాయి

మరణం, వక్ఫ్ బోర్డు బిల్లు అంశాలతో 3 మతాలను రెచ్చగొడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ వైఖరి ఎలా ఉందో కళ్లముందు కనిపిస్తోందన్న సీఎం ఆ కుట్రలను సమర్థంగా తిప్పికొడుతూనే ప్రజల్ని చైతన్య పరచాలని మంత్రులకు చెప్పారు.అధికారుల అవినీతిపై తరచూ చర్చ జరుగుతుండటం సీఎం చంద్రబాబు కేబినెట్‌లో ప్రస్తావించారు. రాజకీయంగా అంతా బాగానే ఉన్నా అధికారుల స్థాయిలో ఈ తరహా చర్చలు సరికాదని స్పష్టం చేశారు. ఏ శాఖ పరిధిలోని మంత్రులు ఆ శాఖ అంశాలపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యూరోక్రసీలో అవినీతిపై ఈ మధ్య ఎక్కువగా చర్చకు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ తీసుకురావాలని మంత్రివర్గం నిర్ణయించింది. మత్స్యకార భరోసా అమలుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.ఎలాంటి గందరగోళం ఉండకూడదు: మనం తీసుకునే రాజకీయ నిర్ణయాల్లో ఎలాంటి గందరగోళం ఉండకూడదని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు ఏది మంచో అదే నిర్ణయాన్ని మనం తీసుకుంటున్నామని వెల్లడించారు. వైఎస్సార్సీపీ వక్ఫ్ బోర్డ్ బిల్లు అంశంలో 3 రకాలుగా వ్యవహరించిందని తెలిపారు. పార్లమెంట్?లో ఒకలా, రాజ్యసభలో మరోలా, కోర్టులో మరోలా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ నేతల రాజకీయ కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండకడుతూనే, మనం తీసుకున్న నిర్ణయాల్లో ఎలాంటి గందరగోళం లేకుండా చూసుకోవాలని మంత్రులకు స్పష్టం చేశారు.ఏపీని తొలిస్థానంలో నిలపడమే లక్ష్యం: అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే తొలిస్థానంలో నిలపడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు తాను ముఖ్యమంత్రిగా ప్రయాణం మొదలుపెట్టిన రోజులను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో బెంగళూరు తొలిస్థానంలో ఉండగా హైదరబాద్‌ను రెండో స్థానానికి తీసుకొచ్చామని అన్నారు. అప్పట్లో తాము తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే నేడు హైదరాబాద్ అన్ని రంగాల్లో ముందుందని అన్నారు. వృద్ధి రేటులో ఇప్పుడు ఏపీ రెండోస్థానంలో ఉందని దీన్ని తొలిస్థానానికి తీసుకెళ్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

మీరు జుట్టుకు ఏ హెయిర్ ఆయిల్‌ను వాడుతున్నారు..?
జుట్టు స్థితిని బట్టి ఎలాంటి ఆయిల్‌ను వాడితే మంచిది..?

శిరోజాల సంరక్షణకు ప్రస్తుతం అందరూ ప్రాధాన్యతను ఇస్తున్నారు. స్త్రీలే కాదు పురుషులు కూడా తమ కురులను అందంగా మార్చుకుంటున్నారు. అయితే అన్నీ బాగానే పాటిస్తుంటారు కానీ హెయిర్ ఆయిల్ విషయంలోనే సరైన జాగ్రత్తలు తీసుకోరు. దీంతో జుట్టు సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. అలాగే ఈ ఆయిల్ వల్ల చర్మం కూడా జిడ్డుగా మారుతుంది. ఇక కొందరు ఎప్పుడు పడితే అప్పుడే హెయిర్ ఆయిల్‌ను అప్లై చేస్తుంటారు. కానీ హెయిర్ ఆయిల్ విషయంలోనూ జాగ్రత్తలను పాటించాలి. అప్పుడే శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. మన జుట్టుకు అన్ని ఆయిల్స్ సరిపోవు. ఎలాంటి హెయిర్ ఆయిల్ ఎవరికి మేలు చేస్తుంది.. అన్న వివరాలను తెలుసుకుని అప్పుడు ఆయిల్‌ను ఉపయోగించాలి. దీంతో మంచి ఫలితాలు రాబట్టవచ్చని బ్యూటిషియన్లు చెబుతున్నారు. ఇక ఎలాంటి ఆయిల్‌ను జుట్టుకు వాడితే ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

కొబ్బరినూనె..

సాధారణంగా కొబ్బరినూనెను అధిక శాతం మంది జుట్టుకు వాడుతుంటారు. ఇది జుట్టు కుదుళ్ల లోపలికి కూడా వెళ్లగలదు. దీంతో శిరోజాలకు పోషణ లభిస్తుంది. కొబ్బరినూనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. దీని వల్ల తలలో ఉండే ఇన్‌ఫెక్షన్లు కూడా తగ్గుతాయి. ఇన్‌ఫెక్షన్ కారణంగా చుండ్రు సమస్యతో బాధపడేవారు కొబ్బరినూనెను వాడితే మంచి ఫలితం ఉంటుంది. ఈ నూనెలో మన జుట్టుకు అవసరం అయ్యే ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. అలాగే విటమిన్లు ఇ, కెలతోపాటు ఐరన్ కూడా లభిస్తుంది. ఇవన్నీ జుట్టుకు పోషణను అందిస్తాయి. కొబ్బరినూనెను జుట్టుకు వాడుతుంటే శిరోజాలు సుతి మెత్తగా మారుతాయి. శిరోజాల ఎదుగుదలకు కొబ్బరినూనె ఎంతో సహాయం చేస్తుంది.

జొజొబా ఆయిల్..

మార్కెట్‌లో మనకు జొజొబా ఆయిల్ కూడా లభిస్తుంది. జొజొబా అనే మొక్కకు చెందిన గింజల నుంచి ఈ నూనెను తీస్తారు. ఈ మొక్కలు అమెరికాలోని ఎడారుల్లో పెరుగుతాయి. ఈ విత్తనాలను డీర్ నట్స్‌అని కూడా పిలుస్తారు. అమెరికన్లు తమ జుట్టుకు ఎక్కువగా జొజొబా ఆయిల్‌ను ఉపయోగిస్తుంటారు. జుట్టు బాగా పొడిగా మారిన వారు, తరచూ తలంతా పొడిగా మారుతున్న వారు ఈ నూనెను వాడాలి. జిడ్డు చర్మం అయ్యే వారు ఈ నూనెను వాడకూడదు. ఇక శిరోజాల సంరక్షణకు ఆలివ్ ఆయిల్ కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇది జుట్టును మంచి కండిషనింగ్‌లో ఉంచుతుంది. గ్రీకులు ఆలివ్ ఆయిల్‌ను అధికంగా ఉపయోగిస్తారు. జుట్టు బాగా పలుచగా ఉన్నవారు, జుట్టు బాగా రాలిపోతున్న వారు ఆలివ్ ఆయిల్‌ను వాడితే మేలు జరుగుతుంది. ఇది శిరోజాల పెరుగుదలకు కావల్సిన పోషణను అందిస్తుంది.

ఆముదం..

మన పెద్దలు ఎంతో పూర్వం కాలం నుంచి ఆముదాన్ని జుట్టుకు ఉపయోగిస్తున్నారు. దీని వాసన కారణంగా చాలా మంది దీన్ని జుట్టుకు ఉపయోగించరు. కానీ దీన్ని తలకు మర్దనా చేసి 2 గంటల పాటు ఉండి తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే శిరోజాలు నల్లగా మారుతాయి. జుట్టు ఒత్తుగా పెరిగి దృఢంగా ఉంటుంది. ఆముదంతో ఇలా మసాజ్ చేస్తుంటే తలపై ఉండే ఇన్‌ఫెక్షన్లు కూడా తగ్గుతాయి. ఆముదం జుట్టుకు పెట్టడం ఇష్టం లేని వారు ఇలా మసాజ్ చేస్తే చాలు. ఎంతో ప్రయోజనం పొందవచ్చు. అలాగే బాదం నూనె కూడా జుట్టుకు ఎంతో మేలు చేస్తుంది. ఇది జిడ్డు లేని నూనె. జిడ్డు చర్మం ఉన్నవారు ఈ నూనెను తలకు వాడాలి. ఇది జుట్టుకు అవసరం అయిన పోషకాలను అందిస్తుంది. ఈ ఆయిల్‌ల ఓలిక్ యాసిడ్, లినోలిక్ యాసిడ్ ఉంటాయి. ఇవి శిరోజాలను సంరక్షిస్తాయి. జుట్టును ఇన్‌ఫెక్షన్ నుంచి రక్షిస్తాయి. ఇలా జుట్టు రకం, చర్మాన్ని బట్టి ఎవరికి తగిన హెయిర్ ఆయిల్‌ను వారు వాడితే అన్ని రకాలుగా ప్రయోజనాలను పొందవచ్చు.

క్షయను జయిద్దాం

క్షయ అనుక్షణం భయపెట్టించే అంటువ్యాధి. నాలుగు వేల సంవత్సరాలుగా మానవ మనుగడను శాసిస్తున్న మహమ్మారి. భూమ్మీద క్షయ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నది భారతదేశంలోనే. ప్రపంచవ్యాప్తంగా సుమారు కోటి ఎనభై లక్షల మంది టీబీతో బాధపడుతుండగా, అందులో నాలుగో వంతు మనదేశంలోనే ఉండటం ఆందోళనకరం. ప్రతి మూడు నిమిషాలకు ఒక రోగి క్షయతో మరణిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ దుస్థితికి కారణం ఈ వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన లేకపోవడం. నిర్లక్ష్యం. క్షయ ప్రధానంగా ఊపిరితిత్తులకు సోకినప్పటికీ, ఇతర అవయవాలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుంది. కాబట్టి, రోగులను దీర్ఘకాలం పాటు పీడించే ఈ ప్రాణాంతకమైన వ్యాధి పూర్వాపరాలను తెలుసుకోవడం తప్పనిసరి. మనదేశంలో రోజుకు ఎంతోమంది క్షయతో మరణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) లెక్కలు వెల్లడిస్తున్నాయి. అందులోనూ ముఖ్యంగా హెచ్‌ఐవీ, క్యాన్సర్ రోగులు, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడే రోగులు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. ఇలా ఉంటే 1882 మార్చి 24న క్షయవ్యాధికి కారణమయ్యే సూక్ష్మజీవిని జర్మనీ శాస్త్రజ్ఞుడు రాబర్ట్ కోచ్ కనుక్కొన్నాడు. వ్యాధి నివారణకు శ్రీకారం చుట్టాడు. దీనికి గుర్తుగా వందేండ్ల తర్వాత నుంచి ఏటా మార్చి 24ను ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినంగా జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి గురించి అవగాహన చేసుకుందాం.

ఎలా వస్తుంది?

ఈ వ్యాధి 'మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్' అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. దీన్ని ట్యూబర్‌క్యులోసిస్ (టీబీ) అని కూడా పిలుస్తారు. ఈ వ్యాధిగ్రస్తులు మాట్లాడినప్పుడు, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఉమ్మివేసిన సందర్భాల్లో గాలిలోకి విడుదల అయ్యే తుంపర్ల వల్ల చుట్టుపక్కల వారికి క్షయ సోకుతుంది. ఈ వ్యాధి రెండు రకాలు. మొదటిది ఊపిరితిత్తుల క్షయ, రెండోది ఇతర అవయవాల క్షయ. ఒకరి నుంచి మరొకరికి వ్యాపించేది ఊపిరితిత్తుల క్షయ.

వ్యాధి లక్షణాలు

2 వారాలు లేదా అంతకంటే ఎక్కువ రోజులు దగ్గు రావడం.
సాయంత్రం, రాత్రి సమయాల్లో జ్వరం, చెమటలు పట్టడం.
అవాంఛనీయంగా బరువు తగ్గడం.
ఆకలి మందగించడం.
ఆయాసం, నీరసించిపోవడం.
దగ్గుతోపాటు తెమడలో రక్తం పడటం.
ఎలా నిర్ధారిస్తారు?

తెమడ పరీక్ష ద్వారా వ్యాధిని గుర్తిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో డీఎన్ఏ పరీక్ష ద్వారా కూడా బ్యాక్టీరియాను గుర్తిస్తారు.

నివారణ సాధ్యమేనా?

క్షయను వందశాతం నివారించవచ్చు. అయితే, వ్యాధిని సకాలంలో గుర్తిస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఈ దిశగా ముందుగా క్షయ వ్యాధిపై ప్రజల్లో పూర్తి అవగాహన ఉండాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే, లేదంటే రెండు వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి ఉన్నట్టు తేలితే వెంటనే మందులు వాడటం మొదలుపెట్టాలి. వైద్యులు సూచించిన మందులను రోగి తు.చ. తప్పకుండా ఆరు నెలలు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. కానీ, కొంతమంది దగ్గు, జ్వరం తగ్గగానే నెల రోజుల్లోనే మందులు మానేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. దీనివల్ల రెండో రకం క్షయ, అంటే మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ ఎండీఆర్ టీబీ వస్తుంది. దీని చికిత్స కాలం 9 నెలల నుంచి ఏడాది కాలం దాక ఉంటుంది. ఈ రకం క్షయకు చికిత్స వ్యయం కూడా ఎక్కువే. పైగా దుష్ప్రభావాలూ అధికంగా ఉంటాయి. ఈ దశలో కూడా మందులు వాడటం నిర్లక్ష్యం చేస్తే వ్యాధి మరింత ముదురుతుంది. ఎక్స్‌టెన్సివ్‌లీ డ్రగ్ రెసిస్టెంట్ ఎక్స్‌డీఆర్ టీబీగా రూపాంతరం చెందుతుంది. ఈ దశలో చికిత్స అందించినా పెద్దగా ప్రయోజనం ఉండదు! ఈ మధ్యకాలంలో ఎండీఆర్, ఎక్స్‌డీఆర్ కేసుల సంఖ్య పెరుగుతుండటం బాధాకరం. కాబట్టి, క్షయ గురించి అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రజలు కూడా క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి. దేశంలో 40 శాతం కన్నా ఎక్కువ మంది వరకు టీబీ ఇన్ఫెక్షన్‌కు లోనైన వాళ్లు ఉంటారు. అయితే, ఇన్ఫెక్షన్‌కు గురైన వాళ్లందరికీ క్షయ రాదు. వాళ్లలో రోగ నిరోధక శక్తి తగ్గడం, తగిన పోషకాహారం తీసుకోని సందర్భంలో ఇన్ఫెక్షన్ వ్యాధిగా మారే ప్రమాదం ఉంది. హ్యూమన్ ఇమ్యూనో వైరస్ (హెచ్‌ఐవీ), క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధి బాధితుల్లో టీబీ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. సకాలంలో వ్యాధిని నిర్ధారించి, కచ్చితమైన మోతాదులో, పూర్తికాలం మందులు వాడితే టీబీని 6 నెలల్లో వంద శాతం నివారించవచ్చు.

డ్రగ్ రెసిస్టెంట్ కేసులకూ మందులు



డ్రగ్ రెసిస్టెంట్ కేసులకు అంటే మందులు వాడిన తర్వాత, వివిధ కారణాల వల్ల రెండోసారి టీబీ బారినపడిన రోగులకు ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో డ్రగ్ రెసిస్టెంట్ కేసుల్లో కేవలం 30 శాతం మాత్రమే ఫలితాలు ఉండేవి. ఇప్పుడు 60 నుంచి 65 శాతం వరకు ఫలితాలు కనిపిస్తున్నాయి.

వంతారా ఎంతో వింతేరా..!







చిన్న పిల్లలకి సహజంగానే జంతువులంటే ఆకర్షణ ఉంటుంది. వాటితో చాలా తొందరగా బంధాన్ని ఏర్పరచుకోగలుగుతారు. వాళ్ల కథల్లోనూ కార్టూన్లలోనూ కూడా ఎప్పుడూ అవే ఉంటాయి. వాటికి ఎలాంటి కష్టమొచ్చినా అయ్యో అని బాధపడిపోతుంటారు. అయితే, అలాంటి ఓ పిల్లాడి అనుబంధమే నేడు 200 ఏనుగులు సహా 2000 దాకా జంతువులను కాపాడే ఓ వన్యప్రాణి సంరక్షణా కేంద్రం ఏర్పాటుకు కారణమైంది. కొన్ని వందల మంది డాక్టర్లు, నిపుణులు వాటి బాగోగులు చూసుకునే బాటయింది. రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీనే ఆ పిల్లవాడు. ఇక, వింతైన ఆ జంతు ప్రపంచమే గుజరాత్ రాష్ట్రపు జామ్ నగరలో ఉన్న 'వంతారా జూ'! అనంత్ అంబానీకి పన్నెండేండ్ల వయసులో తల్లి నీతాతో కలిసి ఓ ఊరికి వెళుతున్నాడు. అందమైన చెట్లు, పరిగెడుతున్నాయా అనిపించే ఊళ్లూ చూస్తూ కూర్చున్నాడు అనంత్. అదే దారిలో ఓ ఏనుగు పిల్ల కనిపించిందతనికి. ఇంకేం, ఎగిరి గంతేసినంత పనిచేశాడు. కానీ పరిశీలించి చూస్తే పాపం అది ఎంతో ఇబ్బందిగా నడుస్తున్నది. మావటి వాడు దాన్ని ఎలాగోలా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. అది చూసిన అనంత్ మనసు చలించిపోయింది. 'పాపం కదా అమ్మా మనం పెంచుకుందామా దాన్ని' అని అడిగాడు. 'సరే నువ్వు జాగ్రత్తగా చూసుకుంటావా మరి'%ౄ%అని అడిగింది తల్లి. 'అవునమ్మా నేను దాన్ని బాగా చూసుకుంటాను' అని చెప్పాడా పిల్లవాడు. అలా ఆ ఏనుగు పిల్ల అనంత్ దగ్గరికి చేరింది. 'దాన్ని తీసుకున్నప్పటికి కనీసం అది ఏం తింటుందో కూడా తెలీదు' అని చెబుతాడు అనంత్. 'మావటి వాడు ఏం చెబితే అదే పెట్టేవాళ్లం. దానికి ఏమైనా అయితే చికిత్స చేయించడానికి కూడా పెద్దగా నిపుణులు అందుబాటులో లేరు. అయితే ఇన్నాళ్లలో మేం చాలా నేర్చుకున్నాం. ఆ ఒక్క ఏనుగే కాదు, ఎన్నో ఆపదలో ఉన్న జంతువులు మా దగ్గర వచ్చి చేరాయి. మరెన్నో గాయాల పాలై, ప్రాణాపాయంలో ఉన్న జీవులు ఇక్కడ కోలుకుని ఆనందంగా ఆడుకుంటున్నాయి. వాటికోసం ఎంతో పరిశోధనలు చేసి వందల సంఖ్యలో నిపుణుల్ని నియమించాం. విభిన్న జాతుల జంతువులు ఇక్కడి అడవిలో చక్కగా తిరుగుతూ ఉండటం చూస్తే ఎవరికైనా ఆనందం కలుగుతుంది' అని తన ఈ ముందడుగు గురించి చెబుతాడు అనంత్. ఇంతకీ వంతారా అంటే ఏమిటో చెప్పలేదు కదూ స్టార్ ఆఫ్ ద ఫారెస్ట్ అడవి చుక్క అని అర్థం! వంతారాలో మొత్తం 43 విభిన్న జాతులకు చెందిన 2000 దాకా జంతువులు ఉన్నాయి. అందులో 200 ఏనుగులు ఉన్నాయి. మంచు చిరుతలు, తెల్ల పులులతో పాటు విభిన్న రకాల చిరుతలు, పులులు, సింహాలు ఇక్కడ తిరుగుతుంటాయి. అనేక రకాల పాములు, మొసళు,, జిరాఫీలు, జీబ్రాలు, హిప్పోలు భారత్ సహా ప్రపంచంలోని విభిన్న ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి చేరాయి. అంతేకాదు, అంతరించిపోతున్న జాతులుగా ఉన్న దేవాంగ పిల్లి, బట్టమేక పిట్ట, రాబందు, ఒకాపి, కారకల్ లాంటి జంతు, పక్షుజాతులెన్నో ఇక్కడ తమ ఉనికిని పెంపొందించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రంలోని జామ్ నగర్‌లో మొత్తం 3000 ఎకరాల్లో ఉన్న దీనిలో ఈ జీవులన్నీ తమ కోసం కేటాయించిన విశాలమైన ప్రాంగణాల్లో సంచరిస్తుంటాయి. అడవుల నరికివేత వల్ల తమ స్థావరాలను కోల్పోవడం, వేట, స్మగ్లింగ్ లాంటి రకరకాల ప్రమాదాలకు గురయిన జంతువులే ఇవన్నీ. వేరువేరు ఆరోగ్య సమస్యలతో వచ్చే వాటిని ఇక్కడి నిపుణులైన వైద్యులు పరిశీలిస్తారు. ప్రపంచంలోనే అగ్రశ్రేణి వైద్యులు, జంతు సంరక్షణ నిపుణులతో పాటు న్యూట్రీషనిస్టులు, పాథాలజిస్టుల్లాంటి 500 మంది అంకిత భావం కలిగిన నిపుణుల బృందం వీటి జబ్బులు, గాయాలను నయం చేసేందుకు పనిచేస్తున్నది. క్రూర జంతువులా, సాధు జంతువులా, సరీసృపాలా అన్నదాన్ని బట్టి అన్ని జంతువులకూ స్వేచ్ఛగా సంచరించేందుకు సరిపడా స్థలాన్ని కేటాయిస్తారు. వీటి బాగోగులు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకునేందుకు 2100 మంది దాకా ఉద్యోగులు ఉన్నారు. 75 యానిమల్ అంబులెన్సులు కూడా ఉన్నాయిక్కడ. వంతారాలో ప్రధాన ఆకర్షణ ఏనుగులే. ఇక్కడ ఉండే 200కు పైగా గజరాజుల సంరక్షణ కోసం 25000 చదరపు అడుగుల్లో ఆసుపత్రి కట్టారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. భారీగా ఉండే ఈ జంతువులకు ఆర్థరైటిస్‌లాంటి ఎముకల సమస్యలు ఏర్పడుతుంటాయి. దానికి హైడ్రోథెరపీ అని చేస్తారు. కాళ్ల సమస్యలు, కీళ్ల నొప్పులు ఉండే ఏనుగులు ఇక్కడి హైడ్రోథెరపీ పూల్స్‌లో కొన్ని గంటల పాటు సేదతీరి, సాంత్వన పొందుతుంటాయి. ఇవికాక, ముల్తానీ మట్టి మసాజ్, జకుజీ (బాత్ టబ్ థెరపీ)లాంటివీ వీటి కోసం ఏర్పాటు చేశారు. ఇక, ఇందులో నివసించే జంతువుల ఆరోగ్య పరీక్షల కోసం, శస్త్ర చికిత్సలు, ఇతర చికిత్సల కోసమూ ఏర్పాట్లున్నాయి. ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్లగలిగే పోర్టబుల్ ఎక్స్-రే, లేజర్ మెషీన్‌లు, సీటీ, ఎంఆర్‌ఐ యంత్రాలు, ఐసీయూ, డయాలిసిస్ కేంద్రం, పాథాలజీ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లు, హైపర్ బారిక్ ఆక్సిజన్ ఛాంబర్లు ఉంటాయి. అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీలాంటివి పరీక్షలు చేసే పరికరాలూ ఇక్కడ ఉన్నాయి. కేవలం జంతువులను కాపాడి ఆరోగ్యాన్ని బాగు చేయడమే కాదు, వాటి గురించిన పరిశోధనలు జరిపే ప్రత్యేక విభాగమూ వంతారాలో ఏర్పాటయింది. ఆపదలో ఉన్న జంతువుల సంరక్షణ కోసం ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ లతో కలిసి పనిచేస్తున్నది వంతారా. వివిధ దేశాల్లోని జంతు సంరక్షణ కేంద్రాలతో పాటు ముఖ్యంగా మెక్సికో, వెనెజులాల్లో ఉన్న రెస్క్యూ సెంటర్ల భాగస్వామ్యమూ ఉంది. భారత్‌లోని నేషనల్ జూ అథారిటీతోనూ టై అప్ అయ్యింది వంతారా. దేశవ్యాప్తంగా జూ లను ఏర్పాటు చేసేందుకు మంతనాలు చేస్తున్నది. ఇటీవలే ప్రధాని అధికారికంగా ఓపెన్ చేసిన ఇది, త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. 'ఆవులో మూడు కోట్ల దేవతలూ ఉంటారంటారు. నేను ప్రతి ప్రాణిలోనూ దేవుడిని చూస్తాను. వాటికి సేవ చేయడం నిజంగా అదృష్టంగా భావిస్తాను. ఎందుకంటే మనుషులకు సేవ చేసే వాళ్లు చాలామందే ఉంటారు. కానీ నోరులేని ఈ ప్రాణులకు సేవ చేసే వాళ్లు చాలా తక్కువ. అందుకే అలాంటి జంతువుల కోసం ఈ నా ముందడుగు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.' అంటూ ప్రేమ పూర్వక

కలుపు మొక్కనెలా కలుపుకొని సాగడం?

'మన శత్రువులు వేర్వేరు రూపాలను తీసుకొని ఉండవచ్చు, కానీ మనం మారలేదు. మన పోరాటాలు మారలేదు. అదే డీఎంకే' అని కలైవానర్ అరంగంలో 2024, అక్టోబర్ 5న ఆ పార్టీ ఎంపీ తిరుచ్చి శివ రాసిన ఐదు పుస్తకాలను ఆవిష్కరించిన సందర్భంగా తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సందేశమిచ్చారు. ప్రఖ్యాత వర్ధమాన సినీ నటుడు, ప్రగతిశీల వాది అయిన ప్రకాష్‌రాజ్ కూడా పాల్గొన్న ఆ సమావేశంలోనే చరిత్రను మార్చడానికి, పుకార్లను వ్యాప్తి చేయడానికి, అసత్యాల ఆయువు పెంచడానికి రాజకీయ శత్రువులు నిరంతరం చేసే ప్రయత్నాలను ఓడించడానికి సత్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంచడమే పరిష్కారమని కూడా అన్నారు. నిజమే, సాంఘిక దురాచారాలు, ఆత్మగౌరవం, తమిళ అస్తిత్వం అంశాలపై ఎటువైపు నుంచి దాడి ఎదురైనా, ఏ శక్తులతో తలపడాల్సిన సందర్భం ఎదురైనా డీఎంకే నిర్మాతలైన అన్నాదురై నుంచి కరుణానిధి వరకు పెరియార్ మార్గాన్ని మదిలో ఉంచుకునే జనాన్ని నడిపించారు. జస్టిస్ పార్టీ, ద్రవిడార్ కళగం అనుభవాల నుంచి తమిళనాడు రాష్ట్ర రాజకీయ అస్తిత్వం కోసం ద్రవిడ మున్నేట్ర కళగం చాలా స్పష్టమైన కార్యాచరణనే సుదీర్ఘకాలం ఆచరణాత్మకంగా నమ్ముకున్నది. దానివల్లనే ఒక ప్రాంతీయ పార్టీ ఏడున్నర దశాబ్దాల పాటు క్రియాశీలకంగా మనుగడ సాగించడమే కాదు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని సంపాదించగలిగింది. అయితే తాజాగా స్టాలిన్ నేతృత్వంలో ఆ పార్టీ ప్రారంభించిన డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటంలో దక్షిణాది రాష్ట్రాల హక్కుల నినాదంతో పాటు ఎన్నికల రాజకీయాల్లో తమిళ ఏజెండాను భావోద్వేగ అంశంగా నిలబెట్టి, రాజకీయ విరోధులను నిలువరించాలనే డీఎంకే సహజమైన ఎత్తుగడ కూడా ఇమిడి ఉన్నదనేది ఎవరూ కాదనలేని వాస్తవం. అయితే ఆ పార్టీ ఎత్తుకున్న డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటాన్ని, త్రిభాషా విధానానికి నిరసనగా వినిపిస్తున్న వాదనను యూజీసీ ప్రతిపాదనల వెనుక రాష్ట్రాల హక్కుల హననం వైఖరిని తేటతెల్లం చేయడాన్ని సమాఖ్య విధానాన్ని, రాజ్యాంగస్ఫూర్తిని విశ్వసించే వారెవరైనా సమర్థించి తీరవలిసిందే. అయితే, తమిళనాడు ప్రయోజనాలకు, ఆత్మ గౌరవానికి స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం బలమైన విరోధిగా నిలబడిన కాంగ్రెస్ పార్టీని కూడా తాజాగా ప్రతిపాదిస్తున్న పోరాట జట్టులో కలుపుకొని సాగాలనే అంశంపైనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాకుండా ఉండలేవు. ఆనాటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని అన్యాయమైన విధానాల నుంచి ఇండిపెండెంట్ ఇండియాలో సుదీర్ఘకాలం తమిళనాడు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొన్న దుఃఖపూరితమైన అనుభవాలకంటే ఎన్నో రెట్ల ఎక్కువ వేదనను తెలంగాణ రాష్ట్రం అనుభవించిందన్నది చరిత్ర చెప్తున్న సత్యం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్లు చెల్లనేరవని న్యాయస్థానాలు తప్పుపట్టడంపైనే పెరియార్ నిప్పుల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీ వైఖరి ఇప్పటికైనా మారిందా అంటే వెయ్యి జీవులను మింగిన రాబందు, మళ్లీ అవకాశం కోసం ఆవు మొహం పెట్టుకొని తిరుగుతున్న విధంగానే ఉన్నది. అందుకే మొన్నటికి మొన్న ఇండియా కూటమిలోనే ఉన్న ఢిల్లీ రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించేందుకు పావులు కదిపి, బీజేపీ గెలుపునకు సహకరించింది. ఈ కుట్రను స్వయంగా రేవంత్ రెడ్డే బయటపెట్టాడు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కేజ్రీవాల్ పార్టీ ఓటమికి వ్యూహాలు పన్నిందే కాంగ్రెస్ పార్టీ అని బీరాలు పలికాడు. సిరా రాతలు ఆరకమునుపే దేశ రాజ్యాంగా న్ని బ్రాహ్మణ డాక్యుమెంట్‌గా వర్ణించి, ప్రత్యేక ద్రవిడనాడు దేశమే కావాలంటూ వేర్పాటు ఉద్యమాన్ని రగిలించాడు. దాంతో మొదటి ప్రధాని నెహ్రూ రాజీకి వొచ్చేలా, తొలి రాజ్యాంగ సవరణ జరిగేలా చేసి, స్వతంత్ర దేశంతో అడుగులు కలపడంలోనే హక్కుల పట్ల రాజీలేనితనాన్ని తమిళజాతి చూపించగలిగింది. అదే స్ఫూర్తితో 1949లో మొదలైన డీఎంకే, కాంగ్రెస్ పార్టీ అన్యాయమైన రాజకీయాలను ప్రజల్లో ఎండగడుతూ, ఎట్టకేలకు 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి అధికారం హస్తగతం చేసుకున్న తొలి ప్రాంతీయ పార్టీగా చరిత్రలో నిలిచింది. ఇలా చాలా స్పష్టాతి స్పష్టంగా తొలి నాటనే తమ రాష్ట్ర ఆత్మగౌరవానికి రాజకీయ శత్రువు కాంగ్రెస్ పార్టీనే అనే కీలక అంశాన్ని సైద్ధాంతికంగా ద్రవిడియన్ భావజాలంలో మిళితం చేసి ప్రజలందరి హృదయాల్లో నాటగలిగింది. అయితే, 2014 నాటికే పూర్తిగా తమిళనాట కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా నిర్వీర్యం చేసి, డీఎంకే ఆశ్రిత సంస్థగా లొంగదీసుకోగలిగింది. అయితే డీఎంకే మూల సిద్ధాంతకర్తలైన పెరియార్, అన్నాదురై విశ్వసించిన ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, రాష్ట్రాల ఆత్మ గౌరవం తదితర మౌలికమైన రాజ్యాంగ అంశాల పట్ల అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఒక తీరున, విపక్షంలో ఉన్న రాష్ట్రాల్లో మరో తీరున అపరిచితుడు సినిమాలో వలె భిన్న మొహాలతో ప్రవర్తిస్తున్న కాంగ్రెస్ పార్టీని కూడా రాష్ట్రాల హక్కుల సాధన పోరులో కలుపుకొని సాగాలనుకోవడంపై ఏకాభిప్రాయానికి రావడం కష్టం. కాంగ్రెస్ అనే కలుపు మొక్కను కూటమిలో పెట్టుకొని రాష్ట్రాల హక్కుల ఉద్యమాన్ని ప్రాంతీయ రాజకీయశక్తులు కొనసాగించడం ఏమిటనే ఆందోళన వ్యక్తమౌతున్నది. రాజ్యాంగానికి తూట్లు పొడవడంలో, సమాఖ్య స్ఫూర్తికి కళంకం తేవడంలో, కాంగ్రెసేతర గవర్నమెంట్‌లను కూలదోయడంలో, అంతెందుకు బడుగు వర్గాలకు అవకాశాలను దూరం చేయడంలో హస్తం పార్టీ అతి పెద్ద పాపాలపుట్టనే కదా? నంబుద్రీపాద్ నుంచి ఎన్టీఆర్ దాకా దక్షిణ భారతదేశంలో కాంగ్రేసేతర ప్రభుత్వాలను కూల్చివేసిందే కాంగ్రెస్ పార్టీ. డీలిమిటేషన్‌తో పాటు హిందీ భాష, యూజీసీ నిబంధనల వివాదంలో తొలి అడుగు వేసిందే కాంగ్రెస్ పార్టీ కేంద్ర సర్కార్లు. 1937లోనే నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తే, మూడేండ్ల పాటు ఉధృతంగా వ్యతిరేక పోరాటం నడిచింది. దానివల్లనే హిందీ, ఇంగ్లీష్‌లను అధికార భాషలుగా గుర్తించారు. మళ్లీ 15 ఏండ్ల తర్వాత హిందీని ఇదే కాంగ్రెస్ పార్టీ సర్కార్ జాతీయ అధికార భాషగా ప్రకటించే ప్రయత్నం చేసింది. అయితే తమిళనాడు వ్యతిరేకతకు జడిసి 1963 అధికార భాషా చట్టంలో హిందీతో పాటు ఇంగ్లీష్ ను చేర్చారు. అలాగే, 2009, 2011లో రాష్ట్రాల విద్యాహక్కులు హరించే ప్రయత్నం కాంగ్రెస్ చేసిం ది. పశ్చిమబెంగాల్, తమిళనాడు నిరసించడంవల్లనే వెనక్కి తగ్గారు. ఇలాంటి ధోరణిలో బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే. అంతెందుకు రిజర్వేషన్ల కోసమే ప్రత్యేక ద్రవిడనాడు పోరాటం చేసిన తమిళనాడు రాష్ట్ర మేధావులు, నేతలకు.. ప్రత్యేక దేశం గా, అనంతరం ప్రత్యేక రాష్ట్రంగా వర్ధిల్లిన తెలంగాణపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎలా దాడి చేసి, ఐదున్నర దశాబ్దాలు ఎలా అడుగడుగునా వంచించిందో చరిత్ర సాక్షిగా తెలియకుండా ఉండదు. తమిళనాడు కంటే తెలంగాణ, డీఎంకే కంటే బీఆర్ఎస్ ఎన్నో రెట్లు ఎక్కువ నిర్బంధాన్ని, నష్టాన్ని, కష్టాలను కాంగ్రెస్, బీజేపీల వల్ల అనుభవించాయి. ఎంతో వైవిధ్యమైన ఉన్నతమైన చరిత్రనూ, త్యాగాలనూ తెలంగాణ ప్రజలు పండించారు. కానీ, తెలంగాణలో హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ నుంచి మంత్రివర్గ విస్తరణ వరకు, ప్రతి పైసా ఖర్చుపెట్టడం కోసం 37 సార్లు ఢిల్లీ వెళ్లి, గాంధీల అనుమతి తీసుకునే పరిస్థి తి ఏర్పడింది. ఇది త్యాగాల తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు బలితీసుకోవడం కాదా? ఇలా ఇంకా మారని, మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రాంతీయ రాజకీయ శక్తులను వేటాడుతామని కేజ్రీవాల్ ఉదాహరణతో తేటతెల్లం చేస్తున్న కాంగ్రెస్‌ను కలుపుకొని సాగడం వల్ల ప్రాం తీయ పార్టీలకు, రాష్ట్రాలకు ముప్పే. బీఆర్ఎస్, డీఎంకే తదితర పార్టీల పుట్టుక, సుదీర్ఘ పోరాటం, త్యాగాల వెనుక ప్రాంతీయ ఆకాంక్షలున్నాయి. కాబట్టి డీఎంకే తాజా పోరాట ఎజెండాలో ఎంత న్యాయమున్నదో, జట్టులో కపట కాంగ్రెస్‌ను కలుపుకొనిపోవడంలో అంతే నష్టమున్నది. పైగా అధికారంలో ఉన్నంత మాత్రాన తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి లాంటి ఢిల్లీ దళారీ పాలకుల నేతృత్వంలో రాష్ట్రాల హక్కుల సాధన పోరు రెండో సమావేశం జరపాలని నిర్ణయించడం ప్రజాస్వామ్యవాదులకు ఎబ్బెట్టుగా అనిపిస్తున్నది. డీఎంకే, బీఆర్ఎస్ తలపెట్టిన పోరాటాన్ని, కాంగ్రెస్ కలుపుమొక్కను తీసేసి కొనసాగించగలిగితే, ఈ జట్టులో అధికారంలో లేకపోయినా సరే మిగతా ప్రాంతీయ పార్టీలు, సంఘాలు, మేధావులను భాగస్వామ్యులుగా మార్చగలిగితే మంచిది.

సంపాదకీయం

భారతీయ సమాజం తిరోగమిస్తున్నదా?

భూస్వామ్య, పితృస్వామిక వ్యవస్థకు మూలాధారమైన తిరోగామి హిందుత్వ విధానంపై ఆధారపడిన సమాజంలో నేడు మనమున్నాం. ఆ వ్యవస్థకు గుర్తులుగా ఉన్న అన్నిరకాల రుగ్మతలను, వివక్షలను, అసమానతలను పాలకవర్గాలు తమ రాజకీయ ప్రయోజనాలకు, ఆర్థిక దోపిడీకి వాడుకుంటున్నాయి. ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ మన దేశంలోనే ఉన్నది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో పురోభివృద్ధి సాధించినప్పటికీ సాటి మనిషిని, మనిషిలాగా చూడలేని దుర్మార్గపు స్థితి నేటికీ కొనసాగడం అమానుషం. కులం, మతం, ప్రాంతం, లింగ బేధం లాంటి సామాజిక రుగ్మతలు మన దేశంలో ప్రజల్ని, కార్మిక వర్గాన్ని ఐక్యం కానివ్వకుండా దారికడ్డంగా, ముండ్ల కంచెలా ఉన్నాయి. దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం పాలక వర్గాలు కార్మికవర్గంలో సున్నితమైన ఈ అంశాలను ముందుకు తెస్తున్నారు. దాంతో కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేసి దోపిడీ వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకుంటున్నాయి. సమాజంలో అన్నిరకాల దోపిడీ, అణచివేత, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి వీటి నుండి శ్రామిక వర్గాన్ని విముక్తి చేసి, పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో సీఐటీయూ తన ఆవిర్భావం నుంచి పని చేస్తున్నది. సామాజిక అణచివేత, వివక్ష, దోపిడీలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలతో శ్రామికవర్గ ఐక్యత కోసం కృషి చేస్తున్నది. రాష్ట్రంలో నేటికీ పరిశ్రమల్లో, విద్యాలయాల్లో, పని ప్రదేశాల్లో చాపకింద నీరులా కులవివక్ష కొనసాగుతున్నది. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీ ఉద్యోగులూ వివక్ష, దాడులకు గురవుతూనే ఉన్నారు. సమాజంలో ఉన్న వివక్ష, సహచర ఉద్యోగులు, కార్మికులు పాటిస్తున్న వివక్ష ఈ రెండింటినీ వారు అనుభవించాల్సి వస్తున్నది. ప్రమోషన్లలో రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న లోపం వల్ల పదోన్నతులు దక్కడం లేదు. దళిత ఉద్యోగుల ఎడల రిజర్వేషన్ కేటగిరీ అంటూ చిన్నచూపు చూస్తున్నారు. డ్యూటీ చేస్తున్న పని ప్రదేశాలు మధ్యాహ్నం లంచ్ చేసే దగ్గర కూడా వివక్ష కొనసాగుతున్నది. ప్రత్యేకంగా కార్మికుడి సామర్థ్యం, హోదా నుండి కాకుండా వారి కులం ఆధారంగా గౌరవిస్తున్న అమానుష స్థితి ఉంది. 77 సంఎఎలు స్వాతం త్ర్యానంతరం కూడా పట్టణ ప్రాంతాల్లో దళిత ఉద్యోగ, కార్మికులకు ఇండ్లు అద్దెకు ఇవ్వకపోవడం శోచనీయం. దళితులకు గుడి ప్రవేశం లేని గ్రామాలు, దళితులకు క్షవరం చేయని స్థితి, దసరా పండుగ సందర్భంగా దళితులను జమ్మి ఆకు తెంప నీయకపోవడం, బతుకమ్మ ఆడనీయని ప్రాంతాలు, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, రచ్చబండపై వీరిని కూర్చోనీయకపోవడం, పాఠశాలల్లో దళితులు మధ్యాహ్న భోజనం వంట చేస్తే అగ్రవర్ణ విద్యార్థులు తినకపోవడం లాంటి ఘటనలు జరుగుతున్నాయి. కుల వివక్ష, అంటరానితనం, కుల దురహంకార హత్యలు, సాంఘిక బహిష్కరణలు నిత్యకృత్యం. తెలంగాణ రాష్ట్రంలో దళితులపై 128 కులదురంహకార హత్యలు జరిగాయి. భువనగిరిలో అంబోజీ నరేష్‌ను హతమార్చారు. మంథనిలో మధుకర్‌ను కుల దురహంకారంతో అమానుషంగా అంతమొందించారు. నిజామాబాద్ జిల్లా కోటగిరిలో ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్‌పై దాడి చేసి ఊరేగించి అవమానపర్చారు. తుక్కుగూడ దళిత హెడ్‌మాస్టర్ రాములుపై మతోన్మాదులు రెచ్చిపోయి దాడి చేసి అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థి కాళ్లు మొక్కించారు. ఇలా చెప్పుకుంటూ పోతే మతపరమైన దాడులు, విద్వేషపు అల్లర్లు కోకొల్లలు. వేల సంవత్సరాల నాటి బూజు పట్టిన మనువాద సిద్ధాంతాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. దేశ భక్తి ముసుగులో మతం పేరుతో శ్రామిక ప్రజలు, కార్మికుల్లో చిచ్చు పెడుతున్నది. దళితులు, గిరిజనులు, మహిళలపై విచ్చలవిడిగా దాడులు చేస్తున్నది. రాజ్యాంగ స్ఫూర్తిని భగం చేస్తున్నది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ అగ్ర నాయకత్వమే బహిరంగంగా ప్రకటించింది. అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగానికి రూపకల్పన చేసే సమయంలోనే బీజేపీ మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రాజ్యాంగం, అంబేద్కర్ పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. వారు అత్యంత ప్రామాణికంగా భావించే మనుస్మృతికి భారత రాజ్యాంగంలో స్థానం లేకుండా పోయిందని స్వయంగా గోల్వాల్కర్ తమ 'ఆర్గనైజర్' పత్రికలో పలు వ్యాసాలు రాశారు. మన దేశానికి ప్రస్తుత రాజ్యాంగం పనికిరాదన్నారు. ఇప్పుడు ఆరెస్సెస్ కనుసన్నల్లో పాలన చేస్తున్న బీజేపీ అదును చూసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నది. ఈ ప్రమాదాలను కార్మికవర్గం ప్రతిఘటించాలి! రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి!! భారత రాజ్యాంగం ఆర్టికల్-14, 16, 19 (1) (సి), 23, 24, 38, 41ల ద్వారా కార్మిక హక్కులకు అత్యంత ప్రాధాన్యత కల్పించింది. కార్మికుల సంక్షేమం, హక్కులు, బాధ్యతలు రాజ్యాంగంలో పొందుపర్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ప్రభుత్వరంగ సంస్థలను ఆధునిక దేవాలయాలతో పోల్చింది నాయకగణం. కానీ నేడు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి వాటిని సమాధి చేస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించడం, మూసివేయడం, వాటి ఆస్తులను నేషనల్ మానెటైజేషన్ పైప్‌లైన్ ద్వారా తెగనమ్మడం, ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడం, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకపోవడం వంటి నిర్ణయాల వల్ల దళిత, గిరిజన, బలహీన, పీడిత వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను నీరుగారుస్తున్నది. పేదలకు రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను కాలరాస్తున్నది. రిజర్వేషన్లకు పాతరేస్తున్నది. ఆర్టికల్-14కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. చట్టం ముందు అందరూ సమానమేననే భావనలకు తిలోదాకాలిచ్చింది. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చి కార్మిక హక్కులను హరించచూస్తున్నది. యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు, సంఘటిత శక్తి, బేరసారాల హక్కులపై దాడి చేస్తూ కార్పొరేట్ల లాభాలకు కార్మికవర్గాన్ని బలి చేస్తున్నది. ఓ వైపు నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, మరోవైపు మనువాద మతోన్మాద విధానాలను ఏకకాలంలో అమలు చేస్తూ సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నది. జాతీయోద్యమ కాలంలోనూ, స్వాతంత్ర్యానంతర కాలంలోనూ భారతదేశంలో కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం, అణచివేత, మూఢనమ్మకాలు, స్త్రీల హక్కులు, ఆర్థిక, సామాజిక దోపిడీ, పీడనల నుండి విముక్తి కోసం దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలతో పాటు వెనుకబడిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎందరో మహనీయులు అశేష త్యాగాలు చేశారు. వారు నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పోరాడారు. వారి పోరాటాలు, త్యాగాలు, వారు చేసిన కృషి ఫలితంగానే, నేడు ఆయా తరగతులకు కొన్ని హక్కులు, చట్టాలు, సౌకర్యాలు లభించాయి. ప్రజలను వారి స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక రంగాల్లో అనేక విప్లవాత్మక మార్పులు సంభవించాయి. ఆ మహనీయులను స్మరించుకోవడానికి ప్రతి ఏడాది ఏప్రిల్ నెల ఓ ప్రత్యేకత చాటుతున్నది. అంటరానితనం, అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్తలు, సామాజికవేత్తలు, విప్లవకారులు, దోపిడీ రహిత సమసమాజ స్థాపనను కాంక్షించే కార్మికోద్యమ నేతల వర్ధంతులు, జయంతులు వరుసగా ఈ నెలలోనే రావడం విశేషం. అన్నిరకాల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి జీవితాంతం సమసమాజ స్థాపన లక్ష్యానికి కట్టుబడిన కార్మికోద్యమ నేత బిటి రణధివె వర్ధంతి ఏప్రిల్ 6న, ఏప్రిల్ 10 భారత మహిళా కార్మికోద్యమ నేత కాఎఎ విమలా రణదివె జయంతి, ఏప్రిల్ 11న కుల వ్యవస్థ నిర్మూలనలతో పాటు మహిళా ఉద్ధరణ, హక్కుల కోసం కృషి చేసిన జ్యోతిరావ్ ఫూలే జయంతి, ఏప్రిల్ 14న రాజ్యాంగ నిర్మాత, అంటరానితనం, బానిసత్వంపై పదునైన ఆయుధాన్ని ఎక్కుపెట్టిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి. ఈ మహానుభావులను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 6 నుంచి 14 వరకు సామాజిక న్యాయ వారోత్సవాలను నిర్వహించాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. గత మూడేండ్లుగా ఈ ఒరవడి కొనసాగుతోంది. మనువాదానికి వ్యతిరేకంగా, కుల వివక్షను అంతం చేయడం, మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులను ప్రతిఘటించడం, సామాజిక న్యాయం కోసం కార్మికవర్గ ఐక్యతను చాటడం వంటి మౌలిక లక్ష్యాలుగా ఈ సామాజిక సామాజిక న్యాయ వారోత్సవాన్ని నిర్వహించాలని కార్మికులకు నిర్దేశిస్తున్నది. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలపై హింస రెట్టింపు స్థాయిలో పెరిగింది.

ధీరోదాత్త వనిత సునీత

ప్రపంచ ప్రజలు అందరూ వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ భూతలానికి క్షేమంగా తిరిగి రావడాన్ని ఆసక్తితో, అచ్చెరువుతో చూశారు. ఆ సమయంలో గూగుల్ ట్రెండ్స్ ప్రకారం సునీతా విలియమ్స్ పేరుతో ఆన్‌లైన్ శోధన 2 మిలియన్లకు చేరుకుంది. కల్పనా చావ్లా తర్వాత అంతరిక్షంలోకి వెళ్ళిన భారతీయ వారసత్వం కలిగిన రెండవ అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ అనుభవశాలియైన సుప్రసిద్ధ నాసా వ్యోమగామి, మాజీ అమెరికన్ నేవీ కెప్టెన్, అంతర్జాతీయ అంతరిక్ష సంస్థ కమాండర్. ఆమె సెప్టెంబర్ 19, 1965న ఒహాయోలోని యూక్లిడ్‌లో డాక్టర్ దీపక్ పాండ్యా, బోన్నీ పాండ్యా దంపతులకు జన్మించారు. ఆమె తండ్రి దీపక్ పాండ్యా ఒక న్యూరో -అనాటమిస్ట్. ఆయన భారతదేశంలో గుజరాత్ రాష్ట్రంలోని ఝులాసాన్ గ్రామంలో జన్మించాడు. సునీత భర్త మైఖేల్ విలియమ్స్. నీధామ్, మసాచుసెట్స్ ఆమె స్వస్థలం. నీధామ్ హైస్కూల్లో చదువుకుని, 1987లో అమెరికన్ నేవల్ అకాడమీ నుండి ఫిజికల్ సైన్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందారు. 1995లో ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో పిజి పట్టా పొందారు. అంతరిక్ష యానానికి ప్రసిద్ధి చెందిన విలియమ్స్ ఆశావహులైన వర్తమాన, భవిష్యత్ వ్యోమగాములకు ఒక శక్తివంతమైన ఆదర్శమూర్తిగా నిలిచారు. ప్రజలు భావించినట్లు ఆమె అంతరిక్షంలో ఇరుక్కుపోలేదు లేదా చిక్కుకు పోలేదు అని నాసా స్పష్టం చేసింది. ఆ వ్యోమగాములను రక్షించడానికి అంతరిక్ష సంస్థ అన్ని వేళలా లైఫ్‌బోట్స్‌ను సిద్ధంగా ఉంచింది. అయితే వారిని తిరిగి తీసుకురావడానికి ఏజెన్సీ సరైన సమయం కోసం వేచివుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో తొమ్మిది నెలలు గడిపి నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ క్రూ-9 బృందంతో కలిసి మార్చి 19, బుధవారం తెల్లవారుజామున భూమికి తిరిగి వచ్చారు. ఆమె త్వరలో భారత దేశానికి రానున్నదని ఆమె బంధువు తెలియపరిచారు. సునీతా విలియమ్స్ కెరీర్‌లో మొత్తం 62 గంటల 6 నిమిషాలు అంతరిక్షంలో నడిచిన మొదటి మహిళా వ్యోమగామి. నాసా సంస్థ సర్వకాలిక స్పేస్ వాక్ జాబితాలో ఆమెది నాల్గవ స్థానం. విలియమ్స్ మూడు అంతరిక్ష యాత్రలలో 608 రోజులు అంతరిక్షంలో గడిపారు. జూన్ 1998లో నాసా వ్యోమగామిగా ఎంపికైన సునీతకు ఆగస్టు 1998లో శిక్షణ మొదలైంది. తన మొదటి అభియానం తర్వాత, ఆమె ఆస్ట్రోనాట్ ఆఫీస్ సహాయక అధికారిగా పదవి చేపట్టారు. అటుపై ఆమె ఎక్స్‌పెడిషన్ 32లో ఫ్లైట్ ఇంజినీర్‌గా, ఎక్స్‌పెడిషన్ 33లో అంతర్జాతీయ అంతరిక్ష స్టేషన్ కమాండర్‌గా దీర్ఘకాలిక మిషన్‌కు మద్దతునిచ్చారు. నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ జూన్ 5, 2024న బోయింగ్ స్టార్లైనర్ అంతరిక్ష నౌకలో దాని మొదటి సిబ్బందితో కూడిన విమానాన్ని ప్రయోగించారు. జూన్ 6న అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. మొదట్లో దాదాపు ఒక వారం పాటు ఈ అంతరిక్షయానం కొనసాగుతుందని భావించినప్పటికీ, వారి స్టార్లైనర్ మిషన్ బోయింగ్ స్టార్లైనర్ క్యాప్సూల్లో సమస్యల కారణంగా ఈ అభియానం తొమ్మిది నెలలకు పైగా పొడిగించవలసి వచ్చింది. అందుచేత వారు తిరిగి రావడంలో ఆలస్యం జరిగింది. స్టార్లైనర్ సిబ్బంది లేకుండా తిరిగి రావాలని నాసా సంస్థ నిర్ణయించిన తర్వాత, ఈ ఇద్దరు వ్యోమగాములు ఎక్స్‌పెడిషన్ 71/72 సిబ్బందిగా మారారు. మార్చి 2025లో స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌకలో భూతలానికి క్షేమంగా తిరిగి వచ్చారు.వారి మిషన్ అనుకున్న వ్యవధి కంటే చాలా ఎక్కువగా విస్తరించినప్పటికీ విలియమ్స్, విల్మోర్ తమ సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వారు 900 గంటలకు పైగా పరిశోధన, అభివృద్ధిలో నిమగ్నమై, 150కి పైగా శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించారు. జీవవ్యవస్థలపై సూక్ష్మగురుత్వాకర్షణ ప్రభావాలను అధ్యయనం చేయడం, దీర్ఘకాలిక అంతరిక్ష ప్రయాణానికి కొత్త సాంకేతికతలను పరీక్షించడం వారి ముఖ్యమైన అధ్యయనాలలో కొన్ని. వారి ముఖ్యమైన ప్రయోగాలలో ఒకటి యూరోపియన్ ఎన్హాన్స్‌డ్ ఎక్స్‌ప్లోరేషన్ ఎక్సైజ్ డివైస్ (ఈ4డి) ని పరీక్షించడం. ఇది సైక్లింగ్, రోయింగ్, రెసిస్టెన్స్ వ్యాయామాలను మిళితం చేస్తుంది.ఇది వ్యోమగాములు అంతరిక్షంలో తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. కండరాలు, ఎముకలు దృఢత్వాన్ని కోల్పోవటం గురించిన వారి పరిశోధన భవిష్యత్‌లో అంతరిక్షయానాలకు కీలకం అవుతుంది. వ్యోమగాములు భూమి మీదకు తిరిగి వచ్చాక 'వాస్కులర్, కార్డియో రీకండిషనింగ్' చేయించుకోవలసి ఉంటుంది. వ్యోమగాముల శరీరం మైక్రోగ్రావిటీలో ఉండటానికి అలవాటు పడటం చేత, తల తిరుగుతున్నట్లు, లేవడానికి ఇబ్బందిపడుతున్నట్లు అనిపిస్తుంది' అని నాసాకు చెందిన స్టీవ్ స్టిచ్ మీడియాతో అన్నారు. సాహసనారి కల్పన కల్పన తొలి భారతీయ అమెరికన్ వ్యోమగామి. అంతరిక్షంలోకి వెళ్ళిన తొలి భారతీయ మహిళ. ఆమె తొలిసారిగా 1997లో స్పేస్ షటిల్ కొలంబియాలో మిషన్ స్పెషలిస్ట్ పదవిలో ప్రైమరీ రోబోటిక్ ఆర్మ్ ఆపరేటర్‌గా ప్రయాణించారు. కల్పనా చావ్లా పంజాబ్ ఇంజినీరింగ్ కళాశాల నుండి ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పొందారు. ఈ కోర్సును ఎంచుకునేటప్పుడు, భారతదేశంలో ఈ కెరీర్ మార్గాన్ని అనుసరించే అమ్మాయిలకు పరిమిత అవకాశాలు ఉన్నందున, ప్రొఫెసర్లు ఆమెను నిరుత్సాహపరిచే ప్రయత్నం చేశారు. అయితే, చావ్లా ఇదే తాను నిర్ణయించుకున్న అంశమని పట్టుబట్టారు. భారతబాలికలకు సైన్స్ విద్య అవకాశాలను అందించడం పట్ల చావ్లాకు ఎంతో మక్కువ ఉండేది. ఆమె వ్యోమగామిగా ఉన్న సమయంలో కల్పన చదువుకున్న బడి పిల్లలకు నాసా సంస్థ సమ్మర్ స్పేస్ ఎక్స్‌పీరియన్స్ కార్యక్రమంలో పాల్గొనమని ఆహ్వానించింది. 1998 నుండి ప్రతి సంవత్సరం, ఆ స్కూల్ ఇద్దరు బాలికలను హ్యూస్టన్‌లోని ఫౌండేషన్ ఫర్ ఇంటర్నేషనల్ స్పేస్ ఎడ్యుకేషన్ యునైటెడ్ స్పేస్ స్కూల్‌కు పంపేది. కల్పన ఆ బాలికలను తన ఇంటికి భారతీయ విందుకు ఆహ్వానించేది. కల్పనా చావ్లా కొలంబియా అంతరిక్ష షటిల్ (1997) నుండి అనేక ప్రయోగాలను నిర్వహించింది. వాటిలో సూక్ష్మగురుత్వాకర్షణలో మొక్కల పునరుత్పత్తిని అధ్యయనం చేసే ప్రాజెక్టులు, అంతరిక్షంలో పదార్థాలు ఎలా ప్రవర్తిస్తాయో అధ్యయనం చేయడం వంటివి ఉన్నాయి. అదనంగా, చావ్లా రోబోటిక్ ఆర్మ్ను ఉపయోగించి స్పార్టాన్ 201 అనే ఉపగ్రహాన్ని మోహరించారు. ఇది సూర్యుని బయటి పొర అయిన కరోనాను అధ్యయనం చేయడానికి ఉద్దేశించబడింది. 2003లో, స్పేస్‌షటిల్ కొలంబియా విపత్తులో దురదృష్టవశాత్తు మరణించిన ఏడుగురు సిబ్బందిలో కల్పన ఒకరు. అయితే, చావ్లా వారసత్వం కొనసాగుతోంది. ముఖ్యంగా, ఆమె ప్రతిభ, కృషి భారతదేశంలోనే గాక ప్రపంచ వ్యాప్తంగా యువత అంతరిక్షయానంలో కెరీర్లను పరిగణించేలా ప్రేరణ నిచ్చింది.

రోగనిరోధకశక్తిలో సి విటమిన పాత్ర

ప్రతీ ఏటా ఏప్రిల్ 4న జాతీయ విటమిన్ సి దినోత్సవం జరు పుకుంటారు. ఈ దినోత్సవం ఆరోగ్యానికి విటమిన్ సి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం, దాని ఆరోగ్యప్రయో జనాలను ప్రచారం చేయడం లక్ష్యంగా ఏర్పాటైంది. విటమిన్ సి అనేది శరీరానికి అత్యవసరమైన పోషక పదార్థం, ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటం మరియు కణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విటమిన్ సి, లేదా ఆస్కార్బిక్ ఆమ్లం, ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ మరియు అనేక శారీరక ప్రక్రియలకు అవసరమైన పోషకం. శరీరం దీనిని స్వంతంగా ఉత్పత్తి చేయలేదు కాబట్టి, మనం తీసుకునే ఆహారం ద్వారా లేదా సప్లిమెంట్ల ద్వారా దీనిని పొందాలి.విటమిన్ సి విస్తృత ప్రయోజనాలలో.. రోగనిరోధకశక్తిని పెంచడం ద్వారా విటమిన్ సి తెల్లరక్తకణాల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, వాటి పనితీరును కూడా మెరుగుపరుస్తుంది. ఇవి శరీరంలోకి ప్రవేశించే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడటానికి సహాయపడతాయి. అంతేకాకుండా, విటమిన్ సి యాంటీబాడీల ఉత్పత్తికి కూడా తోడ్పడుతుంది, ఇవి ఇన్ఫెక్షన్లను గుర్తించి నాశనం చేస్తాయి. కాలాజెన్ ఉత్పత్తిలో విటమిన్ సి కీలక పాత్ర పోషిస్తుంది. కాలాజెన్ అనేది చర్మం, ఎముకలు, కండరాలు, రక్త నాళాలు, ఇతర కణ జాలాలను కలిపి ఉంచే ఒక ప్రోటీన్. గాయాలు త్వరగా మానడానికి మరియు కొత్త కణజాలం ఏర్పడటానికి ఇది చాలా అవసరం. విటమిన్ సి రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తనాళాల పనితీరును మెరుగు పరుస్తుంది. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కూడా కొంత పాత్ర పోషిస్తుంది, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.విటమిన్ సి ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌కావడం వల్ల, ఇది శరీరంలోని కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి రక్షిస్తుంది. ఈ ఫ్రీ రాడికల్స్ క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు కారణ మవుతాయి. కొన్ని అధ్యయనాలు విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని సూచిస్తున్నాయి.విటమిన్ సి మెదడు పనితీరుకు కూడా అవసరం. ఇది న్యూరో ట్రాన్స్‌మిటర్ల ఉత్పత్తిలో పాల్గొంటుంది, ఇవి మానసిక స్థితి, అభిజ్ఞా పనితీరును ప్రభావితం చేస్తాయి. కొన్ని పరిశోధనలు విటమిన్ సి మానసిక ఒత్తిడిని తగ్గించడంలో, మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని సూచిస్తున్నాయి. వయస్సు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యల్లో మచ్చల క్షీణత ఒకటి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లతో కలిసి, ఈ సమస్యను నివారించడంలో లేదా ఆలస్యం చేయడంలో సహాయ పడుతుంది. కొన్ని అధ్యయనాలు విటమిన్ సి ఆస్తమా లక్షణాలను తగ్గించడంలో సహాయ పడుతుందని సూచిస్తున్నాయి, ముఖ్యంగా పిల్లలలో. ఇది శ్వాసనాళాల్లోని వాపును తగ్గించడంలో సహాయ పడుతుంది. విటమిన్ సి లోపం వల్ల స్కర్వీ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. అయితే, స్వల్పకాలిక లోపం కూడా అలసట, బలహీనత, చిగుళ్ళ వాపు మరియు రక్తస్రావం, చర్మంపై దద్దుర్లు వంటి సమస్యలకు దారితీస్తుంది. ఆహారంలో తగినంత విటమిన్ సి లేకపోవడం వల్ల రోగ నిరోధక శక్తి తగ్గుతుంది, దీని వలన తరచుగా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. విటమిన్ సి పుష్కలంగా లభించే ఆహారాలు చాలా ఉన్నాయి. నారింజ, నిమ్మ, ద్రాక్షపండు, బత్తాయి, బెర్రీలు: స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీలు, బ్రోకలీ, క్యాప్సికం (ముఖ్యంగా ఎరుపు మరియు పసుపు), బంగాళా దుంపలు, టమోటాలు, పాలకూర, క్యాబేజీ, కివి, మామిడి, బొప్పాయి, పుచ్చకాయ.విటమిన్ సి నీటిలో కరిగే విటమిన్ కాబట్టి, వంట చేసేటప్పుడు కొంత మొత్తం కోల్పోయే అవకాశం ఉంది. అందువల్ల, పండ్లను మరియు కూరగాయలను పచ్చిగా తినడం లేదా తక్కువ నీటిలో తక్కువ సమయం ఉడికించడం మంచిది. జాతీయ విటమిన్ సి దినోత్సవం మన ఆరోగ్యానికి ఈ ముఖ్యమైన పోషకం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడం నుండి కణజాల మరమ్మత్తు వరకు అనేక కీలకమైన విధులను నిర్వహిస్తుంది. మన ఆహారంలో విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు మరియు కూరగాయలను చేర్చుకోవడం ద్వారా మనం ఆరోగ్యకరమైన మరియు శక్తివంతమైన జీవితాన్ని గడపవచ్చు. ఈ రోజున, విటమిన్ సి ప్రయోజనాలను గుర్తించి, మన రోజువారీ ఆహారంలో దానిని చేర్చుకోవడానికి ప్రయత్నిద్దాం.

మా బాధలు పట్టించుకోండి
డ్వాక్రా సంఘాల సభ్యుల ఆవేదన

తాళ్లపూడి మండలం,ఏప్రిల్15 ప్రజాజ్యోతి న్యూస్ మహిళలు తమ సొంత కాళ్ళ మీద నిలబడాలి అనే ఉద్దేశం తో రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక పొదుపు సంఘాలను ఏర్పాటు చేసింది. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పాలకులు వాటిని కొనసాగిస్తూ ముందుకు సాగిస్తున్నారు. అయితే ఆ గ్రూపులను సక్రమంగా నడిపించే బాధ్యత తీసుకోవాల్సిన డ్వాక్రా సిఏ లు కొంతమంది అవి ఏమి పట్టించుకోకుండా గ్రూప్ సభ్యులకు వారికి రావలసిన రుణాలు మొదలగు వాటి విషయంలో వివరంగా చెప్పవలసింది పోయి తమ ఇష్టం వచ్చినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారి స్వలాభం కోసం రుణాలు మంజూరు చేయాలన్నవారికి కమిషన్ ఇస్తే గాని లోన్ రాదనే పరిస్థితి ఉందని మండలంలోని పలు గ్రామాలకు చెందిన డ్వాక్రా గ్రూప్ సభ్యులు తమ ఆవేదనను ఎవరికి చెప్పుకుంటే తీరుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారు. బయటికి వచ్చి చెప్పాలంటే చెప్పే ధైర్యం లేక లోలోపల వారే మదన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ డ్వాక్రా సి ఎ.ల పై నిఘా వుంచి డ్వాక్రా గ్రూపులో ఉన్న మహిళలు ఆర్థికంగా స్థిరపడడానికి ప్రభుత్వం నుండి వచ్చే రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు డ్వాక్రా సంఘాల సభ్యులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహిద్దాం...
కమిషనర్ ఎన్ మౌర్య..

ఏప్రిల్ 15,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను అద్భుతంగా నిర్వహించేందుకు అందరూ కలసికట్టుగా పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జాతరకు చేయాల్సిన ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, అన్ని విభాగాల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. గతంలో ఏర్పాట్లు, ప్రస్తుతం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాతయ్యగుంట గంగమ్మ జాతర వైశిష్ట్యానికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు ఏర్పాట్లు చేసేందుకు అధికారులు, సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. నగరపాలక సంస్థ తరపున చేయాల్సిన అన్ని ఏర్పాట్లను పరిశీలించాలని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు సరఫరా చేయాలని, వాహనాలు పార్కింగ్, క్యూ లైన్ల ఏర్పాటు, భక్తులు పొంగళ్ళు పెట్టుకునేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు అన్ని ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అలాగే భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అన్నారు. కమిషనర్ వెంట తాతయ్య గుంట గంగమ్మ గుడి ఈఓ జయకుమార్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్ , డి.ఈ రాజు, ఏసిపి బాలాజీ, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, సర్వేయర్ కోటేశ్వర రావు,శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కృషితో
కొత్తూరు మండల కేంద్రంలో
టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు

కొత్తూరు, ఏప్రిల్ 15 ప్రజా జ్యోతి న్యూస్. కొత్తూరు మండల కేంద్రం లో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ని మామిడి గోవిందరావు శాంక్షన్ చేయించడం జరిగిందని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నట్టు లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సెలెక్ట్ చేసిన అభ్యర్థులను ఎమ్మెల్యే సూచనల మేరకు ప్రస్తుతం తాత్కాలికంగా కొత్తూరు కేజీబీవీ హాస్టల్ భవనంలో అభ్యర్థుల రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వచ్చి ఈ సెంటర్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తులసీ వర ప్రసాద్ రావు మాట్లాడుతూ హాస్టల్ ప్రారంభమయ్యేవరకు ఈ సెంటర్ ఇక్కడ ఉంటుందని, తర్వాత ఎంపిడిఓ ఆఫీస్ లో ఒక కార్యాలయాన్ని మరమత్తులు చేయించి కేటాయిస్తామని లోతుగెడ్డ తులసి వరప్రసాద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు తాత్కాలికంగా సెంటర్ని ఏర్పాటు చేసినందుకు సహాయం చేసిన ప్రధానోపధ్యాయులు గోవిందరావుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు,ప్రధానోపధ్యాయులు గోవిందరావు, దారపు రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీపై చేసిన మొదటి సంతకం హామీ
ఏమైంది ముఖ్యమంత్రి గారు : డివైఎఫ్ఐ

బద్వేల్ ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికలలో నిరుద్యోగ అభ్యర్థులకు నేను అధికారంలోకి రాగానే డీఎస్సీ పై మొదటి సంతకం చేస్తామని నోటిఫికేషను వదిలి నియమక ప్రక్రియలు చేపడతామని హామీ ఇచ్చి నేటికీ ఎనిమిది నెలలు అవుతున్న ఇచ్చినటువంటి హామీ ఏమైందన్నారు. ఇప్పటికైనా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోతే చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపు ఇస్తామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. మంగళవారం బద్వేల్ పట్టణంలోని స్థానిక సుందరయ్య భవనం నందు డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ,ఎస్ కే ఆదిల్, బద్వేల్ రూరల్ అధ్యక్ష కార్యదర్శులు ఉప్పులూరు బాల గురవయ్య ,ముడుమాల ఓబుల్ రెడ్డి లతో కలిసి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ... డీఎస్సీ నోటిఫికేషన్ కోసం రాష్ట్రంలో నిరుద్యోగ అభ్యర్థులు ఏడు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారు గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తే ఈ ప్రభుత్వం అయినా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తుందేమోనని ఆశపడితే అది ఆవిరిగా మిగిలిపోయింది అన్నారు. అధికారంలోకి రాగానే డీఎస్సీ పై మొదటి సంతకం చేసి నియమకాలు చేపడతామని హామీ ఇచ్చి గడిచిన ఎనిమిది నెలల్లో ఇంతవరకు ఇదిగో డీఎస్సీ అదిగో డీఎస్సీ అని చెప్పి నిరుద్యోగుల్ని ఊరిస్తున్నారు తప్ప నోటిఫికేషన్ ఇవ్వడంలేదని వారు అన్నారు. మొదటి సంతకం చేసిన డీఎస్సీ పై ఇంతవరకు ఎందుకు నోటిఫికేషన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని వారు ప్రశ్నించారు. ఒకవైపు విద్యాశాఖ మంత్రి గారు నెక్స్ట్ విద్య సంవత్సరానికి స్కూల్ కి వెళ్లేసరికి ఉపాధ్యాయులను కూడా నియమకాలు చేపట్టి పంపిస్తామని చెప్పారు కానీ మరోవైపు నోటిఫికేషన్ ఇవ్వకుండా నియమకాలు ఏ విధంగా చేపడతారని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీ అమలు కోసం చర్యలు చేపట్టాలని తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని లేని పక్షంలో డివైఎఫ్ఐ నిరుద్యోగ అభ్యర్థుల పక్షం నిలబడి చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిస్తామని వారు తెలిపారు.

విజయ దుందుభి మోగించిన
సంస్కృతి ఇంటర్ కాలేజ్ విద్యార్థులు.

రాష్ట్ర స్థాయిలో 2 వ స్థానం సాధించిన విద్యార్థి

ఏప్రిల్ 15,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి ఇటీవలే విడుదలైన ఇంటర్ ఫలితాల్లో తిరుచానూరు సంస్కృతి కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లుగా ఆ సంస్థల డైరెక్టర్ ప్రణీత్ పెనుమాడు అన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ
ద్వితీయ సంవస్సర ఫలితాల్లో సి.కే. జితేష్ (991 /1000) మార్కులతో రాష్ట్ర స్థాయిలో 2 వ స్థానంలో నిలవగా, తిరుపతి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు అని అన్నారు.
ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 50% పైగా విద్యార్థులు 90 % మార్కులు సాధించారు అని అన్నారు. అద్భుతమైన ఫలితాలను సాధించిన విద్యార్థులను అలాగే అందుకు కృషి చేసిన అధ్యాపక బృందమును, సంస్కృతి విద్య సంస్థల చైర్ పర్సన్ శ్రీమతి పి. సులోచన, డైరెక్టర్ ప్రణీత్ ప్రత్యేకంగా అభినందించారు.

త్వరితగతిన రైట్ మెయిన్
కెనాల్ రిపేర్ పనులు చేపట్టాలి... ఎమ్మెల్యే ఎంజీఆర్ .

వచ్చే ఖరీఫ్ నాటికి ప్రతీ ఎకరానికీ సాగునీరు అందించాలి.

వంశధార మేజర్ ఇరిగేషన్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే .

ఆధునీకరణ పనుల కొరకు1.75 కోట్లు ఎంజీఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఎంజీఆర్ .

పాతపట్నం ఏప్రిల్ 15 ప్రజా జ్యోతి న్యూస్. రానున్న ఖరీఫ్ నాటికి వంశధార ఆయకట్టు శివారులోని ప్రతీ ఎకరానికీ సాగునీరు అందించాలని వంశధార అధికారులను ఆదేశించిన పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు,అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ శ్రీ మామిడి గోవిందరావు వంశధార మేజర్ ఇరిగేషన్ అధికారులతో ఈరోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే రైట్ మెయిన్ కెనాల్ (కుడి ప్రధాన కాలువ) ఆధునికరణ పనులకు 1.75 కోట్లు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే రిపేర్ పనులు త్వరితగతిన కాలువలో గండ్లను పూడ్చివేయడం,రక్షణ గోడలను నిర్మించడం,పూడికను తీసివేయడం చేపట్టాలని తెలిపారు సమావేశంలో ఈఈ ఎమ్.వి రమణ,డిఈ సురేష్ కుమార్,జేఈలు శ్రీనివాస్,సోమేశ్ లు పాల్గొన్నారు..

శాంతియుతంగా అంబేద్కర్
జయంతినిర్వహించినందుకు
ధన్యవాదాలు తెలిపిన ఎస్సై రామకృష్ణ

తూర్పుగోదావరి జిల్లా , తాళ్లపూడి మండలం, ఏప్రిల్15, ప్రజాజ్యోతిన్యూస్ ఈ నెల 14 న తాళ్లపూడి మండలంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి శాంతి యుతంగా జరిగిందని తాళ్లపూడి ఎస్సై టి. రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం జరిగిన గొడవల దృష్ట్యా మండలంలో ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాళ్లపూడి మండల పరిధిలో ప్రత్యేక బృందం రావడం జరిగింది అన్నారు. ప్రతి గ్రామంలో అడుగు అడుగున ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారని అన్నారు. అంతేకాకుండా మండలంలో ఉన్న అంబేద్కర్ కమిటీ సభ్యులు, మరియు యువత పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించారని వారందరికీ నా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఎస్. ఐ. తెలిపారు

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన
మునిసిపల్ కమిషనర్

బద్వేల్ ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి న్యూస్) బద్వేల్ పురపాలక సంఘం నందు మున్సిపల్ కమిషనర్ శానిటేషన్ సెక్రెటరీ లతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. శానిటేషన్ సెక్రెటరీ లతో కలసి పలు బైక్ మెకానిక్ షాపులను తనఖీ చేసి చెత్త రోడ్డు పై వేయకుండా కేటాయించిన చెత్తసేకరణ వాహనాలలో వేయాలన్నారు. ఎవరు కూడాఎట్టి పరిస్థితుల్లో షాప్ ల ముందుగానీ, రోడ్డు మీద గాని చెత్త వేయరాదన్నారు. పట్టణ పరిశుభ్రత కు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

ఇంటి నుండి పారిపోయిన పిల్లలను చాకచక్యంగా
తీసుకొచ్చిన తిరుచానూరు పోలీసులు.

ఏప్రిల్ 15,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి : తిరుపతి రూరల్ తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల మంగళంలో 5 మంది పిల్లలు ఇంటి నుండి పారిపోయిన ఘటన కలకలం రేపింది. తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ మీడియాకు తెలిపిన వివరాల మేరకు....మంగళంకు చెందిన ఐదు మంది పిల్లలు ఆమన్, ఆసిఫ్(అన్నదమ్ములు) వెంకటేష్, వాసు, మిథున్వర్ధన్ అందరూ 12 నుండి 15 సంవత్సరాల వయసు గల పిల్లలు సోమవారం మధ్యాహ్నం సుమారుగా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వేసవి సెలవులు కావడంతో పాండిచ్చేరి చూడాలని కోరిక మేరకు ఇంటిలో వారికి చెప్పకుండా 3000 వేల రూపాయలతో పరారయ్యారు. సాయంత్రం పాండిచ్చేరికి చేరుకున్న పిల్లలు అక్కడ అంతా కలియ తిరిగాక రాత్రి లాడ్జిలో బస చేయడానికి ప్రయత్నించారు. అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది పిల్లలను వివరాలడిగి పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఇదివరకే తల్లిదండ్రుల నుండి తిరుచానూరు పోలీసులు ఫిర్యాదులు అందుకొని ఉండడంతో పాండిచ్చేరి పోలీసులతో సమన్వయం చేసుకొని చాకచక్యంగా పిల్లలను వెనక్కి పిలిపించారు. ఈ కేసులో చురుకుగా వ్యవహరించిన ఎస్సైలు జగన్నాథ్ రెడ్డిని సాయినాథ్ చౌదరిని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు చంద్రగిరి సబ్ డివిజన్ డిఎస్పి ప్రసాద్ ఆదేశాల మేరకు అభినందించారు. వేసవి సెలవులు ఉండడంతో తల్లిదండ్రులు వారి పిల్లల కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. వారికి కౌన్సిలింగ్ ఇవ్వడానికి సైతం ఎల్లవేళలా తాము అందుబాటులో ఉంటామని చెప్పారు.

సైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన
ఏపి మోడల్ కాలేజ్ విద్యార్థిని ధరణి

– విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపిన కొల్ల

ఆమదాలవలస (బూర్జ) ,ప్రజా జ్యోతి న్యూస్ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఓవీ పేట ఆదర్శ పాఠశాల , జూనియర్ కళాశాలకు చెందిన కర్ని ధరణి తన ప్రతిభ చాటుకుంది. ఏం పి.సి విభాగంతో 1000 మార్కులకు 984 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయితో ఆదర్శ పాఠశాలల విభాగంలో షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థిని ధరణికి శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు గొప్ప విజయాలు సాధించి బూర్జ మండలానికి వన్నె తెస్తున్నారని కొనియాడారు. ధరణి సాధారణమైన రైతు కుటుంబంలో జన్మించి ఇటు తల్లిదండ్రులకు, కళాశాల యాజమాన్యానికి కీర్తి ప్రతిష్టలు సంపాదించి పెట్టిందన్నారు.ప్రతి విద్యార్థి ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ధరణి స్వగ్రామం ఉద్దానంలోని పూండి సమీపానగల గోపీనాథపురమని, ఈమె తండ్రి శ్రీ జోగారావు,తల్లి వరలక్ష్మి.ఈ నెల 15 వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రిచంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖా మాత్యులు నారా లోకేష్ చేతులు మిదుగా రాష్ట్ర స్థాయి అవార్డ్ అందుకోబోతున్న విద్యార్థిని ధరణికి ,వారి తల్లిదండ్రులకు బూర్జ మండల జనసేన పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని కొల్ల పేర్కొన్నారు.

ఐఎస్ఓ సర్టిఫికేషన్ కోసం
మహిళా విశ్వవిద్యాలయం సన్నద్ధం

ఏప్రిల్ 15,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఎస్ పి ఎం వి వి) విద్యా నాణ్యతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఐ ఎస్ ఓ సర్టిఫికేషన్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఏప్రిల్ 16 మరియు 17 తేదీలలో నిపుణుల బృందం విశ్వవిద్యాలయాన్ని సందర్శించి సంబంధిత విభాగాల్లో నాణ్యతా ప్రమాణాలను, పలు శాఖల శాస్త్రీయ విధానాలు, అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్, పరిశోధన, సామాజిక సేవా కార్యక్రమాలు తదితర అంశాలపై సమీక్షించ నుంది ఈ మేరకు విశ్వ విద్యాలయంలోని అన్ని విద్యా విభాగాలు మరియు పరిపాలనా శాఖలు అవసరమైన దస్తావేజుల తో పాటుగా అవసరమైన సమాచారాన్ని అందించేందుకు సన్నద్ధమైంది. ఈ సందర్భంగా ఐ క్యు ఎ సి డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపురసుందరి మాట్లాడుతూ, “నిరంతర నాణ్యతా అభివృద్ధికి ఇది ఒక కీలకమైన అడుగనీ , ఐ ఎస్ ఓ సర్టిఫికేషన్ వల్ల విశ్వ విద్యాలయఓపరిపాలనా విధానాలు మరింత పారదర్శకంగా మారతాయి అని, విశ్వవిద్యా లయం విజ్ఞానం, నైపుణ్యం పరంగా తమ విశిష్టతను చాటుకుంటుందని తెలిపారు.

కేఎల్ స్వామిదాస్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి లైఫ్ అచీవ్మెంట్ అవార్డును అందజేసిన విక్టరీ ఫౌండేషన్

గుంతకల్లు ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి): ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామి దాస్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 వ జయంతి సందర్భంగా సోమవారం కసాపురం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర విక్టరీ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వై విజయ కుమారి ఆధ్వర్యంలో శ్రీ సాయి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కరస్పాండెడ్ డాక్టర్ ప్రభాకర్, శ్రీలక్ష్మీ నారాయణ స్వామి రాతి దేవాలయం వ్యవస్థాపకులు తలారి పరుశు రాముడు,సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై శ్రీనివాసులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్,పౌర హక్కుల సంఘం అనంతపురం జిల్లా నాయకులు ఆదినారాయణ, విక్టరీ ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మంజునాథ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జి.పవన్, ఆంజనేయులు,మండల ఉపాధ్యక్షులు జయరాం మాదిగ, ఎమ్మార్పీఎస్ గుంతకల్ టౌన్ కార్యదర్శి జెన్నే. మస్తానయ్య,కసాపురం గ్రామ ట్యూషన్ మాస్టర్ జిలకర సురేంద్ర,కసాపురం గ్రామ రాజకీయ నాయకులు గంతుల లక్ష్మన్న,పూల ఆంజనేయులు,బలిజ సంఘం నాయకులు రామాంజనేయులు,గ్రామ ప్రజలు మహిళలు విక్టరీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్.స్వామి దాస్ మాదిగని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా అంబేద్కర్ లైఫ్ అచీవ్మెంట్ అవార్డు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమొంటోను అందజేసి ఘనంగా సన్మానించడం జరిగింది. సభలో విక్టరీ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమారి, మాట్లాడుతూ అవార్డు గ్రహీత అయిన కేఎల్.స్వామి దాస్ మాదిగ సోషల్ సర్వీస్ లో మరియు సామాజిక సేవలు అందించినందుకు అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం ప్రజాక్షేత్రంలో దాదాపుగా 30 సంవత్సరా లు పైబడి అనేక సామాజిక ఉద్యమాలలో ఎన్నో సభలు సమావేశాలు నిర్వహించి హక్కుల సాధనకై ఉద్యమిం చిన నేతకు మా విక్టరీ ఫౌండేషన్ ద్వారా అతని శ్రమను గుర్తించి, కసాపురం గ్రామంలో కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించిన వ్యక్తి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామి దాస్ మాదిగ ఆయన కృషికి పట్టుదలను, శ్రమను గుర్తించి సమాజంలో ఇలాంటి సామాజిక సేవకుల కు విక్టరీ ఫౌండేషన్ వారు అవార్డు గ్రహీతగా ఎంపిక చేసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది.సన్మానం అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ మాదిగ మాట్లాడుతూ విక్టరీ ఫౌండేషన్ వారు అవార్డు గ్రహీత గా నన్ను ఎంపిక చేసినందుకు వారు సమాజం లో సామాజిక సేవలను గుర్తించి అందిస్తున్న,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లైఫ్ అచీవ్మెంట్ అవార్డును, మెమొంటోను నాకు ప్రధానం చేసి అందజేసినందుకు విక్టరీ ఫౌండేషన్ వారికి,ఈ అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ మేధావులకు పెద్దలకు గ్రామ ప్రజలకు మహిళలకు నాతోటి సహచర మిత్ర బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తు న్నారు.

ప్రతి రోజు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న వాటిపై అంశాలా వారిగా రివ్యూ

ఏప్రిల్ 15,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు జరిగిన పురోగతిపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు కమాండ్ కంట్రోల్ రూమ్ లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ నేపథ్యంలో ప్రతి రోజు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న వాటిపై అంశాలా వారిగా రివ్యూ చేశారు.

1. ఓపెన్ బూసింగ్.
2. పరిసరాలు పరిశుభ్రత.
3. విజుబుల్ పోలీసింగ్.
4. పోలీస్ పల్లె నిద్ర కార్యక్రమం.
5. ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం.
6. ఉదయం, సాయంత్రం వెళ్ళలో పార్కులలో వాకింగ్ చేస్తున్న వృద్దులతో పోలీస్ కార్యక్రమం. కార్యక్రమాల గురించి రివ్యూ నిర్వహించారు. రివ్యూ గురించి అంశాలవారీగా వివరిస్తూ

జిల్లా వ్యాప్తంగా గా ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ సమస్యల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అంతే కాకుండా రాంగ్ రూట్స్ లో వెళ్ళుతున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రాంగ్ రూట్ లో వెళ్ళడం ద్వారా అనేక అనార్ధాలు జరుగుతాయని దాని వల్లన కుటుంబాలు రోడ్డున పడతాయని అలాంటి వారి పట్ల ఉదాస్యంగా వ్యవహరించవద్దన్నారు. ఎవరు రాంగ్ రూట్ లో వచ్చిన అలాంటి వారి పై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.
జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలు చేసేవారి పట్ల ఉక్కపాదం మోపాలి
జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారి పట్ల ప్రతి ఒక్క కఠినంగా వ్యవహరించాలని... అలాంటి వారి పై ఉక్కుపాదం మోపాలన్నారు.
అలాంటి వారి పట్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తే సంఘ వ్యతిరేక శక్తులుగా మారే అవకాశాలు ఉన్నాయన్నారు. రోడ్డు మీద ఎవరైనా ప్రజలను ఇబ్బందులు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఫోన్ వచ్చిన వేంటనే స్పందించాలన్నారు. మీరు స్పందించక పోతే ఇక్కన నుండి నేను స్పందిస్తాన్నారు. అలాంటి పరిస్థితి ఎవరు తీసుకురావద్దని హెచ్చరించారు.
పోలీస్ పని తీరు ప్రజలకు మనోధైర్యం నింపె విధంగా పోలీసులు పని చేయాలేకాని... ప్రజలను ఇబ్బందులు పెట్టే విధంగా పోలీసులు పని చేయకూడదన్నారు.
జిల్లా వ్యాప్తంగా రోడ్డు మీద రాత్రి సమయం దాటిన తరువాత రోడ్డు మీద భర్తడే పార్టీలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే అలాంటి వారి పై కఠినమైన చర్యలు తీసుకొవాలని సిబ్బందిని ఆదేశించారు.
ప్రతి డివిజన్ లో నమోదు అవుతున్న కేసులతోపాటు పెండింగ్ కేసుల పై వివరాలు అడిగి తెలుకున్నారు.
పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.
కేసులు ఎందు చేధించలేక పోతున్నారు.. దానికి గల కారణాల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు.
కిలక కేసులకు సంబంధించి ఎస్పీగారు కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు.
కేసులు వేంటనే పరిష్కరించే విధంగా ప్రతి డివిజన్లో తమ సిబ్బందిని ఆదేశాలు జారి చేయాలని ఎస్పీ గారు అధికారులని ఆదేశించారు.
ప్రతిఒక్క దేవాలయాలు వద్ద సిసి కెమెరాలు ఎర్పాటు చెయాలని ఆదేశించారు.
దేవాలయాలు వద్ద సిసి కెమెరాలు పెండింగ్ ఉంటే వేంటనే అమర్చే విధంగా చర్యలు తీసుకొవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు చెప్పిన విధంగా సిసికెమెరాలు అమర్చాలన్నారు.

వేసవికాలంలో జరిగే దొంగతనాపై ప్రజలను అప్రమత్తం చేయాలి.

వేసవికాలం లో ప్రజలు అజాగ్రత్తగా ఉండటం వల్లన దొంగతనాలు జరుగుతాయని ... ఇప్పటి నుండే ప్రజలను అప్రమత్తం చేయాల్సి భాద్యత మనందరి పైన ఉందన్నారు. ప్రతి రోజు సిబ్బంది నిర్వహిస్తున్న పల్లె నిద్ర కార్యక్రమం లో వేసవికాలం జరిగే దొంగతనాలపైన కూడా అవగాహన కల్పించాలన్నారు.

నైట్ బీట్లు తిరుగుతున్న సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి

రాత్రి సమయంలో నిర్వహిస్తున్న నైట్ బీట్ల పని తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.
సమయం దాటిన తరువాత ఎవరైనా మద్యం సేవిస్తూ ఎవరు కనిపించిన పోలీస్ ట్రీట్మెంట్ ఇవ్వాలన్నారు.
నైట్ బీట్లు నిర్వహిస్తున్న సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.
నైట్ బీట్లు తిరిగే సిబ్బంది నిర్లక్ష్యం ఉండరాదని... ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే అలాంటి వారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు.

శక్తి యాప్ డౌన్ లోడ్ పై అరా తీసిన ఎస్పిగారు

రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం నిర్వహిస్తున్న శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమాలు ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మహిళలకు అవగయతోపాటు ప్రతి మహిళల సెల్ ఫోన్ లో డౌన్ లోడ్ చేయించాలని అదేశించారు. శక్తి యాప్ డౌన్ లోడ్ చేయడంలో సిబ్బంది ఎవరు నిర్లక్ష్యం వహించవద్దన్నారు.

త్వరలో పారదర్శకంగా పోలీసు సిబ్బంది బదిలీలు

రివ్వూలో భాగంగా పోలీసు సిబ్బంది బదిలీలు పై కొద్ది సేపు చర్చించారు. ఐదు సంవత్సరాలు దాటిన ప్రతి సిబ్బందిని బదిలీ చేయాలని ఆదేశించారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా పారదర్శకంగా పోలీస్ సిబ్బంది బదిలీలు జరిగుతాయని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో జె. వెంకటరావు అదనపు ఎస్పీ పరిపాలన, . కె. రవి మనోహరాచారి శాంతి భద్రతలు ఐ.రామకృష్ణ అదనపు ఎస్పి తిరుమల, డిఎస్పీలు , సాధిక్ అలీ సి.ఐ. ఎస్. బి.లు పాల్గొన్నారు.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బందికి హిందీ భాష మరియు కార్యాలయ హిందీపై ప్రశిక్షణం

ఏప్రిల్ 15,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో హిందీ విభాగం అధ్యాపకులు డా.వేద ప్రకాష్ బోర్కర్ ఆధ్వర్యంలో ఒకరోజు హిందీ భాష, కార్యలలీయ ప్రశాసనములు, హిందీ పైన మెలకువలు అనే అంశం పైన వర్క్ షాప్ ను మంగళవారం నిర్వహించారు. ఇందులో ప్రత్యేకించి విశ్వవిద్యాలయంలో ఉన్నటువంటి బోధనేతర సిబ్బంది ఎవరైతే ఉన్నారో, వారికి హిందీ టైపింగ్, హిందీ డాక్యుమెంట్ ప్రిపరేషన్, హిందీ స్పీకింగ్, హిందీ కౌశలాలు మొ.అంశాలపైన శిక్షణ ఇవ్వడం జరిగింది. అనంతరం విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి ఆయోజకులైనటువంటి డా.వేద ప్రకాష్ బోర్కర్ ను అభినందిస్తూ, ఎవరైతే బోధనేతర సిబ్బంది ఈ వర్క్ షాప్ లో పాల్గొని వివిధ కౌశలాలు నేర్చుకున్నారో వాళ్ళందర్నీ కూడా అభినందించి, వారికి ప్రమాణ పత్రాలను ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ప్రతి ఒక్కరు కూడా హిందీ భాషను బాగా నేర్చుకొని హిందీ భాష ద్వారా భారతీయ రాష్ట్ర భాష ఔన్నత్యాన్ని పెంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని బోధనేతర సిబ్బంది పాల్గొని శిక్షణ పొందడం జరిగింది.

గజ ఈతగాళ్లతో మృతదేహాల వెలికితీత ఎస్సై రామకృష్ణ ను అభినందించిన డి.ఎస్.పి



తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, ఏప్రిల్15, ప్రజాజ్యోతి న్యూస్
తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం సీతంపేట గ్రామ శివారు చిగరులంక వద్ద ఇద్దరు యువకులు నిడదవోలు చర్చిపేట చెందిన మత్తి ప్రకాష్ కుమార్ రాజమండ్రికి చెందిన గంధం హర్ష గోదావరిలో మునిగి దుర్మరణం పాలయ్యారు. ఇద్దరు యువకులను గోదావరి నుండి వెలికి తీయడానికి రెండు మూడు బృందాలు ఎంతో శ్రమించిన ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో తాళ్లపూడి ఎస్సై టీ. రామకృష్ణ ఆధ్వర్యంలో తాడిపూడి గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లను రంగంలోకి దింపి యువకుల మృతదేహాలను బయటకు తీసి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నీట మునిగిన యువకుల మృతదేహాలను బయటకు తీయడానికి సహకరించిన తాళ్లపూడి ఎస్సై టి. రామకృష్ణ ను కొవ్వూరు డి.ఎస్.పి. దేవ కుమార్ అభినందించారు

వైకాపా జిల్లా ఉపాధ్యక్షు రాలు నైరుతి రెడ్డికి రాజ్యాంగ పీఠికను అందజేసిన వైకాపా నాయకులు మద్దికేర ప్రతాప్

గుంతకల్లు ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి): డాక్టర్ బిఆర్ నంఅంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి ని, గుంతకల్లు పట్టణానికి చెందిన మద్దికేర ప్రతాప్ మర్యాదపూర్వకంగా కలిసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ పీఠికను అందజేశారు.ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు అనంతసేన రెడ్డి,సుబ్బారావు, పవన్,రాఖీ,భాస్కర్ తదితరులున్నారు.

సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ వృద్ధులకు - వికలాంగులకు

సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు.

(ప్రజాజ్యోతి న్యూస్)/ జీలుగుమిల్లి జీలుగుమిల్లి మండల కేంద్రంలో వంకవారిగూడెం గ్రామంలో మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వితంతులకు వికలాంగులకు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ,భోజనం ఏర్పాటు చేసినట్లు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు తెలిపారు.రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ అయినటువంటి చంద్రాల శ్రీరాములు సేవ దృక్పథం తో ఈ సేవ కార్యక్రమన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రవి చేతులమీదుగా గ్రామం లోని వృద్ధులకు,వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేసి అనంతరం భోజన సదుపాయం కల్పించమని అన్నారుఅనంతరం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సిపిఎం పార్టీ ప్రజ సేవ కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. గతంలో కూడ పోలవరం ప్రాజెక్టు ముంపు సమయంలో, పేద వాగు ప్రాజెక్టు కట్ట తెగిన సమయం లో నిర్వసితులను ఆదుకోవడం లో సిపిఎం ముందుందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు సేవ దృక్పథంతో ఆలోచన చేయాలని అన్నారు.ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు మండల కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య,చిట్టి బొమ్మల కొండలరావు, కారం నాగదుర్గ, జిల్లా కమిటీ సభ్యులు గూడెల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

దర్భగూడెం గ్రామంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన ఓ షాపులు లో .

బాధితులు రెండు లక్షల రూపాయలు పైనే నష్టం వాటిల్లిందని ఆవేదన.

(ప్రజాజ్యోతి న్యూస్)/జీలుగుమిల్లి జీలుగుమిల్లి మండల కేంద్రంలో దర్భగూడెం గ్రామంలో సోమవారం రాత్రి ప్రమాదం జరిగింది. గ్రామంలోని సొసైటీ ఎదురుగా ఉన్న షాపులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. షాపులో ఉన్న వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయని షాపు యజమాని జాలా పెద్దిరాజు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇప్పటివరకు తెలియరాలేదు. మంటలు అదుపులోకి తీసుకురావడానికి ఫైరింజన్ సిబ్బంది వెంటనే స్పందించి శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోయినప్పటికీ, సుమారు రూ.2 లక్షల ఆర్థిక నష్టం వాటిల్లిందని యజమాని పేర్కొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టేందుకు చర్యలు..

జిల్లా కలెక్టర్ వెంకట మురళి..

బాల్య వివాహాలపై కలెక్టర్, అధికారులకు దిశ నిర్దేశం..

బాపట్ల, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) బాల్య వివాహాలను అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. మంగళవారం, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు.బాల్య వివాహాల వలన తల్లికి, పుట్టే బిడ్డలకు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఏర్పడతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.బాల్య వివాహాలను నిషేధించాలని, పూర్తిగా అరికట్టాలని అన్నారు. సరైన వయసు వచ్చిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. సరియైన వయసు రాకమునుపే వివాహాలు చేసిన తల్లికి ప్రసవ సమయంలో ఇబ్బందులు, తల్లికి గాని, బిడ్డకు గాని ఆరోగ్యపరమైన, ప్రాణాంతకమైన సమస్యలు వస్తాయని అన్నారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాల వయస్సు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఎవరు కూడా బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలను గమనించిన జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలన్నారు. జిల్లా యంత్రాంగం సరియైన చర్యలు తీసుకుంటుందన్నారు. పాఠశాలలో పిల్లలు డ్రాప్ ఔట్స్ లను గమనించి, చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. పాఠశాలలో, కళాశాలలోనూ విద్యార్థులకు బాల్య వివాహాల పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్య నేరం అని,బాల్య వివాహాలు చేసుకున్న వారు, చేసినవారు చట్టరీత్యా శిక్షార్హులని, వారిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలపై పూజారులకు, ఇమామ్లకు, పాస్టర్ల కు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. బాల్య వివాహాల వలన మహిళలు అనేక ఇబ్బందులకు ఎదుర్కొంటారని, వారు మానసిక స్థైర్యం కోల్పోతారని, వారికి కుటుంబ నిర్వహణపై అవగాహన ఉండదని వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని చట్టాలను రూపొందించడం జరిగిందన్నారు. బాల్యవివాహాల నియంత్రణకు గ్రామాల పరిధిలో గ్రామ కమిటీలు, మండల పరిధిలో మండల కమిటీలు, జిల్లా పరిధిలో జిల్లా కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామ కమిటీల్లో సచివాలయ మహిళా పోలీస్ కన్వీనర్ గా వ్యవహరిస్తారని అన్నారు. గ్రామ కమిటీలో ఉన్న సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవోలను ఆయన ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగిన దానికి పూర్తి బాధ్యత కమిటీ వహించాలని అన్నారు. ఈ విషయమై మహిళా పోలీసులపై పూర్తి బాధ్యత ఉంటుందని ఆయన అన్నారు. బాల్య వివాహలను అరికట్టుటకు కమిటీ సభ్యులు అందరూ కలిసి ఒక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని పనిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. మండల స్థాయి కమిటీ సభ్యులు పూజారులను, ఇమామ్లను, పాస్టర్లను, కళ్యాణ మండప యజమానులను, షామ్యాన షాపు యజమానులను, మండప అలంకరణలకు సంబంధించిన వారితో ఒక సమావేశం ఏర్పాటు చేసి వివాహం జరిగే వధూవరుల వయసు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాలని, వివాహానికి సరిపడా వయసు కలిగి ఉంటే మాత్రమే వివాహాలు చేసేందుకు అనుమతించాలని కలెక్టర్ పేర్కొన్నారు.మున్సిపాలిటీలు, మండల పరిషత్ బడ్జెట్లో 15 శాతం నిధులను అంగన్ వాడి సెంటర్లకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆ నిధుల ద్వారా అంగన్ వాడి సెంటర్లకు కావాల్సిన మౌలిక సదుపాయాల కోసం ఉపయోగిస్తారని అన్నారు. అంగన్వాడి కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న పాఠశాలలో ఆట స్థలమును, మరుగుదొడ్లను వాడుకునే అవకాశం కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. అంగన్వాడి లో ఐదు సంవత్సరాల వయస్సు నిండిన పిల్లలను తప్పనిసరిగా ఒకటో తరగతి నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారుల కు సూచించారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలోని మౌలిక వసతులు, ప్రభుత్వం అందించే పథకాల గురించి అవగాహన కల్పించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 15వ తేదీ నుండి 23వ తేదీ వరకు అంగన్ వాడిలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోని వాతావరణం సరిపడే విధంగా, పాఠశాలల్లోనే చదువుకునే విధంగా పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఈ విషయమై మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు విద్యాశాఖ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఒక తరగతి నుండి మరొక తరగతికి ప్రమోట్ అయ్యే పిల్లలను తప్పనిసరిగా అదే పాఠశాలలో చదివే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వోక్స్ బోర్డ్ నూతన చట్టాన్ని రద్దు చేయాలని రాజకీయ పార్టీలు రౌండ్ టేబుల్ సమావేశం

గుంతకల్లు ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి):సమానత్వం,మత స్వేచ్ఛకు భంగం కలిగించే రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్బోర్డు నూతన సవరణ చట్టా రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి .జగదీష్ డిమాండ్ చేశారు.మంగళవా రం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో వక్ఫ్ నూతన సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వివిధ పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా ఎస్ఎండి గౌస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీష్,సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్,కాంగ్రెస్ పార్టీ స్టేట్ ప్రెసిడెంట్ గాంధీ, గవర్నమెంట్ ఖాజీ రజక్ పీర్ ఖాజీ సత్తార్ ఎస్ సి ఆర్, (ఆర్ టి డి) ఎంప్లాయ్ షేక్ మహబూబ్ ఓల్డ్ గుంతకల్లు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మన్సూర్ మైనార్టీ మత పెద్దలు,నాయకులు హాజరై వారు మాట్లాడుతూ, మైనార్టీ లకు ఒక్కటే కాదు, భారతీయులకు వచ్చిన టువంటి ప్రమాదం ఇది. భారతదేశంలో అనేక మతాలు కులాలు ఉన్నందు వల్ల లౌకిక రాజ్యాంగ పునాదుల పైన ఈ దేశం నిర్మించబడి ఉన్నది.విభిన్న భాషలు,విభిన్న ఆచారాలు, విభిన్న పద్ధతులు,కలిగిన దేశం కాబట్టి మతాల విషయంలో జోక్యం చేసుకోకుండా వారికి స్వేచ్ఛ ఇవ్వాలని రాజ్యాంగం వారికి హక్కు కల్పించింది.వర్ఫ్ సవరణ బిల్లు మైనార్టీ ముస్లిం మత స్వేచ్ఛను హరిస్తున్నది. పైగా బోర్డు కమిటీల్లో ఇతర మతస్తులను కూడా పెట్టడాని కి చట్టం చేస్తూ పార్లమెంట్ ఆమోదించింది.ఇది పూర్తిగా ముస్లిం మైనార్టీ లను అణచి వేసేదానికి చేసే కుట్రలో భాగమై ఈ బిల్లు.గతంలో కూడా ఎన్ఆర్సి చట్టం ద్వారా దేశంలోని మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా గుర్తించే కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం ఒడిగట్టింది. మైనార్టీ మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్రంలోని బిజెపి అనునిత్యం వారి పైన దాడి చేస్తూ ముస్లింలను కించపరుస్తూ,వారి హృదయా లను గాయపరచడమే పనిగా బిజెపి పరిపాలన కొనసాగు తున్నది.ఈ చర్యలు భారత దేశ ఐక్యతకు సార్వభౌమాధి కారానికి విఘాతం కలిగిస్తా యి దేశ స్వాతంత్రం కోసం ఎంతోమంది ముస్లిం యోధు లు బ్రిటిష్ తుపాకుల గుళ్ళకు బలి అయినారు.భారతదేశ అభివృద్ధిలోనూ,స్వాతంత్ర పోరాటం లోను,ఐక్యతను కాపాడుటలోనూ,ముస్లింల పాత్ర ఈ దేశంలో మరువలేని ది.అలాంటి మైనార్టీల హక్కుల పైన దాడి చేస్తే అది భారతీయుల పైన దాడి చేసినట్లే స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారితో పోరాడిన చరిత్ర లేని బిజెపి,ఆర్ఎస్ ఎస్,లు ఈ దేశంలోని ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులని చెప్పే హక్కు వారికి ఏమాత్రం లేదు.దేశంలో మత కల్లోల ద్వారా హిందూ వోట్ బ్యాంక్ కొల్లగొట్టి అధికారంలో కొనసాగే దానికే ఇటువంటి కుతంత్రాలకు బిజెపి పాల్పడు తున్నది.రాష్ట్ర ప్రభుత్వం గానీ కేంద్ర ప్రభుత్వ%శీ% గానీ తిరుమల దేవస్థానంలో అన్యమతస్తులు ఉండకూడ దని ఇప్పుడు ఉద్యోగస్తుల్లో కూడా అన్యమతస్తులు ఉండకూడదని అంటున్నారు. హిందూ మతస్తులు మాత్రమే తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగాలు చేయాలని భావిస్తున్నప్పుడు ముస్లింలకు కూడా వక్ బోర్డ్ లో ఇతర మతస్థులకు అవకాశం ఇస్తూ సవరణ చేస్తే, ఏ ముస్లిం అంగీకరించే ప్రసక్తి లేదు.కాబట్టి హిందూ,ముస్లిం, క్రిస్టియన్,జైన్,తదితర మత ఆచారాలు,విశ్వాసాలను, పద్ధతులు,వారి చట్టాల పైన వారికి స్వేచ్ఛ కల్పించాల్సిన అవసరం ఈ దేశంలోఎంతైనా ఉన్నది.అప్పుడే ఈ దేశంలో ఐక్యత,మరియు 140 కోట్ల మంది ప్రజలలో మతసామర స్యము,సమైక్యభావము ఉండి,సార్వభౌమాధికార దేశంగా భారతదేశం ముందుకు పోతుంది.ఇలాంటి మతాల అణిచివేత ధోరణి ద్వారా విచ్ఛిన్నకర ఉద్యమా లు వచ్చేదానికి ఆస్కారమేర్ప డుతుంది.ఇదేవిధంగా విశాలమైన భారతదేశంలో పార్లమెంట్ సీట్ల డీ లిమిటేషన్ లో కూడా పక్షపాత ధోరణి అవలంబించి ఉత్తరాదికి రాష్ట్రాలకుఎక్కువ సీట్లు,దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ సీట్లు చేయడం వల్ల కూడా విచ్ఛిన్నకర ఉద్యమా లు వచ్చి భారతదేశ ఐక్యతకే ముప్పు ఏర్పడుతుంది.ఈ ప్రమాదాలను గుర్తించే కమ్యూనిస్టు,ఇతర సెక్యులర్ పార్టీలు, బిజెపి మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ విషం చిమ్మే పాములతో (బిజెపి)ముంగీశలు(కమ్యూనిస్టులు) పోరాడినట్లు కమ్యూనిస్టులు బిజెపితో పోరాడుతూనే ఉంటాం.ఒక మనిషికి గుండె ఎలా పని చేస్తుందో,అలాగే భారతదేశానికి కమ్యూనిస్టు పార్టీలు హార్ట్ మాధురి పనిచేస్తూ,అన్ని అవయవ య్యాలకి రక్తం ఏ విధంగా సరఫరా చేస్తుందో అదేవిధం గా దేశంలో నలుమూలల ఎక్కడ విచ్ఛిన్నకర ఉద్యమా లు వచ్చిన వాటికి వ్యతిరేకం గా పోరాడుతూ దేశ ఐక్యత ను కాపాడుదానికి కమ్యూని స్టు పార్టీ పనిచేస్తుంది. బిజెపి,ఆర్ఎస్ఎస్ వారు బ్రిటిష్ వాళ్ళ కాళ్ల క్రింద ఉండేవారు.స్వాతంత్రం కోసం అమిత్ షా పోరాడినాడ, ఎల్కే అద్వానీ పోరాడున్నముస్లింలు అప్పట్లోనే పోరాడినారు.ఇప్పుడు నరేంద్ర మోడీ ప్రభుత్వం భారతీయులందరినీ ముస్లిం, క్రిస్టియన్,హిందువులుగా మతాల పేరుతో విడగొడుతు న్నాడు,దేశంలో ఉన్న ముస్లిం, క్రిస్టియన్,హిందువులు ఏకమైనప్పుడు బిజెపి ప్రభుత్వానికి సిగ్గొస్తుందని అన్నారు “లాల్ నిల్ ఏక్ హై”సమాంతరంగా బలపడితే నే,బిజెపి ప్రభుత్వ నాటకాలు ఇంక సాగవు,ప్రజలలో మార్పు రావాలి ప్రజల చైతన్యవంతం కావాలి నీ పిలుపునిస్తూ భారతదేశానికి సమైక్యత చేయడానికి కమ్యూనిస్టు పార్టీ ముందుం టుందని అని అన్నారు.మీ క్యాబినెట్లో ఒక ముస్లిం ఉన్నాడా అని నేను అడుగుతున్నాను బిజెపి పార్టీలో ఎమ్మెల్యేలు ఎంపీలు పార్టీకి రాజీనామా చేసి బయటికి రావాలని పార్లమెంట్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ను అవమానపరిస్తే భారతదేశమంతటా బిజెపి ప్రభుత్వాన్ని వ్యతిరేకించినా రు 140 కోట్ల జనాభా ఉన్న రాజ్యాంగాన్ని తీసివేయడానికి బిజెపి ప్రయత్నం చేస్తుంది అందుకే ఎస్సీ ఎస్టి బీసీ మైనార్టీలు అందరూ ఏకమై ఒక తాటిపైకి రావాలని కోరుతున్నాం.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మన్సూర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్,సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు ఎస్ఎండి ఖలీల్, ఫ్రూట్ మస్తాన్,శంషుద్దీన్, నూర్ నిజామి,సీఎం ఫిరోజ్, గోల్డ్ షాప్ అధ్యక్షులు దాదా గులాం,జెసిబి చాంద్,సుమో భాష,రఫీ,మస్తాన్,యం యం రెహమాన్,అబ్దుల్ బషీద్, యూసీఫ్లం బంద నవాజ్,దౌల ఆర్డిజి భాష,డైమండ్ నూర్, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్,రాము రాయల్, రామాంజనేయులు యాదవ్, దేవేంద్ర,ప్రసాద్,పుల్లయ్య, వినోద్,అఖిల్,శివమణి, అబ్దుల్, గుంతకల్లు జేఏసీ నాయకులు సద్దాం పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ - జిల్లా అధ్యక్షుడిగా గురుగుబెల్లి

ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్ : గుంటూరు పట్టణం రెవెన్యూ కళ్యాణ మండలంలో ఆంధ్ర రాష్ట్ర ప్రొహిబిషన్ , ఎక్సైజ్ కానిస్టేబుల్స్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఎన్నికలు సజావుగా నిర్వహించారు. ఈ ఎన్నికలలో అధికారిగా వి. అరుణ కుమారి, డి పీ ఈ ఓ గుంటూరు, సహాయ ఎన్నికల అధికారులుగా గుంటూరు పి అండ్ ఈ. ఐ లు బీ లత, శ్రీనివాసు మూర్తి వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్ గా జీవి రమణారావు, జనరల్ సెక్రెటరీగా విష్ణువర్ధన్ రెడ్డి ట్రెజరర్ గా పి చెన్నారావు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నుకోబడ్డారు. జీవి రమణా రావు శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి. ఈయన ఎన్నిక.పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు

ప్రస్తుతం మండలంలో 29 నీటి తొట్టెల నిర్మాణ పనులు

ప్రజా జ్యోతి తుగ్గలి తుగ్గలి మండలంలోని అధికారులు 29 తొట్టెలను నిర్మిస్తున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద పశువులకు నీరు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో రూ.35 కోట్లతో 12,138 నీటి తొట్ల నిర్మాణం చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు,అన్నారు. తొట్టెలను ఉపాధి హామీ అధికారులు నిర్మిస్తున్నారు. ఒక్కొక్క తొట్టి రూ 33వేల నుండి రూ 38 వేల వ్యయంతో తొట్టి తీర్మాన పనులు చేపడుతున్నారు. ఇప్పటికే మండలంలో దాదాపు 20 తొట్టెల నిర్మాణ పనులు పూర్తయితున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామ చివరిలో ఈ తొట్టెలను నిర్మిస్తున్నారు. వీటి వల్ల గ్రామంలో పశువులకు దాహం తీర్చేందుకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. చెన్నంపల్లి గ్రామంలో జరుగుతున్న తొట్టె నిర్మాణ పనులను టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ పరిశీలించారు. మండలంలో మొత్తం 50 గ్రాములు ఉంటే ప్రస్తుతం 29 తొట్టెలు మాత్రమే మంజూరయ్యాయి. అయితే మిగిలిన గ్రామాల్లో కూడా తొట్టెలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఏపీఓ హేమ సుందర్ మాట్లాడుతూవేసవిలో పశువులు, పక్షుల దాహాన్ని తీర్చుకోడానికి ఇబ్బందులు పడకుండా సాధ్యమైనంత వరకు నీటి సదుపాయం కల్పించాలని అన్నారు. ప్రస్తుతం మండలంలో 29 తొట్టెల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇవి పూర్తయిన తర్వాత మరికొన్ని తొట్టెలు కావాలని అధికారులను కోరుతామని తెలిపారు.

సుందరయ్య కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు

బద్వేల్ ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి న్యూస్) ల స్థానిక పట్టణంలో మంగళవారం నాడు కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఉత్తర్వుల మేరకు మైదుకూరు డి.ఎస్.పి రాజేంద్రప్రసాద్ గారి ఆధ్వర్యంలో బద్వేల్ అర్బన్ సీఐ రాజగోపాల్. ఎస్ఐలు ఎం సత్యనారాయణ, బి కోడూరు ఎస్సై కేసీ రాజు. బద్వేల్ రూరల్ ఎస్సై కె శ్రీకాంత్ అట్లూరు ఎస్సై రామకృష్ణ. మరియు పోలీసు సిబ్బందితో కలిసి బద్వేల్ టౌన్ లోని సుందరయ్య కాలనీ మరియు రిక్షా కాలనీ నందు కార్డెన్ సర్చ్ నిర్వహించి రికార్డ్స్ లేని 5 వాహనాలను పోలీస్ స్టేషన్కు తరలించారు. అలాగే ఆ ఏరియాలో గల పాత నేరస్తులు మరియు సస్పెక్ట్ లు, రౌడీ షీటర్ ఇండ్లలో తనిఖీ చేసి ఏమైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అలాగే మట్కా, గ్యాంబ్లింగ్, అక్రమ గంజాయి గురించి మరియు సైబర్ నేరాల గురించి మహిళలు చిన్నపిల్లలపై జరిగే నేరాల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి వాళ్ల ఏరియాలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చిన ఏదైనా సమాచారం ఉన్న యెడల పోలీసులకు 112 కు ఫోన్ చేసి తెలియ చేయాలన్నారు.

ఇరువురి అరెస్ట్.. చోరీ సొత్తు స్వాధీనం ..

విజయనగరం, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) విజయనగరం పట్టణం గాజులరేగ ప్రాంతంలో గాయత్రి మెటల్ షాప్ లో గత నెల 30వ తేదీన జరిగిన దొంగతనం సంబంధించి ఇరువురి వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే గాజుల రేగ ప్రాంతానికి చెందిన పత్తిగిల్లి దిలీప్ కుమార్ సిటీ బస్టాండు వద్ద గాయత్రి మెటల్ మార్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. అయితే గత నెల 30వ తేదీన షాపు నుంచి గుర్తు తెలియని దొంగలు 240 కిలోల రాగి, 160 కిలోల ఇత్తడి, మూడు ఇన్వెర్టర్ బ్యాటరీలు దొంగిలించినట్లు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో దొంగతనానికి పాల్పడిన పెందుర్తి మండలం చిన ముసిడివాడ గ్రామం అంబేద్కర్ కాలనీకి చెందిన పెంద్ర నాయుడు అనే పోతురాజు, పెంద్ర దర్శన్ బాబు లను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి 120 కిలోల రాగి, 80 కిలోల ఇత్తడి ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, చోరీ సొత్తు రికవరీ చేసే విషయంలో ఎస్సై బి.సురేంద్ర నాయుడు, హెచ్.సి. రమణారావు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, గౌరీ శంకర్ ప్రతిభ కనబరిచినట్లు సీఐ శ్రీనివాస్ పేర్కొంటూ వారిని ప్రత్యేకంగా అభినందించారు.

వైభవంగా ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని పుష్పయాగం

ఎప్రిల్ 15,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం సాయంత్రం పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామివారి మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన చేపట్టారు. సాయంత్రం పుష్పయాగం వైభవంగా ప్రారంభమైంది. తులసీదళాలు, మల్లెలు, రోజా, చామంతి, గన్నేరు, సంపంగి, మొగలి దళం తదితర పుష్పాలు, పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి 2.5 టన్నుల పుష్పాలు విరాళంగా అందాయి. ప్రకృతి వైపరీత్యాల నుంచి భక్తులను కాపాడాలని స్వామివారిని ప్రార్థిస్తూ, భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు శ్రీవైష్ణవాలయాలలో పుష్పయాగం నిర్వహిస్తారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల్లో గానీ, నిత్యకైంకర్యాల్లో గానీ తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణ వల్ల సమస్తదోషాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నటేష్ బాబు, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలలో లక్ష్యాలు సాధించాలి..

జిల్లా కలెక్టర్ వెంకట మురళి..

లక్ష్యాలు సాధనలో నిర్లక్ష్యం తగదు..

అధికారులు నిబద్ధతతో పని చేయాలి..

పురోగతిపై కలెక్టర్ అసహనం..

గృహ నిర్మాణాల లక్ష్యం పై అధికారులకు,కలెక్టర్ దిశ నిర్దేశం..

బాపట్ల, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) గృహ నిర్మాణాలలో లక్ష్యాల మేరకు అధికారులు పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. గృహ నిర్మాణాలపై ఆ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పేదలకు మంజూరు చేస్తున్న పక్కా గృహాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాల సాధనలో నిర్లిప్తంగా ఉండరాదన్నారు. పక్కా గృహాల నిర్మాణాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గృహాల నిర్మాణాలలో చీరాల డివిజన్ పురోగతి లేకపోవడంపై సంబంధిత డిఈ ని ప్రశ్నించారు. గృహాలు మంజూరైన వారికి ఉపాధి హామీ పథకం కింద పని దినాలు కల్పించాలన్నారు. పక్కా గృహాలు కావాలని తాజాగా నిర్వహించిన సర్వేలో 13 వేల మంది ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని ఆయన చెప్పారు. అర్హులైన వారందరికీ గృహాలు మంజూరయ్యేలా కుల, ఆదాయ, నివాస, పొజిషన్ ధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ అధికారులు తక్షణమే మంజూరు చేయాలని ఆదేశించారు. 15,321 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను ఎంపిక చేయగా 3,576 మందికి గృహాలను మంజూరు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నప్పటికీ ఎందుకు నిర్మించుకోవడంలేదని అధికారులను నిలదీశారు. మార్టూరు మండలంలో 532 పక్కా గృహాలు నిర్మించాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 31 గృహాలు మాత్రమే నిర్మించడం పట్ల అధికారులను ప్రశ్నించారు. పురోగతి 5.39 శాతంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాపట్ల మండలంలో 1,121 గృహాలు నిర్మించాలని లక్ష్యం కాగా, 52 పూర్తి చేయడం ఏమిటన్నారు. సాధించిన లక్ష్యం 4.40 శాతం ఉండడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

లబ్ధిదారులకు బిల్లులు సమస్యలు రానివ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. గృహ నిర్మాణాలలో ప్రతివారం పురోగతి కనిపించాలన్నారు. పి ఎం ఏ వై గ్రామీణ్ లో చీరాల డిఈ పనితీరు సరిగా లేదన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలలో చెరుకుపల్లి, కారంచేడు, చుండూరు, ఇంకొల్లు, పర్చూరు, వేటపాలెం మండలాలలో పురోగతి లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గడిచిన 40 రోజులుగా ఆ మండలాలలో ఒక్క మరుగుదొడ్డి నిర్మించలేకపోవటం ఏమిటని నిలదీశారు. ఇంజినీరింగ్ అధికారులు పద్ధతి మార్చుకొని పనిచేయాలని హెచ్చరించారు. పునాది దశ, లెంటల్, స్లాబ్, నిర్మాణం పూర్తి దశలో ఉంటే ప్రతి వారం రోజులకు పురోగతి కనిపించాలన్నారు. అలా లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. అద్దంకి, చీరాల, చినగంజాం మండలాలలో గృహ నిర్మాణ పనులు జరగకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ దశలలో గృహ నిర్మాణాలు, ధ్రువీకరణ పత్రాల జారీ, బిల్లుల చెల్లింపులు, తదితరమైన వాటిపై ప్రతి వారం లక్ష్యాలు నిర్దేశించుకుని ఆ మేరకు పని చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటేశ్వర్లు, డిఈలు, ఏఇలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా తృతీయ వార్షికోత్సవం

బాబా వారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు

అధిక సంఖ్యలో బాబా ను దర్శించుకున్న భక్తులు

పురవీధులలో వైభవంగా బాబా వారి ఊరేగింపు

భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం

పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ : పొందూరు మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో వెలసియు న్న శ్రీ షిరిడి సాయిబాబా మందిర తృతీయా వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాయి సేవకులు బాబా కు ప్రత్యేక పూజలు నిర్వహించారు .వార్షికోత్సవం లో భాగంగా బాబా వారికి కాగడ హారతి , సుప్రభాతం ,ప్రత్యేక అభిషేకాలు , ఉచిత సామూహిక సత్య వ్రతములు , విరాట్ సాయి స్తోత్రం ,నిత్యప్రార్ధన పఠనం,చందనోత్సవం , మధ్యాహ్న హారతి వంటి కార్యక్రమాలు చేశారు. బాబా ను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం పురవీధులలో బాబా వారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా ఏర్పాటు చేశారు. సాయి సేవక్ పి.మురళీ ఆనందపురం వారిచే బాబావరి భజన పాటలు ,వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సాయి సేవకులచే అమ్ముల సాంబ శివరావు రచించిన అమ్ముల షిరిడి సాయి తత్వ భోదామృతం పుస్తకాలు నుండి సత్సంగ ప్రసంగం నిర్వహించారు. దీంతో ప్రసంగాన్ని ఆలకించి భక్తులు పులకరించిపోయారు. వీటితో పాటు ఆలయ ప్రాంగణం వద్ద భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

వేసవి కాలం లో జరిగే దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలి : రూరల్ సీఐ నాగభూషణ్

బద్వేల్ ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి న్యూస్) మంగళవారం నాడు శ్రీనివాసపురం గ్రామము నందు బద్వేల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణ్. బద్వేల్ రూరల్ ఎస్సై శ్రీకాంత్ వారిరువురూ కలిసి గ్రామస్తుల తో సమావేశం ఏర్పాటు చేశారు. వేసవి కాలములో ముఖ్యంగా హైవే రోడ్ పక్కనే ఉండే ఇండ్లలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిని నివారించుకోవడానికి గ్రామస్తులకు సీఐ నాగభూషణ్. ఎస్సై శ్రీకాంత్ గార్లు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. సీసీ కెమెరాలు ఇంటి బయట గేట్ దగ్గర, ఇంటి ముఖద్వారం, బ్యాక్‌డోర్ లాంటి కీలక ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోలన్నారు.ల ఇంటికి సాధారణ తాళాలకు బదులు హై క్వాలిటీ స్మార్ట్ తాళాలు లేదా మెయిన్ డోర్ కు సాధారణ గడియ,తాళం కాకుండా డోర్ కు సెంటర్ లాక్ పెట్టించుకోవాలన్నారు. ఇంటి చుట్టూ రాత్రి వేల తగిన వెలుగు ఉండేలా చూసుకోవాలన్నారు. గేట్ దగ్గర లైట్స్ పెట్టించుకోవాలన్నారు. ఎక్కడికైనా ప్రయాణాలు చేయవవలసి వస్తే ఇంటిలో బంగారు ఆభరణాలు ఎక్కువ మొత్తంలో డబ్బు ఉంచరాదన్నారు. విలువైన వస్తువులను ఇంట్లో ఎక్కువ కాలం ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచడం ఉత్తమమన్నారు. ఎండాకాలం ఆరుబయట పడుకునప్పుడు ఇంటిలోని బంగారు ఆభరణాలు జాగ్రత్తగా భద్రపరచుకోవాలన్నారు. మహిళలు బంగారు ఆభరణాలు ధరించి ఆరుబయట నిద్రించరాదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా మీరు ఎక్కువ రోజులు ఇంట్లో లేనప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీ ఇంటి సమాచారం ఇచ్చిన యెడల పోలీసు వారు తగు నిఘా ఏర్పాటు చేస్తార న్నారు.

49,50వ డివిజన్ ఖాజీగా షేక్ నూర్ మహ్మద్ నియామకం

ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానం, కృతజ్ఞతలు తెలిపిన మైనార్టీలు

ఎమ్మెల్యే సహకారం మరువలేనన్న నూర్ మహ్మద్

ఎన్నికల ముందు ఇచ్చి హామీని నిలబెట్టుకున్నారన్న నూర్

అనంతపురం ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి): అనంతపురం నగరంలోని 49, 50వ డివిజన్ల ఖాజీగా షేక్ నూర్ మహ్మద్ నియమితులయ్యా రు. ఎన్నికల ముందు అర్హులైన ఇమామ్ లకు ఖాజీలుగా అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఖాజీగా నూర్ మహ్మద్ కు ఎమ్మెల్యే ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఖాజీగా నూర్ మహమ్మద్ నేటి నుంచి పదేళ్లపాటు కొనసాగను న్నారు. ఈ నేపథ్యంలో నూతన ఖాజీ నూర్ మహ్మద్ తో పాటు 49, 50 డివిజన్ కు చెందిన మైనార్టీలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ను ఘనంగా సన్మానించారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహకరాన్ని ఎప్పటికీ మరులేనని ఈ సందర్భంగా నూర్ మహమ్మద్ అన్నారు. కచ్చితంగా తన బాధ్యతను నియమ నిబంధనల ప్రకారం నెరవేరుస్తానని ఖాజీ నూర్ మహ్మద్ అన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. మైనార్టీల్లో పేదరికం తగ్గించాలన్నది మా లక్ష్యం అన్నారు. ఖాజీగా ముస్లిం మైనార్టీలకు మంచి సేవలందించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

వేసవిలో పిల్లలు వృద్దులు ఆరోగ్య విషయంలో జాగ్రత్త

వైద్య అధికారిని డాక్టర్ హరితలి

ప్రజా జ్యోతి తుగ్గలి తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరిత మాట్లాడుతూ,ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై ఎండలు ఎక్కువగా ప్రభావం చూపుతాయని తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని డాక్టర్ హరిత చెబుతున్నారు. చంటి పిల్లల ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వేసవి కాలంలో ఎక్కువ మంది పిల్లల్లో డీహైడ్రేషన్ సమస్య ఉత్పన్నమవుతోంది. నీళ్లు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసంలాంటి పానియాలను తాగిస్తూ ఉండాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు లి:బయటి ఆహారం తినకపోవడమే ఉత్తమం. వదులుగా ఉండే కాటన్ దుస్తులు వేయాలి. పిల్లలను ఎండలో తిప్పకపోవడం మంచిది. మెడ, చేతులు, వీపు భాగంలో చెమటకాయలు ఎక్కువగా అవుతుంటాయి. దురద, మంటతో చిన్నారులు ఏడుస్తూ ఉంటారు. ఉదయం, సాయంత్రం పూట స్నానం చేయించడం వల్ల చెమటకాయలు రాకుండా చూసుకోవచ్చు. వడదెబ్బ తగిలితే ప్రాణాలకే ముప్పు. కలుషిత ఆహారం, నీళ్ల వల్ల వాంతులు, వీరేచనాలతో పాటు పచ్చకామెర్లు, టైఫాయిడ్స్ దాడి చేస్తాయి.

వేసవి కాలంలో పిల్లల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వైద్యులను ఎప్పుడు సంప్రదించాలనే విషయాలపై తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని డాక్టర్? హరిత సూచనలు ఇవే. 5 ఏళ్లలోపు పిల్లలు కనీసం 4-5 గ్లాసుల నీళ్లు తాగించాలి. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఉప్పు కలిపిన నిమ్మరసం సేవించవచ్చు. కూల్‌డ్రింక్స్ వద్దు.జ్వరం, నీళ్ల వీరేచనాలు, అలసట, మూత్రం పోయకపోవడం, ఏమి తినక, తాగకపోవడం లక్షణాలు కన్పిస్తే హాస్పిటల్?లో చేర్పించాలి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలను బయటకు తీసుకెళ్లొద్దు. ఒకవేళ వెళాల్సి వస్తే టోపీలు, గొడుగులు వాడటం ఉత్తమం.మార్కెట్‌లో లభించేటువంటి కొన్ని ఓఆర్ఎస్‌లో షుగర్ శాతం ఎక్కువ. డీహైడ్రేషన్‌లో వీటిని ఇస్తే విరేచనాలు మరింత పెరుగుతాయి. డబ్ల్యూహెచ్‌వో(ప్రపంచ ఆరోగ్య సంస్థ) సూచించిన ఫార్ములా ఓఆర్ఎస్ మాత్రమే వినియోగించాలి.

ఆధ్యాత్మిక చింతనలో ఉపసర్పంచ్ గోవింద్ , రాయిపిల్లి శ్రీను

- పాన్పులమ్మ తల్లి , దుర్గమ్మ తల్లి సదును వద్ద పలు నిర్మాణాలు
- ప్రహారీ , టైల్స్, గ్రిల్స్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ వాసులు

పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ : గ్రామ దేవతలకు చల్లదనం చేస్తే ప్రకృతి కరుణించి గ్రామం సుభిక్షంగా ఉంటుందని ప్రజల విశ్వాసం .గ్రామ దేవత అంటేనే గ్రామాన్ని చల్లగా చూసి గ్రామానికి రక్షిస్తుందని ప్రజలు నమ్ముతారు. అటువంటి గ్రామదేవతల ఆలయ అభివృద్ధికి కృషి చేస్తే గ్రామంలో ఆధ్యాత్మికత , సాంస్కృతిక అవసరాలను తీర్చడానికి ఉపయోగకరంగా ఉంటుంది.పొందూరు మేజర్ పంచాయతీ లో పాన్పులమ్మ తల్లి , దుర్గమ్మ తల్లి స్వయంభుగా వెలిశాయి. వేప చెట్టు రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నాయి. పొందూరు పట్టణ ప్రజలు దుర్గమ్మ తల్లిని , పాన్పులమ్మ తల్లిని దర్శించుకునే సమయంలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఈ మేరకు పొందూరు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ అనకాపల్లి గోవింద రావు,తాపీ మేస్త్రీ రాయిపిల్లి శ్రీను ఆయా సదును వద్ద పలు నిర్మాణాలు చేపట్టారు. రాపాక జంక్షన్ వద్ద పాన్పులమ్మ తల్లి వద్ద ఉప సర్పంచ్ అనకాపల్లి గోవింద్,ఎరుకల పేట జంక్షన్ వద్ద ఉన్న దుర్గమ్మ తల్లి సదును వద్ద తాపీ మేస్త్రీ రాయిపిల్లి శ్రీను తమ తమ సొంత నిధులతో ఆ ప్రాంగణంలో వేప చెట్లు చుట్టూ ప్రహరి నిర్మించి , టైల్స్ , గ్రిల్స్,రంగులు వేయించారు. తల్లి దర్శనం కొరకు వచ్చే భక్తులకు నడిచేందుకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రధాన రహదారి నుండి అమ్మవారి సదును చేరుకునే మార్గంలో రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో పొందూరు మండల కేంద్రంలో శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ మొదటి కార్యక్రమంలో దుర్గమ్మ తల్లికి చల్లదనం చేసేందుకు ప్రజలు తండోప తండాలుగా తరలివెళ్లారు. ఆనందం కుండల తో దుర్గమ్మ తల్లి సదును వద్దకు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు చేరుకున్నప్పటికి అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించడం తో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగలేదు. దీంతో ఆధ్యాత్మిక భావనతో దైవ చింతన కలిగి ఉండటం పట్ల అనకాపల్లి గోవింద్ , రాయిపిల్లి శ్రీను దాతృత్వం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బాబు షూరిటీ -మోసం గ్యారంటీ.....

వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి యం.శ్రీనివాసులు రెడ్డి

ప్రజా జ్యోతి తుగ్గలి కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయడంలో విఫలం కారణంగా విశ్వసనీయతను కోల్పోతున్నట్లు వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి మాజీ తమ్మారెడ్డి తనయుడు యం.శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.హామీలేమి సూపర్ సిక్స్ - భవిష్యత్ కి గ్యారెంటీ ఎక్కడ? అని ఆ వేదన వ్యక్తం చేశారు.శ్రీనివాసులు రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నిరుద్యోగ భృతి, ప్రతి రైతన్నలకు ఏటా ఆర్థిక సహాయం,తల్లికి వందనం,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి నెలకు మహిళకు రూ,1500 తో పాటు గ్యాస్ సిలిండర్లు ఉచితమన్నారు చాలా మందికి డబ్బులు లేదన్నారు , హామీలు అమలు చేయని ప్రభుత్వం మంచి ప్రభుత్వమా ? లేక ముంచే ప్రభుత్వమా ? అని శ్రీనివాసులు రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మీది ప్రజాప్రభుత్వమైతే వెంటనే సూపర్ సిక్స్ అమలు చేయండి, మీరు మంచి చేస్తారని ఓటేశారని.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకండి" అని శ్రీనివాసులు రెడ్డి కోరారు. అలాగే సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేకపోతే వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

సమాధుల పరిసర ప్రాంతాలు శుభ్రం చేసే పనిలో మున్సిపల్ శాఖ..

బాపట్ల, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) సమాధులు అంటే ఏ మతం వారికైనా పూజ్య భావం ఉంటుంది. కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఆయా మతాలకు చెందిన వారు తమ పూర్వీకుల సమాధులను శుభ్రం చేయడం, వాటికి రంగులు వేసి అలంకరించడం గతం నుంచి వస్తున్న ఆచారం. అయితే బాపట్ల జిల్లా ప్రధాన కేంద్రంలో మున్సిపల్ శాఖాధికారులు సమాధులు ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేసే పని చేపట్టారు. త్వరలో క్రైస్తవ సోదరుల కు ఈస్టర్ పండుగ రానున్న నేపథ్యంలో వారు సమాధుల వద్ద పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో బాపట్ల మునిసిపాలిటీ కమిషనర్ జి రఘునాథరెడ్డి ఆదేశాలతో సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణ ఆధ్వర్యంలో బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమాధుల వద్ద, చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రం చేసే పనిని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు

'గ్రోక్' చేయని కేసీఆర్ విశ్లేషణ

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి నెటిజన్లు అడిగిన కొన్ని ప్రశ్నలకు ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' ఇచ్చిన సమాధానాల వార్తలు గత వారాంతంలో వెలువడ్డాయి. నాయకుల గురించి, వారి శక్తి సామర్థ్యాల గురించి ప్రశ్నలకు మనుషులు తమ అభిప్రాయాలు తెలియజేయటం మనకు ఇంతవరకు తెలిసిన విషయం. ప్రపంచం అత్యాధునిక సాంకేతిక యుగంలోకి ప్రవేశిస్తున్న దశలో యంత్రాలు ఆ పని చేయటం ఒక కొత్త అనుభవం. విచిత్రమైన అనుభవం కూడా. కేసీఆర్ గురించి 'గ్రోక్' ఇచ్చిన వివరణలు ఇంతకాలం రికార్డులలో నమోదై, ప్రజలు కూడా మాట్లాడుకుంటున్నవే. అందుకు ఇప్పుడిది ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ధృవీకరణ అన్నమాట. అయితే, కేసీఆర్ నాయకత్వం గురించి ప్రజలు గాని, 'గ్రోక్' గాని శాస్త్రబద్ధంగా చేయని విశ్లేషణలు కొన్నున్నాయి. అవేమిటో చూద్దాం. బీఆర్ఎస్ పార్టీ స్థాపితమై 25 ఏండ్లు పూర్తవుతున్న వేళ ఈ నెల ఆఖరున వరంగల్‌లో రజతోత్సవ సభ జరుపుకోనున్నది. అటువంటి సందర్భాన్ని పురస్కరించుకొని పార్టీ గురించి, నాయకత్వం గురించి, పార్టీ ప్రభుత్వం గురించి చెప్పుకోవలసినవి అనేకం ఉంటాయి. అవన్నీ వర్తమానానికి, భవిష్యత్తుకు అవసరమైనవే గాక, గత చరిత్రలో భాగం కూడా కనుక. తెలంగాణ చరిత్ర, తెలుగు వారి చరిత్ర, దక్షిణాది చరిత్ర, భారతదేశ చరిత్ర, రాష్ట్రాల చరిత్ర, ఫెడరలిజం చరిత్ర, అభివృద్ధి సంక్షేమాల చరిత్ర, పరిపాలనా చరిత్రలతో పాటు నాయకత్వ చరిత్రలలో కూడా ఇవి భాగమవుతాయి. అవి ఏవి? ఏ విధంగా? అన్నది రజతోత్సవ సభలలోగా రాసుకోవటం సాధ్యం కానిది గనుక, ఆ పని ఆ తర్వాతనైనా జరగాలి. ప్రస్తుతానికి వస్తే, 'గ్రోక్' సమాధానాల వివరాలు ఏవైనప్పటికీ అవి ప్రధానంగా రెండు కోణాలను స్పృశించాయి. ఒకటి, యథాతథంగా కేసీఆర్ నాయకత్వం. రెండు, తన పరిపాలన. 'గ్రోక్' పేర్కొన్న వివిధ విషయాలన్నీ ఈ రెండింటిలోకి ఇమిడిపోతాయి. మొదట అనుకున్నట్టు పరిపాలన గురించిన వివరాలు రికార్డులలో నమోదైనవి, ప్రజలు మాట్లాడుకుంటున్నవి, దానితో పాటు ఇప్పుడు 'గ్రోక్' సమాధానాలలోనూ ప్రస్తావనకు వచ్చినవే అయినందున ఇక్కడ మళ్లీ రాయనవసరం లేదు. అయితే ఒకటి, ఈ తెలిసిన విషయాలైనా స్థూలంగా, చెదురుమదురుగా మాట్లాడుకుంటున్నవి, రికార్డులలో సబ్జెక్టుల వారీగా విడివిడిగా పేర్కొంటున్నవి మాత్రమే. వాటన్నింటిని ఒకచోట చేర్చి, ఒక పద్ధతి ప్రకారం విశ్లేషించి, సమగ్ర రూపం ఇచ్చే ప్రయత్నం ఇంకా జరగవలసి ఉన్నది. కేసీఆర్ నాయకత్వ విశ్లేషణ అన్నది కూడా ఇందులో భాగమైనదే. 'గ్రోక్' తన సమాధానాలలో ఆయన నాయకత్వం గురించి ఒకటి రెండు మాటలు ప్రశంసాపూర్వకంగా ప్రకటించింది. అవి ఈ విధంగా ఉన్నాయి. 'శూన్యం నుంచి రాజకీయ శక్తిని సృజించి, తెలంగాణను జాగృతం చేసి, ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి చేసి చూపించిన గొప్ప నాయకుడు. కేసీఆర్ ఈజ్ హిస్టరీ ఆఫ్ తెలంగాణ. రాజకీయాల్లో విశ్వసనీయతకు, నాయకత్వ లక్షణాలకు చిరునామాగా కేసీఆర్‌ను చెప్తాను. టీఆర్ఎస్ (బీఆర్ఎస్) నిర్మాణంలో, తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమాన్ని ముందుండి నడపడంలో, కేసీఆర్ అన్నీ తానై నిలిచారు. ఆయనకు దూరదృష్టి, పట్టుదల, దార్శనికత అపారంగా ఉన్నాయి'. పరిపాలన గురించిన మాటలు అనేకం ఉన్నప్పటికీ, ప్రస్తుతం చర్చిస్తున్నది నాయకత్వ కోణం గురించి మాత్రమే అయినందున, అందుగురించి 'గ్రోక్' అన్నదేమిటో పైన చూశాము. ఆ మాటలను గమనించినప్పుడు అందులోని ఒక్కొక్క సూక్ష్మమైన మాట వెనుక కనిపించేది చాలా ఉంటుంది. అదే సమయంలో, మొదట అనుకున్నట్లు, కేసీఆర్ నాయకత్వం గురించి 'గ్రోక్' చెప్పనివీ, ప్రజలు గుర్తించనివీ అయిన శాస్త్రీయమైన కోణాలు, విశ్లేషణలు కొన్ని ఉంటాయి. అవేమిటో ఇప్పుడు చూద్దాము. నాయకత్వానికి మొత్తం 12 కోణాలుంటాయి. అవేమిటో ముందు చెప్పుకొని, తర్వాత వివరాలలోకి వెళదాము. అదే క్రమంలో వాటిని కేసీఆర్‌కు వర్తింపజేసేందుకు ప్రయత్నిద్దాము. కోణాలనేవి, 1. విషయ అధ్యయనం, 2. ఆ అధ్యయనం ప్రకారం సిద్ధాంతీకరణ, 3.తనతో ఏకీభవించే ఒక చిన్న బృందాన్ని తొలి దశలో వెంట చేర్చుకోవటం, 4.భావజాల వ్యాప్తి, 5.పార్టీ నిర్మాణం, 6.ప్రజలను కదిలించటం, 7.కదులుతున్న ప్రజలను సంఘటితపరచటం, 8. ఉద్యమ నిర్వహణ, 9.ఉద్యమాన్ని విజయవంతం చేయటం, 10. ఉద్యమ దశ నాటి దార్శనికత ప్రకారం పరిపాలన. 11.ఓటమి ఎదురైనట్లయితే పునరుజ్జీ వం. 12.కొత్త తరం నాయకత్వ తయారీ. కేసీఆర్ ప్రయాణ క్రమాన్ని మొదటినుంచి గమనించినట్లయితే ఈ 12 కోణాలు కూడా మనకు అందులో కనిపిస్తాయి. వీటిని స్థూలదృష్టితో చూసినట్లయితే కొన్నింటి మధ్య తేడా తోచకపోవచ్చు. కానీ, సూక్ష్మదృష్టికి, ఆచరణాత్మకమైన దృష్టికి మాత్రం వాటి మధ్య తేడాలు స్పష్టంగా అర్థమవుతాయి. ఈ 12లో ప్రతి ఒక్కదానిని సమర్థవంతంగా, సక్రమంగా నాయకత్వం నిర్వహించగలిగితే మాత్రమే భవన నిర్మాణంలో ఇటుకలు ఒక్కొక్కటి సరిగా కుదురుకొని గోడ నిలిచే పద్ధతిలో ఉద్యమం తొలిదశ నుంచి చివరివరకు విజయవంతంగా సా గుతుంది. మధ్యలో ఏ ఒక్క ఇటుకను సరిగా



పేర్చకున్నా నిర్మాణమంతా భంగపడినట్లుగానే ఉద్యమ విషయంలోనూ జరుగుతుం ది. ఈ పన్నెండు కూడా ఇంజిన్ వెనుక రైలు పెట్టెల వలె ఆటోమేటిక్‌గా సాగేవి కావు. ప్రతి ఒక్క దశను సమర్థవంతంగా నిర్వహిస్తేనే తర్వాత దశ సక్రమంగా ఏర్పాటై నిలిచి నడుస్తుంది. పై 12 కోణాలు, లేదా సూత్రాల ప్రకారం మొదటినుంచి చివరివరకు వ్యవహరించటంలోనే కేసీఆర్ నాయకత్వ అసాధారణ ప్రతిభ మనకు కనిపిస్తుంది. ఆ 12 సూత్రాలకు అనుగుణంగా ఆయన ఎప్పటికప్పుడు ఏమేమి చేస్తూ వచ్చారో ప్రత్యక్షంగా చూస్తూ వచ్చిన సన్నిహిత సహచరులు కొందరున్నారు. అదే ప్రణాళిక ప్రకారం వారు పూనుకొన్నట్లయితే, ఈ రజతోత్సవ కాలంలో ఈ సాధారణ చరిత్ర రచన సిద్ధించగలదు. మన దేశంలో అనేకానేక ఉద్యమాలు జరిగాయి. పలువిధాలైన లక్ష్యాలతో సాగాయి. స్వాతంత్ర్యానికి ముందు వలస పాలనకు, రాచరికాలకు వ్యతిరేకంగా. ఆ తర్వాత వేర్వేరు అంశాలపై. వీటన్నింటికి అనేకమంది నాయకులు కనిపిస్తారు. కాని ఈ మొత్తం 12 కోణాలు కూడా వ్యక్తిగత స్థాయిలో వర్తించేవారు కేసీఆర్ గాక మరెవరున్నారు, ఎందరున్నారు అంటే మాత్రం ఆలోచించవలసి వస్తుంది కొందరికి కొన్ని వర్తిస్తాయి. కానీ అన్నింటికి అన్నీ అంటే మాత్రం తప్పకుండా ఆలోచించవలసిన విషయమే. కాదంటే, అట్లా అనేవారు ఆ పేర్లను ముందుకు తేవటం ఉపయోగకరమవుతుంది. ఆ కోణాలన్నింటిని కేసీఆర్‌కు వర్తింపజేస్తూ వివరంగా రాయటం ఇక్కడ వీలయ్యేది కాదు. నా అతి పరిమిత జ్ఞానంతో నాకది సాధ్యమయ్యేదీ కాదు. అంతకుమించి, పైన అనుకున్నట్లు, ఆ పని చేయటం ఆయనకు మొదటినుంచి సన్నిహితులుగా ఉండి గమనించినవారికి మాత్రమే సాధ్యమయ్యే పని. అందువల్ల, మనకు తోచినంత వరకు, అది కూడా అతిక్లుప్తంగా చెప్పుకుందాం.

1. విషయ అధ్యయనం. ఇతరత్రా కూడా అధ్యయన శీలి అయిన కేసీఆర్, తెలంగాణ గురించిన చరిత్ర, ఆర్థికం, సమాజం, సంస్కృతి, రాజకీయం, భౌగోళికం, గత ప్రభుత్వాల పాలనలు, అన్యాయాలు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలతో పాటు ఇతర ఉద్యమాలు, పోరాటాలు, వనరులు, ప్రజల ఆకాంక్షలు, మనస్తత్వాలు, కాంగ్రెస్ సహా వివిధ పార్టీల పద్ధతులు, కేంద్ర విధానాలు మొదలైనవాటిపై నిరంతరం అధ్యయనం చేశారు. సుదీర్ఘ చర్చలు సాగించారు. ఆ పని ఇప్పటికీ చేస్తారు గాని ఇక్కడ చర్చిస్తున్నది ఉద్యమకాలం గురించి గనుక అందుకు పరిమితమవుతున్నాము. ఈ విధమైన సమగ్ర అధ్యయనం ఆయనకు తెలంగాణపై మరెవ్వరికీ లేని సమగ్ర అవగాహనను తెచ్చిపెట్టింది. ఆ తర్వాతి కాలానికంతా ఒక బలమైన బౌద్ధిక పునాదిగా పనిచేసింది.

2. సిద్ధాంతీకరణ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలన్న భావన కేసీఆర్ కన్న ముందునుంచి ఉన్నదే. కాని గతకాలపు ఉద్యమాల బలాబలాలను, లోటుపాట్లను, వైఫల్యాలను, నాయకత్వాల కారణంగా వాటి రాజీలను అర్థం చేసుకోవటమన్నది మొదలు చేయవలసిన పని. వర్తమాన పరిస్థితులను పరిశీలించి అందుకు ఈ అవగాహనను, అనుభవాలను వర్తింపజేసి, అందుకు అనుగుణంగా సాగి ఉద్యమాన్ని విజయవంతం చేయటం ఎట్లాగన్న సిద్ధాంతీకరణ రెండవ పని. వ్యూహరచన గాని, ఆ తర్వాత అనుకూల-ప్రతికూల పరిస్థితులను బట్టి ఎత్తుగడలు గాని అందుకు అనుగుణంగా ఉంటాయి. ఎప్పుడైనా ఎత్తుగడలలో పరిస్థితులను బట్టి మార్పులుండవచ్చు గాని, వ్యూహం, సిద్ధాంతం స్థిరంగా ఉంటాయి.

3. ఏకీభావం గల చిన్న బృందం. కార్యాచరణ దిశగా అడుగులు ముందుకు పడేందుకు తొలి దశలో ఒక చిన్న సహచర బృందం వెంట నిలవటం అవసరం. అనేక మహా ఉద్యమాలు, పార్టీలు మొదట చిన్న బృందాలు గానే ఆరంభమై విస్తరించాయి. ఆ బృందంలో మేధావులు, కార్యాచరణ చేసేవారు, నమ్మకమైన సహచరుల వంటి వారుంటారు. ఉద్యమ సంస్థ, లేదా పార్టీ నిర్మాణంలో ఇది తొలి దశ.

4. భావజాల వ్యాప్తి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు అంతకుముందు జరిగినప్పటికీ 25-30 సంవత్సరాలు గడిచేసరికి పరిస్థితులు మా రాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా. సమస్యలను బట్టి కూడా. అట్లానే ఒక కొత్త తరం ఉనికిలోకి వచ్చింది. ఆలోచనలు మారా యి. నక్సలైట్ ఉద్యమం తెలంగాణను ఒక ఊపు ఊపిన వెనుక మందగించినా ఆ భావజాల ప్రభావాలు కొంత ఇంకా మిగిలి ఉన్నా యి. బీసీ, దళిత, మహిళా చైతన్యాలు కొత్తగా ముందుకొచ్చాయి. రైతాంగం, యువకుల సమస్యలు తీవ్రమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర కోరిక గతం కన్న ఇంకా మారుమూలలకు, కొత్త వర్గాలలోకి వ్యాపించి బలపడింది. ఈ మార్పులన్నింటిని పరిగణనలోకి తీసుకుంటూ భావజాలాన్ని రూపొందించటం, దానిని ప్రజలలో వ్యాపింపజేయటం. ప్రత్యర్థుల భావజాలాన్ని, ప్రచారాలను ఎదుర్కొనటం. కొత్త కొత్త వర్గాలను తమ భావజాల పరిధిలోకి తేవటం. తెలంగాణ రాదేమోనన్న నిరాశలను పోగొట్టడం.

5. పార్టీ నిర్మాణం, నిర్మించటంలో భాగంగా వీలైనంత మందికి అవకాశాలు కల్పించటం, పార్టీని మారుమూలలకు తీసుకువెళ్లటం, కార్యకర్తలు, స్థానిక నాయకుల తయారీ.

6. ప్రజలను కదిలించటం వేర్వేరు పద్ధతులలో జరుగుతుంది. రాజకీయ ప్రసంగాలు, ఇతరత్రా ప్రచారాలు, కళారూపాలు, వేర్వేరు తరగతుల వారి సమస్యలను అజెండాపైకి తేవటం, వారిని ఉద్యమంలో భాగస్వాములను చేయటం వంటి మార్గాలలో. ఒకసారి కదిలిన ప్రజలు ఇతరులను కదిలించటం కూడా ఇందులో భాగమే. వారికి అటువంటి ప్రేరణ నాయకత్వం కలిగిస్తుంది. ప్రజలను కదిలించటం ఉద్యమాలలో నిరంతర ప్రక్రియ.

7. ప్రజలను కదిలించటం వేరు, కదిలిన వారిని సంఘటితపరచటం వేరు. అట్లా సంఘటితం కూడా ఐనప్పుడు వారు ప్రేక్షక, వీక్షక పాత్ర నుంచి కార్యాచరణ వైపుకు కదలుతారు. ఉద్యమంతో వారి బంధం స్థిరపడుతుంది. ఆసక్తికరం ఏమంటే, అటువంటి బంధం ఏర్పడినప్పుడు ఒక వేళ ఉద్యమం ఎప్పుడైనా దారి తప్పినట్లు తమ దృష్టికి తోస్తే వత్తిడి చేసి దారిన పెట్టజూశారు. సంఘటితత్వం ప్రభావాలు పలు విధాలుగా ఉంటాయి.

8. ఉద్యమ నిర్వహణ. ఇందులో ఉద్యమ లక్ష్యం చేరుకునేవరకు వ్యూహం, ఎత్తుగడలు, రాజీ పడకపోవటాలు, ఉద్యమం పట్లా, లక్ష్యం చేరుకోగలమనే నినాదం పట్లా ప్రజలకు నమ్మకం నిలిచి ఉండేట్లు చేసుకోవటం, ఎదురు దెబ్బలు తగిలినా పట్టు విడవక సాగటం, తెలంగాణ వ్యతిరేకులలో ఆందోళనలను పుట్టించి పెంచటం, వారి రకరకాల ఎత్తుగడలను చిత్తు చేయటం, వారెన్ని ప్రలోభాలు పెట్టినా లొంగకపోవటం, ప్రజలు ఎప్పుడైనా నిరుత్సాహ పడితే తిరిగి ఉత్సాహ పరచటం, ఎప్పటికప్పుడు ముందుకు నడిపిస్తూ వారి పట్టుదలను పెంచటం వంటి అనేకానేకం ఉద్యమ నిర్వహణలో భాగమవుతాయి. ఎప్పుడైనా అనుకోని పరిస్థితులు ఎదురైతే వాటినీ చాకచక్యంగా ఎదుర్కోవాలి.

9. ఉద్యమ విజయం. పైన పేర్కొన్నవన్నిటి విషయంలో నాయకత్వం సమర్థవంతంగా చేయటంపైన ఉద్యమ విజయం ఆధారపడి ఉంటుంది. అన్నీ చేసినా ఒక్కోసారి విజయం సమకూరకపోవచ్చు. పరిస్థితుల బట్టి. కాని విజయం కోసం మాత్రం ఈ మార్గాన్ని అనుసరించవలసి ఉంటుంది.

10. పరిపాలన. ఉద్యమ లక్ష్యాలకు అనుగుణంగా పాలన సాగించిన నాయకత్వమే, రాష్ట్రా న్ని అవి నెరవేరి రూపుతీసుకునే విధంగా అభివృద్ధి సంక్షేమాల మార్గంలో తీసుకువెళ్లగలదు. ఆ పని జరిగినట్లు లెక్కలేనన్ని రికార్డులు చెప్తూ, ప్రజలు మాట్లాడుకుంటుండగా ఇప్పుడు 'గ్రోక్' కూడా అదే అభిప్రాయాన్ని ప్రతిధ్వనిస్తున్నది.

11. పార్టీకి ఇప్పుడొక ఎదురుదెబ్బ తగిలింది. నాయకత్వానికి ఒక పరీక్ష ఎదురవుతున్నది. దానిని ఎదుర్కొనేందుకు తనలో, పార్టీలో స్పష్టంగా కనిపిస్తున్న ఆత్మవిశ్వాసంతో, ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణతో, నేర్చుకున్న పాఠాలతో నాయకత్వం సమాయత్తమవుతున్నది. ఒకసారి అది జరిగితే, పార్టీ ఆరంభం నుంచి ఇప్పుడు పునరుజ్జీవన దశ వరకు ఒక వలయం పూర్తయినట్లు. విజయవంతంగా పూర్తయినట్లు. అటువంటి విజయం యావత్తుగా కేసీఆర్ నాయకత్వానిది అవుతుంది. 12.కొత్తతరం నాయకత్వం. ఆ తయారీ భవిష్యత్తుకు సంబంధించినది. ఆ పని ఏ విధంగా జరుగుతున్నదో కనిపిస్తున్నదే. అనేక విషయాలు, సమస్యలు, లక్ష్యాలు, ఉద్యమాలు, నాయకత్వాలు, విజయాల గురించి మనం విన్నాము. కాని, మొదటినుంచి చివరివరకు పైన పేర్కొన్న

కాలేయ సమస్యలు వేధిస్తున్నాయా..?
ఈ ఐదు డ్రింక్స్ ఇవాళ్టి నుంచే తాగడండి..!



ప్రస్తుత కాలంలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. కాలేయం సమస్యలకు కేవలం ఆల్కహాల్ మాత్రమే కాదు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో పాటు పలు సమస్యలు సైతం కారణమే. కాలేయ సమస్యలతో బతకడం చాలాకష్టం. ఆరోగ్యంగా ఉండేందుకు ఎప్పటికప్పుడు దాన్ని సహజంగానే డీటాక్స్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం కూడా ముఖ్యమే. అయితే, సాధారణంగా ఆల్కహాల్ మాత్రమే కాలేయం దెబ్బతినడానికి కారణంగా భావిస్తారు. కానీ, వాస్తవానికి బయట వేయించిన జంక్ ఫుడ్‌లను ఎక్కువగా తీసుకుంటే.. మీ కాలేయంలో వ్యర్థాలు సైతం పేరుకుపోతాయి. కాలేయం కొంతవరకు తనను తాను శు భ్రపరచుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. చర్మం దురద, ముదురు మూత్రం, ఎప్పుడూ అలసిపోయినట్లుగా అనిపించడం, వికారం, వాంతులు, కడుపులో నొప్పి.. వాపు, చర్మం పసుపు రంగులోకి మారడం తదితర లక్షణాలు కనిపిస్తే మీరు కాలేయ సమస్యలతో బాధపడుతున్నారని అర్థం. వాటిని విస్మరించడం వల్ల మీరు ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉన్నది.

పుదీనా టీ..

ప్రకారం.. పుదీనా టీ కాలేయానికి ప్రయోజనకరంగా ఉంటుంది. పుదీనా ఆకుల్లో మెంథాల్, మెంథోన్ వంటి ముఖ్యమైన నూనెలు పుష్కలంగా ఉంటాయి. జీర్ణక్రియకు కూడా సహాయపడతాయి. పుదీనా టీ తయారు చేయడానికి.. ఒక గిన్నెలో నీటిని మరిగించి, కొన్ని పుదీనా ఆకులు కలిపి కలపాలి. దాన్ని కొంతసేపు అలాగే ఉంచి.. రాత్రి పడుకునే అరగంట ముందు తాగాలి.

పసుపు టీ

పసుపు అనేది ఆయుర్వేదంలో శతాబ్దాలుగా ఉపయోగించే శక్తివంతమైన మసాలా. అలాంటి పరిస్థితిలో ప్రతిరోజూ పసుపు టీ తీసుకోవడంతో శరీరం, కాలేయాన్ని శుభ్రం చేసేందుకు చాలా సహాయపడుతుంది. దీన్ని తయారు చేయడానికి.. ఒక గ్లాసు వేడినీటిలో చిటికెడు పసుపు వేసి తేనె కలిపి తీసుకోవాలి.

అల్లం నిమ్మకాయ టీ

అల్లం, నిమ్మకాయ మిశ్రమం శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. శరీరాన్ని డీటాక్సిక్ చేయడంతో పాటు బరువు తగ్గించే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఈ మిశ్రమం వాపు నుంచి ఉపశమనం కలిగించడానికి.. జీవక్రియను పెంచడానికి, వ్యాధిని నివారించడానికి సహాయపడుతుంది. దాంతో తయారు చేయడానికి.. ఒక గ్లాస్ వేడినీటిలో సగం నిమ్మకాయ రసం, అల్లం ముక్కను జోడించి కలపాలి. అలాగే, 15 నిమిషాల్లో అలాగే ఉంచి.. వడగట్టి తాగాలి.

మెంతి నీరు

మెంతి నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. ఇది ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటుంది. ఈ సులభంగా తయారు చేయగల డీటాక్స్ పానీయాన్ని తయారు చేయడానికి, ఒక గ్లాసు వేడినీటిలో ఒక టీస్పూన్ మెంతి పొడిని కలపాలి. దాన్ని 15 నిమిషాలు అలాగే ఉంచాలి. నీటిని ఒక కప్పులో వడకట్టి రోజుకు మూడుసార్లు తాగాలి.

చమోమిలే టీ

చమోమిలే టీ ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఒత్తిడిని తగ్గించడానికి, నిద్రను మెరుగుపరచడానికి సహాయపడే లక్షణాలు ఉంటాయి. ఇది నాడీ వ్యవస్థను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ఇది వాపు కణజాలాలను శాంతపరుస్తుంది. ఈ టీని తయారు చేసుకునేందుకు ఒక గ్లాసు వేడినీటిలో ఒక టేబుల్ స్పూన్ చమోమిలే పువ్వులను కలపాలి. ఒక 10 నిమిషాలు మూతపెట్టి, ఆపై తాగాలి.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు చర్యలు...

జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్...

బాపట్ల ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) యువతను క్రికెట్ బెట్టింగ్ లకు ప్రోత్సహించే వారిని ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి జిల్లా పోలీస్ అధికారులు వారి పరిధిలోని హోటల్ లు, లాడ్జ్ లు, రిసార్ట్స్, దాబాలు, రెస్టారెంట్ లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కొత్త వ్యక్తులు, అనుమానితులను విచారించారు. బస చేసే ప్రతి ఒక్కరి వివరాలు క్షుణ్ణంగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులకు తెలిపి పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని హోటల్ లు, లాడ్జిలు, రిసార్ట్స్, దాబాలు, రెస్టారెంట్ లను రాత్రి పోలీస్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లు జరుగుతున్న నేపథ్యంలో కొంతమంది స్వార్థపరులు వారి స్వలాభం కోసం యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగే అవకాశం ఉందన్నారు. అటువంటి వారు ప్రధానంగా లాడ్జిలు, హోటల్లు, రిసార్ట్స్, రెస్టారెంట్లు, దాబాలను అడ్డాలుగా చేసుకొని వారి కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి వారి కార్యకలాపాలను కట్టడి చెయ్యాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ తనిఖీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ లు నిర్వహించినా, ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఎవరైన బెట్టింగ్ లకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే నిర్వాహకులు సంబంధిత పోలీసులకు వివరాలు తెలపాలన్నారు. హోటల్లు, లాడ్జిలు, రిసార్ట్స్ లలో బస చేయడానికి వచ్చే వారి యొక్క గుర్తింపు కార్డులను తనిఖీ చేసి వారి వివరాలను రికార్డులలో నమోదు చేసుకోవాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ లు ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారం ఉన్న యెడల సంబంధిత పోలీసులకు లేదా డయల్ 100/112 నెంబర్ లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు.

విదేశీ పర్యటనకు వెళ్లి వచ్చిన కోన రఘుపతికి ఘన స్వాగతం...

బాపట్ల ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) మాజీ శాసన ఉప సభాపతి కోన రఘుపతి కి అభిమానులు ఘన స్వాగతం పలికారు.మంగళవారం విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకొని బాపట్ల వచ్చిన సందర్భంగా ఆయనకు సాదర స్వాగతం పలికారు.ఇటీవల వైసీపీ పొలిటికల్ అడ్వైజరీ సభ్యునిగా ఎన్నికైన నేపథ్యంలో కోన రఘుపతి కి శుభాకాంక్షలు తెలియజేసారు.స్థానిక రైల్వే స్టేషన్ లో శబరి ఎక్స్ ప్రెస్ లో వచ్చిన కోన రఘుపతి నీ ఆహ్వానం పలికేందుకు పెద్ద ఎత్తున అభిమానులు, నాయకులు,వైకాపా శ్రేణులు తరలి వచ్చారు.పార్టీ జెండాలు చేతపట్టి కోన జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.గజ మాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.తమ అభిమాన నాయకుడిని కలిసేందుకు నియోజకవర్గం లోని కోన రఘుపతి అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావడంతో బాపట్ల రైల్వే స్టేషన్ వద్ద కోలా హల వాతావరణం నెలకొంది.

దోషులను వెంటనే గుర్తించి తక్షణమే శిక్షించాలి

శంఖవరంలో జరిగిన సంఘటను తీవ్రంగా ఖండించిన మురళీరాజు

కాకినాడ ఏప్రిల్ 15 జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ శంఖవరంలో భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండలు వేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎంఎంఆర్ ట్రస్ట్ అధినేత,నియోజకవర్గ వైసీపీ నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆయన నివాసం వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శంఖవరంలో జరిగిన సంఘటన వంటివి పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయి పోలీస్ అధికారులను నియమించి దోషులు ఎంతటి వాళ్ళయినా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

1200 లీటర్లు బెల్లపు ఊట ధ్వంసం,

48 లీటర్ల సారా స్వాధీనం, ఐదుగురు పై కేసు నమోదు

కాకినాడ జిల్లా ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్) ప్రత్తిపాడు ప్రొబిషన్ ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలోగల అల్లూరు మన్యం జిల్లా రంపచోడవరం, అడ్డతీగల మండలం గొ%శీ%టెడుపాలెం లో ఎక్సైజ్ దాడులు నిర్వహించగా 1200 లీటర్ల పులిసిన బెల్లపు ఊట ను ధ్వంసం చేసి రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. అనంతరం ప్రత్తిపాడు మండలంలోని తోటపల్లి, ఓమ్మంగి, చిన్నశంకర్లపూడి గ్రామాలలో దాడులు నిర్వహించగా తోటపల్లి గ్రామంలో తెడ్ల గణేష్ అనే వ్యక్తిని 10 లీటర్లు నాటు సారా తో అలాగే ఓమ్మంగి గ్రామంలో నార్లంక వరలక్ష్మి అనే మహిళ వద్ద 12 లీటర్లు నాటు సారా, చిన్న శంకర్లపూడి గ్రామంలో మానూరి నాగ వెంకట దుర్గా అనే వ్యక్తి వద్ద 25 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకుని అలాగే మానూరి నాగ వెంకట దుర్గా అనే అతనికి సారా సప్లై చేసే పెద్ద శంకర్ల పూడి గ్రామానికి చెందిన కోట సూర్య ప్రకాష్ రావు అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు ఎక్సైజ్ సిబ్బంది తెలియజేశారు, అలాగే శంఖవరం మండలంలో ముగ్గురుపై 128 బిఎన్ఎస్ఎస్ ప్రకారం శంఖవరం తాసిల్దార్ ఎదుట బైండ్ఓవర్ చేసి హాజరు పరిచినట్లు ప్రత్తిపాడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. శివ ప్రసాద్ తెలియజేశారు.ఈ దాడుల్లో కాకినాడ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి రేణుక , అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె జయ మౌనిక , ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు ఇంద్రజిత్, ఈఎస్టిఎఫ్ రంపచోడవర%శీ% మరియు సిబ్బంది శ్రీధర్, ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై పి వంశీరాం సిబ్బంది కె.వి స్వామి, అలాగే ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది ఈ దాడుల్లో భారీ స్థాయిలో పాల్గొన్నారు

మునగాకు నీరు తాగండి.. ఊహించని ప్రయోజనాలు పొందండి!

ఆయుర్వేదంలో మునగను సూపర్ ఫుడ్‌గా పిలుస్తారు.. ఎందుకంటే శరీరానికి అవసరమైన అన్ని పోషకవిలువలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. మునగ చెట్ల ఆకులు, కాయలు, పూలు, మరియు వేర్లు ఇలా అన్ని భాగాలూ ఉపయోగకారమే. వీటిలో శరీరానికి ఎంతో అవసరమైన విటమిన్స్ ఏ, సి, ఈ, తోపాటు పొటాషియం, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. కాల్షియం ఎముకల దృఢత్వానికి అత్యంత కీలకం.మునగాకు పోషకాల ఖజానగా పిలుస్తారు. మునగ ఆకులకి ఆయుర్వేదంలో కూడా ప్రత్యేక స్థానం ఉంది. ఆయుర్వేదంలో చెప్పిన విధంగా వాత, కఫ, పీత వంటి రోగాలను నయం చెయ్యగల లక్షణం మునగ ఆకులకు ఉంది. పరగడుపున మునగ ఆకుల నీటిని తాగడం వలన, శరీరంలో ఉండే మలినాలు శుభ్రం చేస్తుంది. అంతేకాకుండా రక్తంలో చెక్కర స్థాయిని నియంత్రణలో ఉంచడంలోనూ తోడ్పడుతుంది. దీనితో పాటు శరీరానికి అవసరమైన శక్తిని కూడా అందుతుంది. మునగాకులో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటంతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మునగాకు రసం శరీరంలో కొవ్వును కరిగించి, బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణ వ్యవస్థకు మేలు చేస్తుంది. మునగలోని గుణాలు దీర్ఘకాలిక వ్యాధులైన గుండె, మధుమేహాన్ని నియంత్రించడంలో తోడ్పడతాయి. మునగ ఆకుల నీటిని ప్రతిరోజు తాగడం వల్ల ఇలాంటి వ్యాధులు దరి చేరకుండా కాపాడుతుంది. కీళ్లనొప్పులతో బాధపడేవారు మునగాకుల నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో ఇంఫ్లమేషన్ తగ్గి, కీళ్ల నొప్పులు దూరమవుతాయి. ప్రతి రోజూ ఉదయం పరగడుపున మునగాకు నీటిని తాగడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి అనేది పెరుగుతుంది. విటమిన్ సి తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. రోగ నిరోధక వ్యవస్థను బల పరుస్తుంది. దీంతో పలు రకాల ఇన్ ఫెక్షన్లు, రోగాలతో పోరాడే శక్తి లభిస్తుంది. డయాబెటిస్ రోగులకు మునగాకు రసం చాలా ప్రయోజనకరం. శరీరంలోని విషతత్వాలను తొలగించడానికి మునగాకు రసం సహాయపడుతుంది. ఉదయాన్నే మునగాకు రసం తాగడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అయితే మితంగా తీసుకోవడం మంచిది.

సమ్మర్‌లో చల్లగా ఉండాలంటే!

వేసవి కాలం వచ్చేసింది. రోజు రోజుకు ఎండ తీవ్రత విపరీతంగా పెరిగిపోతుంది. భానుడు భగ భగలతో తన ప్రతాపం చూపెడుతున్నాడు. దీంతో చాలా మంది ఏదైనా పని కోసం బయటకు వెళ్లాలంటే, భయపడిపోతున్నారు. ఎందుకంటే విపరీతమైన వేడితో చాలా ఇబ్బందిపడాల్సి వస్తుంది. ముఖ్యంగా బయటకు వెళ్తే వడదెబ్బ తలగడం వలన అలసట వంటి అనేక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అందువలన ఎప్పుడూ శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం వలన అలాంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. కాగా, సమ్మర్‌లో మీ శరీరం ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండాలంటే ఎలాంటి టిప్స్ పాటించాలో ఇప్పుడు చూద్దాం. వేసవి రోజుల్లో మీ శరీరం చల్లగా ఉంచుకోవాలంట. తప్పకుండా రోజూ ఎక్కువ మోతాదులో మంచి నీరు తాగడమే కాకుండా, హైడ్రేటింగ్ జ్యూస్‌లు తీసుకోవాలంట. వేసవిలో చాలా వేడి ఉక్కపోత ఉంటుంది. అందువల ఇలాంటి సమయంలో వేడి నీటికంటే చన్నీటి స్నానమే ఉత్తమం. చల్లటి నీటితో స్నానం చేయడం వలన శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుందంటున్నారు నిపుణులు. వేసవిలో ఎక్కువ నీరు ఉండే పండ్లను మాత్రమే తీసుకోవాలి. మీ ఆహారంలో హైడ్రేటెడ్ ఫ్రూట్స్, కూరగాయలు తీసుకోవడం వలన శరీరం చల్లగా ఉంటుంది. వేడి నుంచి ఉపశమనం పొందవచ్చు. వేసవి రోజుల్లో మీరు ధరించే దుస్తులు కూడా మీ శరీర ఉష్ణోగ్రతపై ప్రభావం చూపిస్తాయి. అందువలన తేలికగా, వదులుగా ఉండే దుస్తులను ఎంచుకోవడం ఉత్తమం.

ఉల్లిపాయ టీ ఆరోగ్య ప్రయోజనాలు

ఉదయం చాలామంది నిద్ర లేవగానే బెడ్ కాఫీ, టీ తాగుతూ ఉంటారు. కొంతమంది అయితే రెండు మూడు కప్పులు కూడా తాగుతూ ఉంటారు. నిజానికి కాఫీకి ఇలా ప్రతిరోజు టీలు, కాఫీలు తాగడం మంచిదేనా? ఇలా తాగడం అస్సలు మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజు ఉదయం టీలు కాఫీలు అతిగా తాగడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలకు దారి తీసే అవకాశాలు ఉన్నాయట. ముఖ్యంగా రోజు ఉదయాన్నే టీ, కాఫీ తాగడం వల్ల కొంతమందిలో పొట్ట సంబంధిత సమస్యలు కూడా వస్తున్నాయి. అందుకే టీ, కాఫీలకు బదులుగా ఉదయాన్నే ఉల్లిపాయతో తయారు చేసిన టీ తాగితే అధిక బెనిఫిట్స్ పొందుతారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉల్లిపాయ టీ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. దీనిలో లభించే మూలకాలు శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. ఉల్లిపాయతో చేసిన టీ ఉదయాన్నే తాగడం వల్ల శరీరానికి ఫ్లైవనాల్ అనే పోషకం పుష్కలంగా లభించి.. రక్తపోటును నియంత్రిస్తుంది. ముఖ్యంగా ఉల్లిపాయ టీ తాగడం వల్ల గుండె సంబంధిత సమస్యలు కూడా రాకుండా ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఆనియన్ టీని ఇంట్లోనే ఎంతో సులభంగా తయారు చేసుకోవచ్చు.. దీనికి కావాల్సిందల్లా కొన్ని మసాలా దినుసులు, ఉల్లిపాయలు. ఉల్లిపాయ టీ నిద్రలేమి, అధిక రక్తపోటు, క్యాన్సర్, చక్కెర స్థాయి, రక్తహీనత, కడుపు సంబంధిత వ్యాధి, బరువును తగ్గించడంలో చాలా సహాయపడుతుంది. మీరు వ్యాధులను దూరంగా ఉంచుకోవాలనుకుంటే ఈరోజు నుండే ఉల్లిపాయ టీని క్రమం తప్పకుండా తాగడం అలవాటు చేసుకోండి. ఉల్లిపాయ టీ తాగడం మీకు కొంచెం వింతగా అనిపించవచ్చు. కానీ మీరు దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే దాని ప్రయోజనాలను మీరు స్పష్టంగా చూస్తారు. ఉల్లిపాయ టీ క్యాన్సర్‌లో సహాయపడుతుంది. మధుమేహం నుండి ఉపశమనం కలిగిస్తుంది. రక్తపోటు నివారణగా పనిచేస్తుంది. ముందుగా ఈ ఉల్లిపాయ టీని తయారు చేసుకోవడానికి ఓ పెద్ద బౌల్ తీసుకోవాలి. అందులో రెండు గ్లాసుల నీటిని పోసుకొని మసాలా దినుసులు అన్ని వేసుకొని, ఉల్లిపాయలు వేసుకొని బాగా ఉడకబెట్టుకోండి. ఇలా అన్నీ ఉడకబెట్టిన తర్వాత ఒక గాజు గ్లాసులోకి టీని సర్వ్ చేసుకుని, అందులో కావలసినంత తేనెను వేసుకొని బాగా మిక్స్ చేసుకోండి. ఇలా మిక్స్ చేసుకుని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే.. అన్ని రకాల అనారోగ్య సమస్యలు దూరమవుతాయి.

శరీరానికి కావాల్సిన పోషకాలు అందించే టాప్ బెస్ట్ ఫుడ్స్

శరీర ఆరోగ్యం మాంసం మరియు తేలికపాటి జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. మనం తీసుకునే ఆహారం శరీరానికి తగిన పోషకాలను అందించాలి. కొన్ని ప్రత్యేకమైన ఆహార పదార్థాలు ఇమ్యూనిటీని పెంచి, జీర్ణక్రియను మెరుగుపరిచే శక్తిని కలిగి ఉంటాయి. ఈ ఆరోగ్యకరమైన ఆహారాలను రోజూ తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది, శరీరం స్ఫూర్తివంతంగా ఉంటుంది. ఆహారం మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ముఖ్యమైన అంశం. సరైన ఆహారం తీసుకుంటే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పోషక విలువలతో నిండిన కొన్ని ప్రత్యేకమైన ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి తగిన న్యూట్రియంట్స్ అందుతాయి. ఆహారం ద్వారా శరీరానికి తగిన ఫైబర్, ప్రోటీన్, విటమిన్లు అందిస్తే ఆరోగ్య సమస్యల నుండి రక్షణ పొందవచ్చు. నల్ల నువ్వులు పోషకాలతో నిండి ఉంటాయి. ఇందులో అధికంగా కాల్షియం, ఐరన్ ఉండటం వల్ల ఎముకలకు చాలా మేలు చేస్తాయి. వీటిని తరచుగా ఆహారంలో చేర్చుకుంటే ఎముకలు బలంగా మారటమే కాకుండా శక్తివంతంగా మారుతాయి. నువ్వుల నూనెను వాడడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది. మఖానా తక్కువ క్యాలరీలతో పాటు మంచి పోషకాలను కలిగి ఉంటుంది. వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. మఖానాలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటంతో ఇవి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. పొడిగా ఉండే మఖానాను కాస్త వేయించి తినడం వల్ల రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యకరంగా కూడా ఉంటుంది. కలోంజీ గింజల్లో అనేక పోషకాలు ఉండటంతో శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇవి జీర్ణ వ్యవస్థను మెరుగుపరచటంతో పాటు కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ప్రతి రోజు తక్కువ మోతాదులో కలోంజీ గింజలు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. మొలకలు ప్రోటీన్, ఫైబర్, ఖనిజలతో నిండి ఉంటాయి. ఇవి జీర్ణ సమస్యలను తగ్గించటంతో పాటు శరీరానికి తగిన విటమిన్లను అందిస్తాయి. మొలకలు తినడం వల్ల రక్తహీనత సమస్య తగ్గిపోతుంది. వీటిని ఉడికించి లేదా పచ్చిగా తీసుకోవచ్చు. పనసలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. దీనిలో విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండటంతో శరీరానికి తగిన పోషకాలు అందుతాయి. పనస తినడం వల్ల గట్ హెల్త్ మెరుగుపడుతుంది. బాదంలో శరీరానికి అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మెదడు పనితీరును మెరుగుపరచటంతో పాటు శరీరానికి తగిన శక్తిని అందిస్తాయి. బాదాన్ని రాత్రి నీటిలో నానబెట్టి తినడం వల్ల ఇంకా మంచి ప్రయోజనాలు పొందవచ్చు. మిల్లెట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ధాన్యాలు. వీటిలో ఫైబర్, ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల ఇవి శరీరానికి పోషకాలను అందించడంలో సహాయపడతాయి. మిల్లెట్స్‌ను ఆహారంలో చేర్చుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా బరువు అదుపులో ఉంటుంది. ఈ ఆరోగ్యకరమైన ఆహారాలను ప్రతిరోజూ డైట్‌లో చేర్చుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి.

జాతిపిత.. కేసీఆర్ గాక ఇంకెవ్వరు?

విశ్వ మానవాళికి శాంతి, అహింస సందేశాలను ప్రబోధించిన మహనీయులు మహాత్మా గాంధీ. ఆయన అందించిన ఆయుధాలు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ. సత్యం, త్యాగం, సహకారం, నిజాయితీ, నిగ్రహం వంటి లక్షణాలు పోరాడేవారికి అవసరం అని గాంధీజీ బోధించారు. వీటన్నింటిని జాతీయోద్యమంలో ఆచరించి, ప్రయోగించి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టారు. అందుకే ఆయనను జాతిపితగా గౌరవించుకుంటున్నాం. సరిగ్గా అలాంటి పరిస్థితులే తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పునరావృతమయ్యాయి. శాంతియుత సత్యాగ్రహం, సహాయ నిరాకరణం, అహింసను మించిన అస్త్రాలు లేవని 14 ఏండ్ల సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానానికి నాయకత్వం వహించిన కేసీఆర్.. గాంధీ బాటలో నడిచి తెలంగాణ సాధించి గాంధేయవాదిగా వినుతికెక్కారు. మలిదశ తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ 2001-14 వరకు నడిపించిన ప్రతి పోరాటంలో శాంతి మంత్రాన్నే జపించారు. అహింసా సందేశాలను బోధిస్తూనే ముందుకుసాగారు. అందుకే తెలంగాణ ఉద్యమ కాలంలో ఏ సంస్థపైనా, ఏ వ్యక్తిపైగానీ దాడులు జరుగలేదు. జాతి యావత్తు ఆశ్చర్యపడేలా శాంతియుత మార్గంలో నడిచి తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రపంచం ముందుంచాం. ఇదంతా కేసీఆర్ నేతృత్వంలోనే సాధ్యమైందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. భారత స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ సత్యాగ్రహ దీక్ష తర్వాత దేశ చరిత్రలో నిలిచిపోయిన గొప్ప సత్యాగ్రహ దీక్షల రూపకర్తలు తెలంగాణ ప్రజలు. హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఈ సత్యాగ్రహదీక్షలే కీలకపాత్ర పోషించాయి. 2009, నవంబర్ 29న కేసీఆర్ గాంధీజీ స్ఫూర్తితో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఇది రాష్ట్ర, దేశవ్యాప్తంగా ఎలాంటి సంచలనాలను సృష్టించిందో తెలిసిందే. చరిత్రలో కేసీఆర్ దీక్ష ఒక మైలురాయి. కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి ఆమరణదీక్షను చేపట్టి మూడు కోట్ల తెలంగాణ ప్రజల ఆశయానికి జీవం పోశారు. కేసీఆర్ స్ఫూర్తితో వేలమంది ప్రజలు స్వచ్ఛందంగా సత్యాగ్రహ దీక్షలు మొదలుపెట్టారు. ఆ దీక్షల ప్రభావంతోనే కేంద్రం అనివార్య పరిస్థితుల్లో దిగిరాక తప్పలేదు. పిడికెడు ఉప్పుతో జాతి యావత్తును కదిలించింది ఉప్పు సత్యాగ్రహం. ఆ ఘటనకు ముందు నిర్వహించబడిన దండియాత్రలా తెలంగాణ పది జిల్లాల ప్రజలు కేసీఆర్ పిలుపు మేరకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ట్యాంక్‌బండ్‌పై 'మిలియన్ మార్చ్‌ను నిర్వహించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని, పోలీసుల నిషేధాజ్ఞలను ధిక్కరించి లక్షలాది మంది ప్రజలు శాంతియుత ర్యాలీలో పాల్గొని జయప్రదం చేశారు. దీని తర్వాత సాగరహారం, సమర దీక్ష, సడక్ బంద్, వంటావార్పు వంటి వినూత్న శాంతియుత ప్రజా ఉద్యమాలు కొనసాగుతూనే వచ్చాయి. ఇక్కడ జరిగిన సకలజనుల సమ్మె జాతీయోద్యమంలో ప్రధాన ఘట్టమైన సహాయ నిరాకరణోద్యమానికి ప్రతీక అని చెప్పవచ్చు. ఇది యావత్తు మలిదశ ఉద్యమంలోనే అత్యంత ప్రధాన ఘట్టం. ఈ సమ్మెలో కోట్ల మంది ప్రజలు పాల్గొన్నా ఎక్కడా ఒక్క హింసాత్మక సంఘటన కూడా చోటుచేసుకోలేదు. ఇలా తెలంగాణ సాధించే వరకు కేసీఆర్ పిలుపుతో దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు ఒకటేమిటి శరపరంపరగా నిర్వహించిన ప్రతీ నిరసన గాంధేయ మార్గంలోనే సాగింది. ఫలితంగా అరువై ఏండ్ల కలను తెలంగాణ ప్రజలు సాకారం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో గాంధేయ మార్గాన్ని అనుసరించి గొప్ప పరిణతిని చూపారు ఇక్కడి ప్రజలు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పాలనాపగ్గాలు చేపట్టిన కేసీఆర్ గాంధేయమార్గాన్ని వీడకుండా వారి ఆలోచనల ను తూచ తప్పకుండా అమలుచేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి నడిపించారు. గంగా జెమునా తెహ్‌జీబ్ సంస్కృతిని కాపాడుతూ జాతీయ సమైక్యతకు, శాంతియుత సహజీవనానికి నాటి తెలంగాణ ప్రభుత్వం ఎనలేని కృషిచేసింది. విద్యతోనే సమాజంలోని అంతరాలను తొలగించవచ్చని, సమానత్వం సాధించవచ్చని తలచి అన్నివర్గాల విద్యాభ్యున్నతి కోసం ప్రత్యేక గురుకుల పాఠశాలలు, కళాశాలలను స్థాపించి పేద పిల్లలు చదువుకోవడానికి తెలంగాణ తొలి ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందించింది. గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం 'దళితబంధు' వంటి ప్రత్యేక పథకాలను అమలుచేసింది. గ్రామాల్లో వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆర్థిక స్వావలంబనతో పాటు, స్వయం సమృద్ధి వైపు నడిపించింది. గాం ధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తెలంగాణ పల్లెల్లో ఆవిష్కృతమైంది. ఇలా స్వరాష్ట్రం సాకారమయ్యేవరకు, ఆ తర్వాతా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం అణువణువునా గాంధేయ మార్గాన్ని, వాదాన్ని నింపుకొని అనుసరించిన వ్యక్తి కేసీఆర్. అందుకే, ఆయననుతెలంగాణ జాతిపితగా కీర్తిస్తున్నాం.

కాంగ్రెస్ అంటేనే విధ్వంసం..

అవును, కాంగ్రెస్ అంటేనే విధ్వంస ం, కాంగ్రెస్ అంటే వినాశనం. కాంగ్రెస్ అంటేనే దాడులు, దమనకాండ. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇదే కథ. ఆరు దశాబ్దాల హస్తం పార్టీ పాలనను పరికించి చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. నాటి ఎమర్జెన్సీ ఇందిరమ్మ రా జ్యం నుంచి నేటి నయా ఇందిరమ్మ రాజ్యం వరకు కాంగ్రెస్ పాలనలో రాజ్యం చేస్తున్న దాడులకు విద్యార్థులు, పేదలు, బడుగులు బలవుతూనే ఉన్నారు. చెప్పినట్టుగానే సీఎం రేవంత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులను తొక్కేసుకుంటూ వచ్చి సీఎం సీటును ఆక్రమించుకున్నాడు. 'ముందొచ్చిన చెవులకన్నా, వెనుకొచ్చి న కొమ్ములు వాడి' అన్నట్టు అధిష్ఠానం కూడా 'ఇక మాకు రేవంతే దిక్కు' అనడంతో ఆయన ఆగడాలకు అడ్డే లేకుండాపోయింది. కాం గ్రెస్ కోరలను రేవంత్ తగిలించుకున్నాక రాజ్యం చేసే అకృత్యాలు శ్రుతిమించిపోయా యి. కార్చిచ్చుకు వాయువు తోడైనట్టు.. వినాశకారి కాంగ్రెస్‌కు రేవంత్‌రెడ్డి తోడయ్యాడు. అందుకే ఇన్ని తతంగాలు. సీఎం రేవంత్ నియోజకవర్గమైన లగచర్ల దమనకాండను మర్చిపోకముందే, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూమిని వేలం వేయడానికి పచ్చని అడవుల్లోకి బుల్డోజర్లను ఉసిగొల్పాడు. అవి సృష్టించిన విధ్వంసకాండతో ఆ అడవిలోని ఉన్న మూగజీవాలు కొన్ని మరణించగా మరికొన్ని ఆర్తనాదాలు పెడుతూ జనావాసాల్లోకి చేరుకున్నాయి. వర్సిటీ భూములను కాపాడుకునేందుకు విద్యార్థులు నిరసనలకు దిగితే వారిని గుంట నక్కలతో పోల్చడం మన సీఎం రేవంత్‌కే చెల్లింది. అంతేకాదు, నిరసిస్తున్న విద్యార్థుల వీపులపై లాఠీలు విరగకొడుతూ, మహిళా విద్యార్థులనే కనీస సోయి లేకుండా జుట్లు పడుతూ పోలీసులు ఈడ్చుకెళ్లడం హేయనీయం. పేదలు, వర్సిటీ భూములపై స్వయంగా రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన రేవంత్ కన్ను పడుతుందనే విషయం తెలిసిందే. అనుకున్నట్టుగానే లగచర్ల భూములపై కన్నేసిన రేవంత్ వాటిని అప్పనంగా కాజేయాలని కుటిలయత్నం చేశాడు. రాబందులా తన్నుకుపోవాలని చూశాడు. అల్లుడికి అయాచిత లబ్ధి చేకూర్చేందుకు, మన బిడ్డ అని నమ్మి ఓట్లు వేసి, అందలమెక్కించిన సొంత నియోజకవర్గం ప్రజలపైనే దాడులకు దిగారు. తన సోదరుడికి లేని పెత్తనం అప్పజెప్పి దౌర్జన్యానికి దారులు తెరిచారు. నోటి కాడి బుక్క లాక్కుంటుండటంతో చేసేదేమీ లేక తిరగబడ్డ రైతులపై కక్షగట్టి రాజ్యాన్ని ఉసిగొల్పారు. పోలీసులు, రౌడీమూకలను అర్ధరాత్రి రైతుల ఇండ్లపైకి పంపి దుశ్శాసన పర్వానికి రేవంత్‌రెడ్డి తెరతీశాడు. ఆడా, మగ తేడా లేకుండా అందరిపై లాఠీలు విరగ్గొట్టారు. దొరికిన వాళ్లను దొరికినట్టు చెరసాలలో బంధించి రాక్షసానందం పొం దాడు. రైతన్నలు తిరుగుబాటు చేస్తున్నా లెక్కచేయక మూర?ంగా ముందుకుపోయిన రేవంత్ ప్రభుత్వం మరో దారిలో భూములను కబళించాలని చూసింది. ఫార్మా క్లస్టర్‌కు బదులు ఇండస్ట్రియల్ కారిడార్ అంటూ మసిపూసి మారేడుగాయ చేయాలని ప్రయత్నించింది. ఏ రా యి అయితే ఏమిటి పండ్లు రాలగొట్టుకోవడానికి అని గ్రహించిన అన్నదాతలు.. ఫార్మా క్లస్టర్ అయినా, ఇండస్ట్రియల్ కారిడార్ అయినా భూములు ఇచ్చేదే లేదని తెగేసి చెప్పారు. రాజ్యంపై పోరును ఉధృతం చేశారు. ఈ క్రమంలో రేవంత్ ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు వేసింది. నేడు హెచ్‌సీయూ ఘటనలోనూ రేవంత్ ప్రభుత్వానికి అదే సీన్ రిపీటైంది. వర్సిటీ భూములను భూ బకాసురులు కబళిస్తున్నారనే విషయం తెలుసుకున్న విద్యార్థులు పొద్దనకా, పగలనకా పోరాటాలు చేశారు, నిరసనలు తెలిపారు. ఈ ఉద్యమాలు ఉధృతం కావడంతో వివాదం దేశవ్యాప్తంగా సంచలనమైంది. హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపమంటూ హైకోర్టు స్టే ఇవ్వడమే కాదు, ఏకంగా సుప్రీం కోర్టు కూడా రేవంత్ ప్రభుత్వానికి గట్టిగా మొట్టికాయలు వేసింది. లగచర్ల ఘటనలో నాడు భూమిపుత్రులు, గిరిజన బిడ్డల ఉద్యమం సఫలీకృతమైతే, హెచ్‌సీయూ వివాదంలో విద్యార్థులు విజయం సాధించారు. 'మా భూములు మాకు కావాలంటూ' అటు రైతన్నలు ఇటు విద్యార్థులు ఎగురవేసిన తిరుగుబావుటా విజయపతాకమై నింగికెగిసింది. రాజ్యం 'హస్త'గతమైందని విర్రవీగుతూ, రాచరికాన్ని మిం చి రాక్షసంగా ప్రజలపై దండెత్తిన ఏలికల గర్వమణిగింది. ప్రపంచాని కి అన్నం పెట్టే అన్నదాత, సమాజాన్ని ఉన్నత మార్గంలో నడిపించే విద్యార్థుల ఆర్తనాదాలను ఆలకించిన హైకోర్టు, సుప్రీంకోర్టులు వీరి పక్షాన నిలబడటంతో రేవంత్ ప్రభుత్వానికి లాగి చెంప మీద ఒక్కటిచ్చినట్టయ్యింది. ఆపదంటే చాలు అక్కున చేర్చుకొని, పేదల పక్షాన నిలిచే బీఆర్ఎస్ పార్టీ నాడు అన్నదాతలకు అండగా నిలిస్తే, నేడు హెచ్‌సీయూ విద్యార్థులకు భరోసా కల్పించింది. వారిపై దెబ్బ పడకుండా అడ్డుగా నిలుచున్నది. రేవంత్ సర్కారును ప్రపంచం ముందు దోషిగా నిలబెట్టింది. పోరుగడ్డ తెలంగాణ పోరాట స్ఫూర్తిని మరోసారి చాటింది. లగచర్ల మహిళామణులు చేసిన ఉద్యమం చాకలి ఐలమ్మ పోరాటాన్ని, రాణి రుద్రమదేవి యుద్ధాన్ని యాదికి తెస్తే, హెచ్‌సీయూ విద్యార్థులు చేసిన పోరాటం మరో తెలంగాణ ఉద్యమాన్ని తలపించింది. ఇది అంతం ఏ మాత్రం కాదు, ఆరంభం మాత్రమే. ఇప్పటికే అన్యాయమై, ఆగమై రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న తెలంగాణ సమా జం ఈ విజయ [illegible]

వాహనాన్ని తీసుక వెళ్లండి..

లేదంటే వేలం వేస్తాం

సిటీ బ్యూరో ఏప్రిల్ 07 సూర్య న్యూస్ : సికింద్రాబాద్ కు చెందిన వాహనం 2013-14లో వికారాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ కేసులో పట్టుబడింది. ఈ కేసు వికారాబాద్ కోర్టులో కొట్టి వేశారు. ఈ కేసులో పట్టుబడిన వాహనాన్ని మాత్రం తీసుక వెళ్లడం లేదు. ఈ విషయంలో వికారాబాద్ కోర్టు ఇచ్చిన అదేశాల మేరకు వాహనాన్ని యజమాని బిక్షపతి గౌడ్ తీసుక వెళ్లక పోతే వేలం వేయాలని అదేశాలు ఇచ్చినట్లు వికారాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట విజయ భాస్కర్ తెలిపారు. ఈ వాహనాన్ని పది రోజుల్లో తీసుక వెళ్లకపోతే కోర్టు ఆదేశాల మేరకు వేలం వేస్తామని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఆర్భాటం లేని కవి.. వీకే శుక్లా

ఈ ఏటి జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత

'కళకైనా, కవితకైనా పెద్ద ఆర్భాటమూ, ఆడంబరమూ ప్రదర్శనా అవసరం లేదు. ప్రచారమూ అవసరం లేదు. నిజానికి అర్థమూ అవే, కాంతీ అవే, బింబమూ అవే, ప్రతిబింబమూ అవే' సరిగ్గా ఈ మాటలకు అర్థం చెప్తూ ఆ భావాలను ప్రతిబింబిస్తూ వీకే శుక్లా రచనలు సాగుతాయి. అది కవిత్వమైనా, కథ అయినా, నవల అయినా అదే సింప్లిసిటీ, అదే సున్నితత్వం, అదే సరళత్వం. ఈ ఏటి జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికైన వీకే శుక్లా రచనలు సీదా సాదా రూపంలోనూ, గాఢమైన అనుభూతులతోనూ సాగుతూ తమదైన ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఆయన రచనాశైలి వినూత్నంగానూ, సులభంగానూ ఉండి ఇట్లా అయితే మనమూ రాయొచ్చు అనిపిస్తుంది. కానీ, ఆ రచనల్లో అంతర్లీనంగా సాగే తాత్త్వికత అంత సులభంగా పట్టుబడేది కాదు. వినోద్‌కుమార్ శుక్లా ప్రసిద్ధ హిందీ కవి, నవలాకారుడు. అంతేకాదు, ఆయన చిన్న కథలూ రాశారు. మ్యాజిక్ రియలిజంకు సమీపంలో ఉండే ఆయన ప్రత్యేకమైన సృజనాత్మక శైలి దేశవ్యాప్తంగా విశేష ప్రశంసలను పొందింది. 1937, జనవరి 1న ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్‌లో జన్మించిన శుక్లాది సామాన్యమైన జీవితం. తాను ఎదుగుతూ, చదువుతూ రాస్తూ తనతోపాటు తన ఆలోచనా లోతులను తాత్త్విక దృక్పథాలను సంలీనం చేసి హిందీ సాహిత్యంలో విశేషమైన కృషిచేశారు. ఆయన రచనలు ఆధునిక హిందీ సాహిత్యంలో ఒక కొత్త దృక్కోణాన్ని పరిచయం చేశాయి. ఆయన తొలి కవితా సంకలనం 'లగ్భగ్ జైహింద్' 1971లో ప్రచురితమైంది. ఇది మనిషి సాధారణ జీవిత సౌందర్యాన్ని కష్టాలను ప్రతిబింబిస్తుంది. ఆయన

రాసిన ప్రసిద్ధ నవలల్లో నౌకర్ కీ కమీజ్‌ను సుప్రసిద్ధ దర్శకుడు మణికౌల్ సినిమాగా రూపొందించాడు. మరొక అద్భుతమైన రచన దీవార్ మే ఏక్ ఖిడ్కీ రహతీ థీ (గోడలో ఒక కిటికీ ఉండేది) 1999లో సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నది. ఛత్తీస్‌గఢ్ నుంచి జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపికైన మొదటి రచయితగా నిలిచారు. శుక్లా రచనా శైలి విలక్షణమైంది. అందులో లక్షణాలు ఉండి, సాధారణ క్షణాలను విశ్వసత్యాలుగా మారుస్తాయి. ఆయన రచనలు మనిషి వ్యక్తిత్వాన్ని, చుట్టూ ఉండే మనుషులను పాత్రలుగా చేసుకొని జీవన తాత్త్విక అంశాలను ఆవిష్కరిస్తాయి. ఆ రచనలు పాఠకులను లోతుగా ఆకట్టుకుంటాయి. ఆయన కవితలు, కథలు సాధారణ మనిషి జీవితంలో ని సూక్ష్మతలను సులభమైన భాషలో ఆవిష్కరిస్తాయి. వీకే శుక్లా రచనలు సాధారణ మనుషుల భావాలను, వారి దైనందిన జీవితాన్ని, సమాజంలోని సంక్లిష్టతలను అందంగా వ్యక్తపరుస్తాయి.

బజార్‌లో ఒక వీధి
బజార్‌లోని ఒక దారిలో
బిజీగా వున్న కొనుగోలుదారు,
చేతిలో రెండు సంచులు పట్టుకున్నాడు
ఒకటి చినిగినది, మురికితో నిండింది
ఒకటి ఖాళీ,
మరొకటి నిండి ఉంది.
సంచిలో బంగాళా దుంపలు,
ఆకు కూరలు,
గరం మసాలా పాకెట్, మిరపకాయలు
ఎరుపు, పచ్చల రంగుల కాంతులతో
తాజా తాజాగా వున్నాయి.
నేనో పది రూపాయల నోటుగా మారి,
ఆ సంచిలో సేదదీరితే
ఎంత బాగుండేది.
అని ఎంతగానో అనుకున్నాను,
కానీ నేనూ
నా సొంత సంచిలోనే చిక్కుకుపోయాను.
హిందీ మూలం: వినోద్ కుమార్ శుక్లా
ఇంగ్లీష్: డేనియల్ వేయిబోర్ట్‌తో కలిసి కవి
స్వేచ్ఛానువాదం: వారాల ఆనంద్

వినోద్‌కుమార్ శుక్లాను సమకాలీన హిందీ సాహిత్యాన్ని 'సింహిక' అని పిలుస్తారు. స్వభావంలో నిశ్శబ్దంగా, ప్రవర్తనలో మృదువుగానూ అస్పష్టంగానూ ఉండి, పాఠకుల్లో చాలామందికి అంతుపట్టని చిక్కు ప్రశ్నగా మిగిలిపోతాడు. ఒంటరితనాన్ని ఇష్టపడే శుక్లా తన రచనా ప్రేరణ కోసం చిన్న పట్టణాల బజార్లు, వాటి పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ, వర్షం నీటిని తప్పించుకుంటూ, రైల్వేస్టేషన్‌లో లేదా బస్‌స్టాప్ వద్ద నిరీక్షిస్తూ జీవితాన్ని పరిశీలిస్తాడు, ఆలోచన చేస్తాడు. ఆయన అనేక ప్రశ్నలు సంధిస్తాడు సమయానికి ధ్వని ఏమిటి? ప్రేమకు వాసన ఎలా ఉంటుంది? ఇట్లా అనేక ప్రశ్నలను సంధిస్తూ తన రచనల్లో పొందుపరుస్తాడు. అంతేకాదు కొత్త వ్యాకరణాన్ని ఆవిష్కరిస్తాడు.

తనకు అవార్డు వచ్చిన తర్వాత

శుక్లా స్పందిస్తూ 'నేను జీవితంలో ఎంతో చూశాను, ఎంతో విన్నాను, ఎంతో అనుభవించాను కానీ, కేవలం కొంచమే రాయగలిగాను. నేను ఎంతో రాయాల్సి ఉందని, ఇంకా చాలా మిగిలి ఉందని అనిపిస్తోంది' అన్నారు. నేనున్నంత కాలం, మిగిలిన రచనలను పూర్తిచేయాలని ఆశిస్తున్నాను, కానీ, నా పని పూర్తిచేయగలిగే అవకాశం తక్కువ. ఈ కారణంగా, నేను ఒక పెద్ద సందిగ్ధంలో పడిపోయాను. నా జీవితాన్ని నా రచనల ద్వారా కొనసాగించాలనుకుంటున్నాను. కానీ, నా జీవితం త్వరితంగా ముగింపు వైపుకు చేరుకుంటున్నది. నేనే ఆ వేగంతో రాయలేను, అందువల్ల కొంతవరకు విచారంగా కూడా ఉంది' అని ఆయన అన్నారు. 'ఈ అవార్డు నాకు చాలా తియ్యనిది అని కూడా నేను చెప్పలేను, ఎందుకంటే నాకు మధుమేహం ఉంది' అని ఆయన చమత్కరించారు.

మోకరిల్లిన మోదీ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు భారత ప్రధాని మోదీ సన్నిహితంగా ఉన్నారని భావిస్తున్న వేళ భారత్‌పై అమెరికా 27 శాతం వాణిజ్య సుంకాలను విధించడం ఆశ్చర్యానికి గురిచేసింది. తొలుత ఈ సుంకాన్ని 26 శాతంగా నిర్ణయించినప్పటికీ వైట్‌హౌస్ దాన్ని27 శాతానికి పెంచింది. మోదీ ప్రభుత్వం మాత్రం ఈ సుంకం 10-15 శాతంగా ఉంటుందని భావించింది. కానీ, ఇప్పుడు ఏకంగా 27 శాతానికి పెంచడం రుచించడం లేదు. రెండు ప్రధాన వాణిజ్య భాగస్వాములైన మెక్సికో, కెనడాపై విధించిన 25 శాతం సుంకాలను ఇది మించిపోవడం గమనార్హం. జపాన్, మలేసియాపై 24 శాతం సుంకం విధించ గా భారత్‌పై ఇంకా ఎక్కువ విధించడం విశేషం. చైనాపై అమెరికా 54 శాతం భారీ సుంకాలను విధించినప్పటికీ ఇది భారత్‌కు ఏ మాత్రం ఉపశమనాన్ని కలిగించదు. ఎందుకంటే, చైనా సమర్థవంతమైన ఉత్పాదకత కలిగిన ఆర్థిక శక్తిగా ఉన్నది. ఇక, వియత్నాంపై 46 శాతం, బంగ్లాపై 37 శాతం, థాయిలాండ్‌పై 36 శాతం సుంకాలను అమెరికా విధించింది. ఎందుకంటే ఈ దేశాల్లో కార్మిక శక్తి చాలా చౌకగా దొరుకుతుంది. మోదీ ప్రభుత్వం అమెరికాను మిత్రదేశంగా భావిస్తున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై భారీ వాణిజ్య సుంకాలను విధించింది. దారుణమైన విషయం ఏమంటే.. భారత్‌ను ఘోరంగా విమర్శించే అమెరికా వాణిజ్యశాఖ నివేదికను ట్రంప్ మీడియాతో పంచుకోవడం. ఈ నివేదిక 2014 తర్వాత భారతదేశం రక్షణాత్మక వాణిజ్య విధానాలను అవలంబించిందని విమర్శించింది. దీని ఫలితంగా, భారత్ నుంచి అమెరికాకు ఎగుమ తయ్యే బంగారు ఆభరణాలు, కార్పెట్లు, పాలు, బియ్యం, ఇతర వస్తువు లు అధిక సుంకాలకు గురికావాల్సి వస్తున్నది. అమెరికాలో భారీ ఎన్నారై మార్కెట్ కారణంగా ఇవి సుంకాల తీవ్రతను ఎదుర్కొంటున్నాయి. అయి తే, మోదీ ప్రభుత్వం దీన్ని తేలికగా తీసుకున్నది. దీనిపై అధికారికంగా స్పందించడానికి సాహసించలేదు. ట్రంప్‌కు దగ్గరగా ఉన్న ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఐరోపా కమిషన్ అధ్యక్షుడు, ఆస్ట్రేలియా ప్రధాని సహా అనేక మంది ప్రపంచ నాయకులు అమెరికా నిర్ణయంపై తీవ్రంగా స్పందించారు. ఈ నిర్ణయం అమెరికాకు ప్రయోజనం చేకూర్చదన్నారు. కానీ, మోదీ ప్రభుత్వం మాత్రం ఆ పాటి ధైర్యం చేయలేకపోయింది. కనీసం అధికారికంగా స్పందించేందుకు అవసరమైన ధైర్యాన్ని కూడగట్టుకోలేకపోయింది. మోదీ ఈ అంశంపై మౌనం పాటించడమే కాకుండా, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను కూడా నోరెత్తకుండా చేశారు. వాణిజ్య మంత్రిత్వ శాఖ మాత్రం దీన్ని పరిశీలిస్తామని ఒక సాధారణ ప్రకటన మాత్రమే ఇచ్చింది. అమెరికా వాణిజ్య సుంకాలను పెంచుతుంటే, అదే సమయంలో భారత ప్రభుత్వం మాత్రం అమెరికాకు పలురకాల రాయితీలిస్తూ ట్రంప్ ఎదుట మోకరిల్లుతున్నది. అధిక ధరల బైక్‌లు, ఎలక్ట్రిక్ వాహనాలు, బోర్బన్ వంటివాటిపై భారత ప్రభుత్వం సుంకాలను తగ్గించింది. అమెరికన్ టెక్ కంపెనీలకు హాని కలిగించే డిజిటల్ సేవల పన్నును కూడా రద్దుచేసింది. ఇందుకు సంబంధించిన సంకేతాలు ఇప్పటికే కేంద్ర బడ్జెట్‌లో కనిపించాయి. ఫిబ్రవరి 1న సమర్పించిన బడ్జెట్‌లో, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఈ రాయితీలను ప్రధాన బడ్జెట్‌లో కాకుండా అనుబంధాల్లో దాచిపెట్టారు. దీనిద్వారా, మోటార్ సైకిళ్లపై 50 శాతం, ఎలక్ట్రిక్ వాహనాలపై 85 శాతం దిగుమతి సుంకాలను తగ్గించారు. ఈ నిర్ణయాలు అమెరికా కంపెనీలకు లాభదాయకంగా ఉంటాయి. ఉదాహరణకు, మోటార్ సైకిళ్లపై సుంకం తగ్గించడం హార్లే డేవిడ్సన్‌కు ఉపయోగపడుతుండగా, ఎలక్ట్రిక్ వాహనాలపై తగ్గింపు టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌కు లాభదాయకంగా మారనున్నది. అయితే, భారతదేశపు స్థానిక కంపెనీలైన మహీంద్రా, టాటా, మారుతీ కంపెనీలను ఇది తీవ్రం గా దెబ్బతీయనున్నది. నిజానికి అమెరికా విధించిన వాణిజ్య సుంకాలు కథలో ఒక భాగమే. అసలైన పెద్ద కథ భారత ప్రభుత్వం అమెరికాకు మరింత రాయితీలు ఇచ్చిన విషయంలో ఉన్నది. వాణిజ్య సుంకాలు పెరగడం, భారత ప్రభు త్వం ఇచ్చే రాయితీలతో కలిపి పరిశీలిస్తే, భారత్ లాభపడుతున్నదా? లేక, నష్టపోతున్నదా? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. మోదీ మద్దతుదారులు దీన్ని మరోవిధంగా ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. వారు దీన్ని భారత్-అమెరికా సంబంధాలను మలుపు తిప్పే పరిణామంగా చిత్రీకరిస్తున్నారు. అయితే, భారత వ్యవసాయ ఉత్పత్తులపై అమెరికాకు మరిన్ని సడలింపులివ్వాలని ప్రతిపాదనలున్నాయి. భారత వ్యవసాయరంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలురకాలుగా సాయం చేస్తున్నాయి. దీనిలో రుణాలపై రాయితీలు, రుణమాఫీ, పంటబీమా, ఎరువులు, ఇం ధనం, విద్యుత్తు, విత్తనాల రాయితీలు వంటివి ఉన్నాయి. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి భారత్ అంగీకరించినట్టయితే, భారత రైతులు తీవ్రమైన ప్రభావాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం భయానకంగా మారుతున్నది. 37 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులును కలిగి ఉన్న భారత్ తన ప్రయోజనాన్ని కోల్పోయే ప్రమాదం ఉన్నది. కానీ, మోదీ ప్రభుత్వం అమెరికాతో సంబంధాలను బలోపేతం చేయడానికి అతి త్వరగా అడుగులు వేస్తున్నది. ఏప్రిల్ 2న అమెరికా విధించిన పరస్పర వాణిజ్య సుంకాల నిర్ణయానికి ముందే, మోదీ ప్రభుత్వం అమెరికాతో చర్చలు ప్రారంభించింది. ప్రస్తుతం, భారత్, అమెరికా మధ్య బహుముఖ వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నా యి. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ త్వరలోనే దీనిపై సంతకం చేసే అవకాశం ఉన్నది. 2030 నాటికి భారత్-అమెరికా వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచే ప్రణాళిక అమెరికాకు ఎక్కువ ప్రయోజనకారిగా మారనున్నది. భారత్ ఇంధన వ్యయాలను అధికంగా చెల్లించాల్సి వస్తుంది. అలాగే వ్యవసాయం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉన్నది. మొదటిసారి, విదేశాంగ విధానాలను ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా మార్చే ప్రయ త్నం జరుగుతున్నది. జనసంఘ్ అమెరికాకు మద్దతుగా ఉన్న రాజకీయం చేపట్టింది. 1977-79 జనతా ప్రభుత్వం కాలంలో అమెరికాతో సంబంధాలను పెంచే ఉద్దేశంతో వాజపేయి 'నిజమైన అలీన విధానం' అనే సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. 1980 ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భవించినప్పటి నుంచీ అమెరికాకు అనుకూలంగా ఉన్న విధానాన్ని కొనసాగించింది. 2003లో ఇరాక్ యుద్ధంలో అమెరికాకు మద్దతుగా భారత్ చేరేలా వాజపేయి ప్రభుత్వం ప్రమాదకర చర్యలు తీసుకున్నది. అప్పటి ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ వాషింగ్టన్‌లో పర్యటించి ఇరాక్‌తో యుద్ధంలో అవసరమైన మిలిటరీ సాయం అందిస్తామని అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్‌కు హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి మోదీ ఎప్పుడూ అమెరికాకు దగ్గరగా ఉండాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నారు.

రేపు ఇందిరా పార్క్ వద్ద ఎమ్మెల్సీ కవిత దీక్ష.. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటుకు డిమాండ్

అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం నాడు దీక్ష చేపట్టనున్నారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్న ఈ దీక్ష ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఇందిరా పార్క్ వద్ద ఏర్పాట్లను సోమవారం నాడు తెలంగాణ జాగృతి నాయకులు నవీన్ ఆచారి, యూపీఎఫ్ కో కన్వీనర్ బొల్ల శివ శంకర్ పరిశీలించారు. బీసీల ఆత్మ బంధువు అయిన మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చాలాకాలం నుంచి ఎమ్మెల్సీ కవిత పోరాటం చేస్తున్న విషయం విదితమే. పలు సార్లు ధర్నాలు, దీక్షలు నిర్వహించడమే కాకుండా విగ్రహ ఏర్పాటు ఆవశ్యకతపై పలు జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను రెండు సార్లు కలిసి వినతి పత్రాలు కూడా అందించారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో పోరాటాన్ని ఉధృతం చేశారు. విగ్రహ ఏర్పాటుపై ఈ నెల 11న పూలే జయంతిలోగా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఇందిరా పార్కు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం బొల్ల శివ శంకర్ విలేకరులతో మాట్లాడుతూ.. బీసీల విషయంలో ప్రభుత్వం చిన్న చూపు తగదని సూచించారు. బీసీల ఆరాధ్య దైవమైన పూలే విగ్రహాన్ని చట్టసభల ఆవరణలో ఏర్పాటు చేసి గౌరవించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ ను ప్రభుత్వం విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. బీసీల అంశాలు, సమస్యలపై అనేక జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించామని, వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని వివరించారు. బీసీలను మోసం చేస్తూ సహించేదే లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కవిత దీక్షకు వేలాది మంది ప్రజలు, బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

అల్లు అర్జున్ కి హీరోయిన్ల సమస్య?

పుష్ప 2 తర్వాత అల్లు అర్జున్ ఎవరితో సినిమా చేస్తాడా అనుకుంటే తమిళ దర్శకుడు అట్లీకే ఓటేశాడు. త్రివిక్రమ్ పేరు కూడా వినిపించింది కానీ అట్లీతో ప్రాజెక్ట్ ఉంటుందని ఈ మధ్య అధికారికంగానూ ప్రకటించారు. ఇక్కడివరకు బాగానే ఉంది. కాకపోతే హీరోయిన్లు ఎవరనే దగ్గర డిస్కషన్స్ జరుగుతున్నాయి. బన్నీ-అట్లీ సినిమాని ఇంటర్నేషనల్ లెవల్లో తీయబోతున్నారు. ఈ మేరకు అనౌన్స్ మెంట్ వీడియోలో దీని గురించి హింట్ ఇచ్చేశారు. కాబట్టి బన్నీకి సరిపోయే హీరోయిన్లని తీసుకోవాలి. ప్రస్తుతానికి తెలుగులో పెద్దగా ఆప్షన్స్ కనిపించట్లేదు. అందుకే బాలీవుడ్ వైపు చూస్తున్నారట. ఇప్పుడైతే జాన్వీ కపూర్, దిశా పటానీ పేర్లు వినిపిస్తున్నారు. వీళ్లు కన్ఫర్మా కాదా అనేది ఇంకా డిసైడ్ కాలేదు. కాకపోతే ఎవరి డేట్స్ అందుబాటులో ఉన్నాయనే దానిబట్టి హీరోయిన్లని తీసుకోవాలని అనుకుంటున్నారట. మొత్తంగా అ?ల్లు అర్జున్ సరసన ముగ్గురు భామలు కనిపించబోతున్నారని తెలుస్తోంది. మరి ఆ లక్కీ ఛాన్స్ ఎవరికి దక్కుతుందో చూడాలి.

పెద్దిలో నా రోల్ చాలా స్పెషల్

కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్ మరోసారి తెలుగు ప్రేక్షకులను అలరించనున్నారు. రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న పెద్ది సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారు. బుచ్చిబాబు సనా డైరెక్షన్‌లో వస్తోన్న ఈ మూవీ షూటింగ్ ఇటీవలే హైదరాబాద్‌లో జరిగింది. ఈ షెడ్యూల్‌లో శివరాజ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ?అమెరికాలో క్యాన్సర్ చికిత్స చేయించుకుని కోలుకున్న తర్వాత షూటింగ్‌కు హాజరయ్యారు. అయితే తెలుగులో మాత్రమే కాకుండా కన్నడలోనూ పలు సినిమాల్లో నటిస్తున్నారాయన. కన్నడ ?స్టార్ ఉపేంద్ర, రాజ్ బి శెట్టి నటిస్తోన్న 45 మూవీలో శివరాజ్ కుమార్ కీ రోల్ ప్లే చేస్తున్నారు. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్ శివుడిగా, ఉపేంద్ర యముడిగా, రాజ్ బి శెట్టి మార్కండేయగా కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సమావేశంలో ఉపేంద్రతో పాటు శివరాజ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ పెద్ది సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'రామ్ చరణ్ పెద్ది మూవీ కోసం 2 రోజులు షూట్ చేశా. ఆ రెండు రోజులు చాలా సరదాగా అనిపించింది. తొలిసారి తెలుగులో మాట్లాడా. డైరెక్టర్ చాలా గుడ్ పర్సన్. నా షాట్‌ను ఆయన అభినందించారు. రామ్ చరణ్ బిహేవియర్ వెరీ గుడ్. ఈ సినిమాలో తొలిసారిగా తెలుగులో డైలాగ్ చెప్పాను. పెద్దిలో నా రోల్ చాలా స్పెషల్. బుచ్చిబాబు స్క్రిప్ట్ చాలా నచ్చింది. నాకు కీమో థెరపీ కంప్లీట్ చేసిన 4 రోజులకే మళ్లీ షూటింగ్ మొదలుపెట్టాను.. టీమ్ అందరూ ఇచ్చిన సపోర్ట్ తోనే షూట్ చేయగలిగాను' అని అన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తుండడంతో బెంగళూరు కప్ ?కొట్టాలని కోరుకుంటున్నారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ఈ సాలా కప్ నమ్దే అని శివరాజ్ కుమార్ తన మద్దతు ప్రకటించారు. ఆర్సీబీకి కూడా ఒక్కసారి కప్ కొట్టే ఛాన్స్ ఇవ్వండని కోరారు.

ఆ అమ్మాయిని కలిసేందుకు వైజాగ్ వచ్చేవాడిని..
హీరో నాని స్టన్నింగ్ కామెంట్స్

నేచురల్ స్టార్ నాని నిర్మాతగా, హీరోగా అదరగొడుతున్నాడు. ఆయన లీడ్ రోల్‌లో హిట్ 3 అనే చిత్రం తెరకెక్కుతుంది. ఈ మూవీని దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కిస్తున్నాడు. ఈ మూవీ ట్రైలర్ సోమవారం రిలీజ్ కాగా, ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నేచురల్ నాని తన పర్సనల్ సీక్రెట్స్ బయటపెట్టారు. 'హిట్- 3' సినిమా ట్రైలర్? లాంచ్ ఈవెంట్ విశాఖపట్టణం నగరంలో జరగగా, ఈ సందర్భంగా విశాఖతో తనకి ఉన్న అనుబంధాన్ని షేర్ చేసుకున్నారు. నా పెళ్లికి ముందు దాదాపు 15 ఏళ్ల కిందట ఇక్కడికి ఓ అమ్మాయిని కలవడానికి వచ్చేవాడని. తర్వాత ఆ అమ్మాయినే పెళ్లి చేసుకున్నాను. అలా నాకు వైజాగ్?తో స్పెషల్ బాండ్? ఏర్పడింది. అప్పుడైనా, ఇప్పుడైనా వైజాగ్?కు వచ్చింది ప్రేమ కోసమే. వేరే ఎక్కడికి వెళ్లినా నన్ను వాళ్లు అన్న లేదా తమ్ముడిలా చూస్తారు. కానీ, వైజాగ్ వచ్చినప్పుడు మాత్రం అల్లుడిలాగే చూస్తారు అంటూ నాని తన భార్య, వైజాగ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇక హిట్ 3 చిత్రం బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ హిట్ నుంచి వస్తున్న 3వ చిత్రం కాగా, ఈ సినిమాకి నాని కథానాయకుడిగా నటించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మే 01న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రమోషనల్ కార్యక్రమాలు నిర్వహించారు.

బాలే.. అస్సలు బాలేదు..
ఎన్టీఆర్ ఎందుకు మరీ ఇంత సన్నగా అయ్యారు..!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ పాత్ర కోసం తన బాడీని మార్చుకుంటారనే విషయం మనందరికి తెలిసిందే. ముందు బొద్దుగా కనిపించి ఆ తర్వాత సన్నబడ్డారు. కృష్ణవంశీ రూపొందించిన ఎమోషనల్ రివేంజ్ డ్రామా %-%రాఖీ%-% వరకు ఎన్టీఆర్ కాస్త లావుగానే ఉన్నారు. అయితే రాజమౌళితో సినిమా చేయాలంటే బరువు తగ్గాల్సిందేనని కండీషన్ పెట్టడంతో యమదొంగ చిత్రంలో చాలా స్లిమ్‌గా కనిపించి అందరిని ఆశ్చర్యపరిచారు. రభస వరకు ఎన్టీఆర్ అదే బాడీని మెయింటైన్ చేస్తూ వచ్చారు. టెంపర్ నుండి కాస్త పెరగడం మొదు పెట్టారు.జనతాగ్యారేజ్ లో కొంత బొద్దుగా కనిపించిన ఎన్టీఆర్ ఆ తరువాత కొంత తగ్గినట్టు కనిపించారు. ఇక దేవరలో బాగానే ఉన్నారు. కాని ఆ తరువాత ఎన్టీఆర్ ఫిజిక్‌లో డ్రాస్టికల్ ఛేంజ్ కనిపించింది. ఇటీవల ఎన్టీఆర్ ఎప్పుడు కనిపించిన చాలా సన్నగా కనిపిస్తున్నారు. ఎందుకు ఎన్టీఆర్ ఇంత సన్నాగా మారాడు, జూనియర్ ముఖంలో మునుపటి గ్లో కనిపించడం లేదని, ఇలా తగ్గడం ప్రమాదకరం అని వాపోతున్నారు. ప్రశాంత్ నీల్ సినిమా కోసం ఇలా తగ్గాడా అని కొందరు ముచ్చటించుకుంటున్నారు. ఎన్టీఆర్ స్క్రీన్‌పై కనిపిస్తే ఓ సింహంలా ఉంటాడని, అలాంటి ఆయనని మరీ బక్కపలచకగా చూడలేకపోతున్నామని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.దీనిపై కళ్యాణ్ రామ్ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం కళ్యాణ్ రామ్.. అర్జున్ %ం/శీ% వైజయంతి మూవీ ప్రమోషన్లలో బిజీగా ఉన్ననేపథ్యంలో ఎన్టీఆర్ ఎందుకు సన్నగా అయ్యారు.. మీరేమైనా ట్రైనింగ్ ఇచ్చారా.. ? అని అడగ్గా.. ఆయన ఆసక్తికర సమాధానం ఇచ్చారు. "ఎన్టీఆర్ ఓ సూపర్ స్టార్. ఇప్పుడు ఆయన పాన్ ఇండియా స్టార్. నేషనల్ లెవల్ కు ఆయన స్థాయి చేరింది. దేశంలోనే టాప్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తో సినిమా చేస్తున్నాడు. వాళ్లిద్దరికీ నేను సలహాలు ఇస్తానా..? నేను, తారక్ ఏం చేసినా సినిమా కోసమే.." అంటూ చెప్పుకొచ్చారు. దీంతో ప్రశాంత్ నీల్ సినిమా కోసమే ఎన్టీఆర్ ఇలా మారాడేమో అని అందరు ముచ్చటించుకుంటున్నారు.

తన సోయగాలతో ఊరిస్తున్న రుక్మిణి వసంత్

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com